

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఉపాధి బకాయిలకు మోక్షం!



- రూ.230 కోట్లు విడుదలకు కేంద్రం ఓకే
- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ వరుస విజ్ఞప్తులు
- రాష్ట్ర వాటా 220 కోట్లు విడుదలకు రంగం సిద్ధం
- 2014-19లో చేసిన ఉపాధి పనులపై జగన్ కక్ష
- 4,22,633 పనుల రికార్డులు మూసివేత

2

శుక్రవారం | 11-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 86 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి రా.2.09 తదుపరి విదియ, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.5.56 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: మ. 2.09-3.48, దుర్ముహూర్తం: ఉ.8.27-9.19, మ.12.46-1.38, అమృతఘడియలు: రా.12.01-1.40, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.51, సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

6 డెన్‌లు

దేశంలోనే అతి పెద్ద మద్యం కుంభకోణంలో విస్తుపోయే రహస్యాలు బయటపడుతున్నాయి. మద్యం తయారీదారుల నుంచి వేల కోట్ల రూపాయలు అందుకుని, ఆ సొమ్ములు దాచిన డెన్‌లు బయటపడ్డాయి. సిట్ అధికారులు హైదరాబాద్‌లో ఐదు, తాడేపల్లిలో ఒకటి గుర్తించారు.

కసిరెడ్డి అనుచరులే కీలకం

లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి అనుచరులు ముడుపులు తీసుకోవడం, డెన్‌లలో దాచడం, ఆ తర్వాత తరలించడం.. వంటి వ్యవహారాలు నడిపించారు. గుట్టు బయట పడకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు డెన్‌లు మార్చేవారు.

లిక్కర్ సొమ్ముతో 'సిద్ధం'!

ఎన్నికల ముందు వైసీపీ అధ్యక్షుడు, అప్పటి సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభలకు లిక్కర్ ముడుపుల నుంచి ఖర్చు చేసినట్టు సమాచారం. కొంత మొత్తం హవాలా మార్గంలో విదేశాలకు తరలించినట్టు తెలుస్తోంది.

జగన్ ప్యాలెస్‌కు సమీపంలో..

డెన్‌లు మార్చే క్రమంలో తాడేపల్లిలో నాటి సీఎం జగన్ ప్యాలెస్‌కు అత్యంత సమీపంలో ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నారు. ఇక్కడి నుంచే ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో వైసీపీ అభ్యర్థుల ఎన్నికల ఖర్చుకు 250 కోట్లు తరలించినట్టు సిట్ ఆధారాలు సేకరించినట్టు తెలుస్తోంది.



లిక్కర్ డాన్‌లు.. ముడుపుల డెన్‌లు

మద్యం ముడుపుల కోసం రహస్య స్థావరాలు!

హైదరాబాద్‌లో 5
తాడేపల్లిలో 1

- జగన్ ప్యాలెస్‌కు సమీపంలోనే డెన్
- అక్కడి నుంచే ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఎన్నికల ఖర్చుకు 250 కోట్లు తరలింపు
- సిద్ధం సభలకు లిక్కర్ సొమ్ము ఖర్చు
- కొంత హవాలా మార్గంలో విదేశాలకు
- పకడ్బందీ వ్యూహంతో సేకరణ, పంపిణీ
- ఏ-1 రాజ్ డైరెక్షన్‌లో కిరణ్, సైమన్ నిర్వహణ
- డెన్‌లు మార్చేస్తూ చిక్కకుండా ఎత్తుగడ
- సిట్ దర్యాప్తులో విస్తుపోయే అంశాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఐఏటీ, ఇంజనీరింగ్, లా పట్టభద్రులు.. జగన్ ప్రభుత్వంలో జరిగిన మద్యం స్కామ్‌లోని కొందరు నిందితులు! వీరు చేసిన 'నిర్వాకం' ఏంటంటే.. మద్యం కంపెనీల నుంచి ముడుపులు తీసుకోవడం, డెన్‌లకు తరలించడం! వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం! లిక్కర్ స్కామ్‌లో ఇలాంటి 'చిత్రవిచిత్రాలు' ఎన్నో ఉన్నాయి. సిట్ విచారణలో తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. దేశంలో ఎన్నో స్కామ్‌లు జరిగాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో సీఎం, డిప్యూటీ సీఎం సైతం అలవోకగా దొరికిపోయారు. కానీ ఏపీ లిక్కర్ స్కామ్ జరిగిన తీరు వింటే.. ఘరానా దొంగలూ ఆశ్చర్యపోవాల్సిందే. మూడున్నర వేల కోట్ల లిక్కర్ స్కామ్‌లో ఎక్కడో తీగ లాగితే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. మద్యం తయారీదారుల నుంచి వేల కోట్ల రూపాయలు అందుకుని, ఆ సొమ్ము దాచిన డెన్‌లు బయట పడ్డాయి. హైదరాబాద్‌లో ఐదు డెన్‌లు, తాడేపల్లిలో ఒకటి ఉన్నట్లు తేలింది. ఆయా డెన్‌లకు చేరిన నోట్ల కట్టల పెట్టెలు, అవి తరలి వెళ్లిన గమ్యాన్ని గుర్తించారు. సిట్ అధికారులు అధునాతన టెక్నాలజీ సాయంతో రహస్య స్థావరాలను పసిగట్టారు. ఆ డబ్బు ఎవరెవరి చేతుల మీదుగా

మిగతా 14వ పేజీలో...



14

సాయిరెడ్డికి మళ్లీ పిలుపు

- రేపు విచారణకు రావాలని సిట్ నోటీసు
- గత విచారణలో పలు విషయాలు వెల్లడి
- ఆ తర్వాత ఊపందుకున్న దర్యాప్తు
- రాజ్ కసిరెడ్డి సహా పలువురి అరెస్టు
- ఇప్పుడేం చెబుతారోననే ఉత్కంఠ

గురువుల గౌరవం పెంచుతాం



శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మెగా పీటీఎం 2.0లో విద్యార్థులతో కలిసి సీఎం చంద్రబాబు ఫొటో

- గ్రామ ఆలయాల వంటివే ప్రభుత్వ బడులు
- వాటిని తల్లిదండ్రులు, టీచర్లే కాపాడుకోవాలి
- చదివిన బడికి పూర్వ విద్యార్థులు చేయూతనివ్వాలి
- పీటీఎం 2.0 స్ఫూర్తి ఇదే.. పేరెంట్ కమిటీలు నా కల
- ఆ కమిటీలను లోకేశ్ మరో ఎత్తుకు చేర్చారు
- బ్యాగులు, పుస్తకాలపై నాడు నేతల ఫొటోలు
- మరుగుదొడ్డి ఫొటోలు పంపాలని టీచర్లపై ఒత్తిడి
- ఆ రోజులు పోయాయి.. ప్రభుత్వ బడిలో 'నో వేకెన్సీ' బోర్డులు పెట్టే పరిస్థితి తెచ్చాం
- 12 డీఎస్సీలు ఇచ్చాం.. తాజాగా మెగా డీఎస్సీ కూడా మా ఘనతే: సీఎం చంద్రబాబు
- గురుపౌర్ణమి రోజున మెగా పీటీఎంతో గిన్నిస్ రికార్డు



కొత్తచెరువు పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు పాఠం చెబుతున్న సీఎం. విద్యార్థులతో కలిసి కూర్చున్న మంత్రి లోకేశ్

అనంతపురం/పుట్టపర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురువుల గౌరవం పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యా శాఖ నిర్వహించిన మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో ఆ శాఖ మంత్రి లోకేశ్‌తో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, గురువులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. కొత్తచెరువు స్కూల్ పరిసరాలను చూస్తుంటే తనకు మళ్లీ చదువుకోవాలని అనిపిస్తోందని,

మిగతా 13వ పేజీలో...

నా పేరెంట్ మీట్‌కు నాన్న వచ్చేవారు కాదు

13

- ముఖ్యమంత్రిగా మీ పిల్లల కోసం వచ్చారు.. మొక్కలు నాటాలన్న పవన్ అన్న సవాల్ స్వీకరిస్తున్నా: లోకేశ్
- 60 వేల బడులు, కాలేజీల్లో మెగా పీటీఎం 2.0
- త్వరలో ఎన్టీఆర్ విదేశీ విద్య అమలు ప్రారంభం

ఉత్తరాన వరదలు.. దక్షిణాన ఎండలు!

- మధ్య, తూర్పు, వాయవ్య భారతాన కుంభవృష్టి
- మధ్య భారతంలోనే తిష్ఠవేసిన నైరుతి.. 2-3 రోజుల్లో దక్షిణాదికీ రాక!
- రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు.. 4 జిల్లాల్లో దుర్భిక్ష పరిస్థితులు
- 8 జిల్లాల్లో సాధారణం.. మిగిలిన జిల్లాల్లో తక్కువ వర్షపాతం
- 13 నుంచి ఉత్తర కోస్తాలో, 15 నుంచి సీమలో వర్షాలు

3

రెవెన్యూ మాన్యువల్స్ సిద్ధం

12

సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్.. చట్టాలు, రూల్స్, జీవోలు సకలం అందులోనే.. అధికారులు, ప్రజలకు అందుబాటులోకి

'బనకచర్ల'కు వాడేది వరద జలాలే

రాష్ట్ర జల వనరుల శాఖకు వాప్కోస్ నివేదిక 12
నేడు జలశక్తి శాఖకు, జల సంఘానికి అందజేత

కేంద్రంతో చర్చలకు 14న ఢిల్లీకి సీఎం

బనకచర్ల ఆవశ్యకతపై ఢిల్లీ పెద్దలకు నివేదిక 12

పోలీసు పరీక్షా ఫలితాలు విడుదల

త్వరలో 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ 12



అమ్మో.. సూపర్‌బగ్స్

యాంటీబయాటిక్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ మందులకు లొంగని మహమ్మారి జీవులతో ముప్పు

- ఆయా మందులను వైద్యులు చెప్పినట్టుగా కాకుండా విచ్చలవిడిగా వాడడం.. మధ్యలో ఆపేయడమే కారణం
- మిగిలిన, గడువు తీరిన మందుల్ని మురుగులో పడేయొద్దు
- దాని వల్ల పర్యావరణంలోకి ప్రమాదకర రసాయనాలు
- ఎల్వీపీఈఐ మైక్రోబయాలజిస్టు డాక్టర్ సంచిత మిత్రా

హైదరాబాద్ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మందులకు లొంగని 'సూపర్‌బగ్స్' సంఖ్య మనదేశంలో రోజురోజుకూ పెరుగుతోందని.. వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా మనకు ఏదైనా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల జ్వరం వస్తే.. వైద్యులు యాంటీ బయాటిక్ మందులు రాస్తారు. కోర్సు ప్రకారం ఆ మందులు వాడితే జ్వరం తగ్గుతుంది. అయితే.. కొంతమంది, డాక్టర్ సూచించిన ప్రకారం పూర్తి కోర్సు వాడకుండా.. తమకు జ్వరం తగ్గగానే ఆ యాంటీబయాటిక్ మందును వాడడం ఆపేస్తారు. అంటే.. వైద్యుడు వారం రోజులు మందు వాడాలని

మిగతా 14వ పేజీలో...



పల్నాడు జిల్లా నిదానంపాడు సమీపంలో పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి అక్రమంగా తవ్వి తీసిన గ్రావెల్ క్వారీలు

మాచర్లలో మైనింగ్ దందా

గత ప్రభుత్వంలో పిన్నెల్లి సోదరుల అక్రమాలు రట్టు

- గ్రావెల్ తవ్వకాల్లోనే 100 కోట్ల దోపిడీ
- 9 లక్షల క్యూబిక్ మీటర్లలో అక్రమ తవ్వకాలు
- అటవీ, రెవెన్యూ భూముల్లో యథేచ్ఛగా లూటీ
- కూటమి ప్రభుత్వం విచారణలో వెలుగులోకి
- క్వార్ట్జ్, నాపరాయి తవ్వకాలపైనా విచారణ
- వీటిపై 70 కోట్లు పెనాల్టీ విధించే అవకాశం

(గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. కూటమి ప్రభుత్వం విచారణలో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. నాడు అధికారం అడ్డు పెట్టుకుని అటవీ, రెవెన్యూ భూముల్లో యథేచ్ఛగా పెద్దఎత్తున మైనింగ్ దందా సాగించినట్టు తేలింది. మాచర్ల నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పిన్నెల్లి సోదరులు 9.50 లక్షల క్యూబిక్ మీటర్లలో రూ.100 కోట్ల విలువైన

మిగతా 14వ పేజీలో...

హెల్త్ ఇన్సూరెన్స్ మోసాలపై ఇక కొరడా

- ఆర్థిక శాఖ పరిధిలోకి రానున్న జాతీయ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజీ
- ఐఆర్‌డీఏఐతో కలిసి పర్యవేక్షణ
- కేంద్ర ప్రభుత్వ యోచన
- ఇప్పటిదాకా ఆరోగ్య శాఖ పరిధిలోనే హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజీ
- పర్యవేక్షణ లేక భారీగా క్లెయిమ్‌లు
- ఏటా పెరుగుతున్న ప్రీమియం
- బీమాకు దూరమవుతున్న ప్రజలు



న్యూఢిల్లీ, జూలై 10: భారత ప్రభుత్వం నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజిని ఆరోగ్య శాఖ పరిధి నుంచి తప్పించి, ఆర్థిక శాఖ పరిధిలోకి మార్చాలని యోచిస్తోంది. అప్పుడు ఆర్థిక శాఖ, భారత బీమా నియంత్రణ అభివృద్ధి సంస్థ(ఐఆర్‌డీఏఐ) కలిసి నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజిని పర్యవేక్షిస్తాయి. 2025లో ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య బీమా ప్రీమియంలు సగటున 10 శాతం పెరుగుతాయని అంచనా వేస్తుంటే భారత్‌లో మాత్రం 13 శాతం పెరుగుతాయని

మిగతా 2వ పేజీలో...

'బాగుంది రా మామా..'



10

- లార్డ్స్‌లో నితీశ్ కుమార్‌రెడ్డి ప్రతిభకు శుభ్‌మన్ గిల్ ఫిదా
- తెలుగులో అభినందన

దుబాయి రియల్ ఎస్టేట్‌లో మనోళ్ల పెట్టుబడులు..

ఈడీ నోటీస్‌లు

- అవినీతి సొమ్ముతో ఎమిరేట్లలో ఏపీ, తెలంగాణ నేతల స్థిరాస్తుల కొనుగోళ్లు
- క్రిప్టో, హవాలా మార్గాల్లో చెల్లింపులు.. అద్దె రూపంలో ఏటా 10-15% రాబడి
- సంపాదనను రిటర్నుల్లో చూపకుండా పన్ను ఎగవేస్తున్నవారిపై ఐటీ కన్ను
- రహస్య మార్గాల్లో వివరాల సేకరణ.. వాటి ఆధారంగా నోటీసులిస్తున్న ఈడీ

12



బెట్టింగ్ యాప్స్ సెలబ్రిటీలపై

రంగంలోకి ఈడీ!

- 29 మందిపై కేసు
- జాబితాలో విజయ్ దేవరకొండ, రానా, ప్రకాశ్‌రాజ్, సిరి, శ్రీముఖి

పరిగణనలోకి ఆధార్ కూడా

- ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు సైతం
- బిహార్‌లో ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు
- ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ రాజ్యాంగబద్ధమేనని ధర్మాసనం స్పష్టీకరణ
- నిలిపివేతకు నో.. తదుపరి విచారణ 28న
- సుప్రీం తీర్పుతో ప్రజాస్వామ్యానికి ఊరట: కాంగ్రెస్

2

మీడియాపై దాడి చేస్తే

కఠిన చర్యలు

13

- న్యూస్ కవరేజ్‌కు వెళ్లినవారిని కొట్టడం హేయం
- వైసీపీ నాయకులు దగ్గరుండి దాడి చేయించారు
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం
- 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శివకుమార్‌కు ఫోన్‌లో పరామర్శ.. అందుతున్న చికిత్సపై ఆరా

8వ వేతన సంఘం.. జీతం 34% పెంపు!

- ఫిట్‌మెంట్ 2.86 ఉండే అవకాశం
- మార్కెట్లో పెరగనున్న వినియోగం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పింఛన్లపై 'అంబిట్ క్యాపిటల్' నివేదిక




న్యూఢిల్లీ, జూలై 10: దేశవ్యాప్తంగా లక్షలాదిమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదార్లు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 8వ వేతన సంఘం.. వేతనాలను, పింఛన్లను 30 నుంచి 34 శాతం మేర పెంచటానికి సిఫార్సు చేయవచ్చని తెలుస్తోంది. అంబిట్ క్యాపిటల్ అనే బ్రోకరేజీ సంస్థ ఈ మేరకు ఇటీవల ఒక నివేదికను విడుదల చేసింది. కొత్త వేతన సంఘం సిఫార్సులతో దాదాపు ఒక కోటీ పది లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని తెలిపింది. వేతనాలు, పింఛన్ల పెంపు వల్ల మార్కెట్లో వినియోగం పెరుగుతుందని, తద్వారా ఆర్థికవ్యవస్థకు లాభం చేకూరుతుందని అంచనా వేసింది.

7వ వేతన సంఘం.. 14% పెంపుదల

2016 జనవరి-2025 డిసెంబరు కాలవ్యవధి కోసం ఏర్పాటైన 7వ వేతన సంఘం సిఫార్సులే ప్రస్తుతం అమలులో ఉన్నాయి. ఈ సంఘం 14 శాతం వేతన పెంపును మాత్రమే సిఫార్సు చేసింది. 1970 నుంచీ ఇదే అత్యంత తక్కువ పెరుగుదలగా నమోదైంది. ఈ ఏడాది జనవరిలో కేంద్రప్రభుత్వం 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ.. చైర్మన్, సభ్యులుగా ఇప్పటికీ ఎవర్నీ నియమించలేదు. వేతన సంఘం విధివిధానాలనూ ప్రకటించలేదు. వాస్తవానికి, వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి 8వ వేతన సంఘం సిఫార్సులు అమలులోకి రావాలి. కానీ, వేతన సంఘం ఇంకా రూపుదాల్చకపోవటం వల్ల 2027 నుంచిగానీ కొత్త వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి వచ్చే అవకాశాలు లేవని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా, 8వ పే కమిషన్‌పై ఉద్యోగులు, పింఛనుదార్లు భారీగా ఆశలు పెంచుకున్న నేపథ్యంలో అంబిట్ క్యాపిటల్ నివేదిక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నివేదిక ప్రకారం.. 8వ వేతన సంఘం 2.86 వరకూ ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను ప్రకటించవచ్చని, దీనివల్లే వేతనాలు, పింఛన్లు 30 నుంచి 34 శాతం వరకూ పెరిగే అవకాశం ఉంది.

పదేళ్లకోసారి పే కమిషన్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను పెంచటానికి పదేళ్లకోసారి వేతన సంఘాన్ని కేంద్రం ఏర్పాటు చేస్తుంది. పే కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన తర్వాత కమిషన్ అమల్లోకి రావటానికి ఏడాదిన్నర నుంచి రెండేళ్ల సమయం పడుతుంది. 7వ పే కమిషన్ ఏర్పాటుపై కేంద్రం 2014 ఫిబ్రవరిలో ప్రకటన చేసింది. కమిషన్ విధివిధానాలు, కూర్పు, క్యాబినెట్ ఆమోదం, నివేదిక తయారీ మొదలైనవాటికి రెండేళ్లు పట్టింది. 2016 జనవరి నుంచి 7వ పే కమిషన్ సిఫార్సులు అమల్లోకి వచ్చాయి.

లోకం తీరు



పరిగణనలోకి ఆధార్ కూడా..

- ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు సైతం
- బిహార్‌లో ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్‌పై సుప్రీం
- ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ
- ప్రక్రియ రాజ్యాంగబద్ధమేనని ధర్మాసనం స్పష్టీకరణ
- నిలిపివేతకు నో.. తదుపరి విచారణ 28న
- సుప్రీం తీర్పుతో ప్రజాస్వామ్యానికి ఊరట: కాంగ్రెస్



న్యూఢిల్లీ, జూలై 10: ఎన్నికల కమిషన్ బిహార్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగంలోని 324 అధికరణ ప్రకారం, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 ప్రకారం చేపట్టిన ఈ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైనదేనని స్పష్టం చేసింది. అయితే.. శాసనసభ ఎన్నికలకు ముందు ఈ ప్రక్రియను నిర్వహించడం ఏమిటని ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించింది. ఓటర్లు తమ గుర్తింపును ధ్రువీకరించుకోవడానికి అనుమతించే పత్రాల జాబితాలో.. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను గుర్తింపు పత్రాలుగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఈ ప్రక్రియపై పలు పార్టీలు, ఎన్జీవోలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అలా దాఖలైన పదికి పైగా పిటిషన్లను.. జస్టిస్ సుధాన్షు ధూలియా, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మానం విచారించింది. ఎన్నికల కమిషన్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది.. ఆధార్‌ను పౌరసత్వ గుర్తింపు పత్రంగా అంగీకరించలేమని కోర్టుకు తెలిపారు. దీనికి కోర్టు.. పౌరసత్వాన్ని ధ్రువీకరించాల్సింది హోం శాఖ అని, అది ఈసీ పని కాదని గుర్తుచేసింది. గుర్తింపు ప్రక్రియకు ఈసీఐ అనుమతిస్తున్న 11 పత్రాల జాబితా సమగ్రమైనదేమీ కాదని.. కనుక, ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను కూడా పరిగణనలోకి తీసుకుంటే అందరికీ న్యాయం జరుగుతుందన్నది తమ అభిప్రాయమని పేర్కొంది. అయితే, దీనిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ఈసీదేనని.. ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కారణాలు మాత్రం వెల్లడించాలని ఆదేశించింది. "మీరు ఈ ప్రక్రియను చేపట్టడం సమస్య కాదు. కానీ.. చేపట్టిన సమయమే సమస్య. నవంబరులో జరిగే శాసనసభ ఎన్నికలకు దీనికి ముడిపెట్టడమెందుకు? ఎన్నికలతో సంబంధం లేకుండా దీన్నెందుకు నిర్వహించలేరు? కొంచెం ముందే దీన్ని ఎందుకు నిర్వహించలేదు?" అని విచారణ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. ఓటర్ల జాబితా ఒక్కసారి ఖరారైతే కోర్టులు అందులో జోక్యం చేసుకోవని.. ఇదంతా ఎన్నికలకు ముందు జరగడం వల్ల.. నష్టపోయిన వ్యక్తులు సవరించిన జాబితాను కోర్టులో సవాల్ చేసే అవకాశాన్ని కోల్పోతారని పేర్కొంది. ఇక.. పిటిషనర్లలో ఒకరైన అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ వాదనలు వినిపించారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలో సమగ్ర సవరణ, సంక్షిప్త సవరణ గురించి మాత్రమే ఉందని.. 'ప్రత్యేక సమగ్ర సవరణ' గురించి అందులో ఎక్కడా లేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఓటరు జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని తెలిపారు. మరీ ముఖ్యంగా 2003 తర్వాత ఓటరుగా నమోదు చేసుకున్నవారంతా తమ గుర్తింపును ధ్రువీకరించుకోవాలంటూ కటాఫ్ తేదీని పేర్కొనడం అన్యాయమన్నారు. పిటిషనర్ల తరఫున వాదన వినిపించిన మరో న్యాయవాది అభిషేక్ సింఘ్వీ.. ఇది ఓటరు జాబితా స్క్రీనింగ్‌లా కాక, పౌరసత్వ స్క్రీనింగ్ ప్రక్రియలాగా ఉందని వ్యాఖ్యానించారు. అందరి వాదనలూ విన్న ధర్మాసనం.. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) ప్రకారం ఈసీకి ఆ అధికారం ఉందని పేర్కొంది. ఈసీని అనుమానించడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది. అయితే, దీనిపై విచారణ జరగాల్సి ఉందని పేర్కొంది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై జూలై 21లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఈసీకి సూచించి.. తదుపరి విచారణను జూలై 28కి వాయిదా వేసింది. ఆలోగా ముసాయిదా జాబితాను ఈసీ ప్రచురించదని పిటిషనర్లకు తెలిపింది.

విపక్షాలకు చెంపపెట్టు: బీజేపీ

ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తింపు ధ్రువీకరణకు.. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకోవాలంటూ సుప్రీం ద్విసభ్య ధర్మాసనం చేసిన సూచన ప్రజాస్వామ్యానికి ఊపశమనాన్నిచ్చిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. ఈసీ ఆ సూచనను పరిగణనలోకి తీసుకుంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. మరోవైపు.. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిలిపివేతకు సుప్రీంకోర్టు నిరాకరించడం, ఆ ప్రక్రియను కొనసాగించడానికి అనుమతించడం ప్రతిపక్షాలకు చెంపపెట్టు అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి రాజీవ్ ప్రతాప్ రూడీ అన్నారు. ఓటర్లను తొలగించేస్తున్నారంటూ ఏడ్చేకన్నా.. ఓటర్ల మనసును చూరగొనే ప్రయత్నం చేయాలని విపక్షాలకు ఆయన సూచించారు.

హెల్త్ ఇన్సూరెన్స్ మోసాలపై ఇక కొరడా

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా గతంలో 20 శాతం వరకు పెరిగిన బీమా ప్రీమియంలు 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 9 శాతం పెరిగాయి. భారతదేశంలో మాత్రం 12 శాతం పెరిగాయి. ఆసుపత్రులు వైద్యానికి ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో దేశంలో వైద్య బీమా ప్రీమియంలు భారీగా పెరుగుతున్నాయి. దీని వల్ల ప్రజలు ఆరోగ్య బీమాకు మరింత దూరమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజీని ఆర్థిక శాఖ పరిధిలోకి తెచ్చి బలోపేతం చేస్తే ఆసుపత్రులతో బేరమాడే శక్తి బీమా కంపెనీలకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ హెల్త్ ఎక్స్ఛేంజీ బీమా సంస్థలకు, ఆసుపత్రులకు, ఆరోగ్య బీమా చేయించుకొనే వారికి అనుసంధానకర్తగా వ్యవహరిస్తుంది. ఇక నుంచి ఐఆర్‌డీఏఐ బీమా మోసాలను పసిగట్టడంలో, ధరలను పర్యవేక్షించడంలో, క్లెయిమ్‌ల ప్రామాణికతను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రిజర్వు బ్యాంకు తరహాలో నియంత్రణ బాధ్యతలు చేపడుతుంది. క్లెయిముల డేటా మొత్తం ఒకచోట ఉండటం వల్ల బీమా సంస్థలు బిల్లులను పెంచి చూపించే ఆస్పత్రులను ఇట్టే పసిగట్టి పక్కనపడేస్తాయి. విధివిధానాలు పాటించని బీమా సంస్థలకు భారీగా జరిమానాలను విధించేందుకు అవకాశం ఉంటుంది. ఇలా చేయడం ద్వారా క్లెయిముల భారం తగ్గి ప్రీమియం కూడా బాగా తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్రీకృత పోర్టల్ వల్ల పారదర్శకంగా, ప్రమాణాలతో కూడిన క్లెయిముల పరిష్కారం జరుగుతుంది. వృథా, మోసం, నిర్వహణ వైఫల్యాలను అరికట్టవచ్చు. ఒకే చోట డేటా ఉండటం వల్ల తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు పసిగట్టవచ్చు. అనుగుణంగా మార్పులు చేసుకోవచ్చు.

సీఎం విధుల బహిష్కరణ!

- పుదుచ్చేరిలో 3 రోజులుగా స్తంభించిన పాలన
- లెఫ్టినెంట్ గవర్నర్ నిరంకుశ వైఖరికి వినూత్న నిరసన

చెన్నై, జూలై 10(ఆంధ్రజ్యోతి): పరిపాలనా వ్యవహారాల్లో లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) కైలాశ్‌నాథ్ అతిగా జోక్యం చేసుకుంటున్న తీరుకు నిరసనగా కేంద్రపాలితప్రాంతం పుదుచ్చేరిలో సీఎం రంగస్వామి, ఆయన పార్టీకి చెందిన మంత్రివర్గ సహచరులు మూడు రోజులుగా విధులను బహిష్కరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేసిన ఎన్ఆర్ కాంగ్రెస్ అధినేత రంగస్వామి సీఎం పీఠం దక్కించుకున్న విషయం తెలిసిందే. బీజేపీకి కూడా ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించారు. అయితే, తాను పేరుకే ముఖ్యమంత్రినని, కనీసం విద్యార్థుల నోటుపుస్తకాలకు కూడా నిధులు విడుదల చేయలేని స్థితిలో ఉన్నానంటూ పలుమార్లు ఆయన వాపోయారు. దీనికితోడు పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇస్తామన్న హామీపై కేంద్రం ఏమాత్రం స్పందించకపోవడం పట్ల ఆయన కినుక వహించారు. ఈ నేపథ్యంలో ఎల్జీ తనను కనీసం సంప్రదించకుండా ఐఏఎస్ అధికారులను బదిలీ చేయడం, పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని రంగస్వామి జీర్ణించుకోలేకపోతున్నారు. పలు కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్ల కాంట్రాక్టులను పునరుద్ధరించేందుకు క్యాబినెట్ చేసిన సిఫారసులను కూడా ఎల్జీ తిరస్కరించినట్లు సమాచారం. ఈ వ్యవహారాలపై రంగస్వామి కేంద్రాన్ని సంప్రదించినా స్పందన లేదని సమాచారం. దీంతో మనస్తాపం చెందిన రంగస్వామి, ఆయన మంత్రివర్గ సహచరులు మూడు రోజుల నుంచి విధులను బహిష్కరించారు. దీంతో పుదుచ్చేరిలో పాలన స్తంభించింది.

ఏఐతో మైక్రోసాఫ్ట్‌కు రూ.4 వేల కోట్లు ఆదా!

- వందేళ్లయినా ఏఐ ఆ పనులైతే చేయలేదు: బిల్‌గేట్స్

వాషింగ్టన్, జూలై 10: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన కార్యకలాపాల్లో కృత్రిమ మేధ (ఏఐ)ను వాడుతూ ఓ వైపు భారీ లబ్ధి పొందుతుంటే.. మరో వైపు ఏఐ ఇంకా 100 ఏళ్లయినా కొన్ని పనులు అస్సలు చేయలేదంటూ ఆ కంపెనీ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ చెబుతున్నారు. గత ఏడాది ఏఐ వినియోగం ద్వారా 500 మిలియన్ డాలర్లు (రూ.4,285 కోట్లు) ఆదా చేసిన మైక్రోసాఫ్ట్.. అదే సమయంలో 9,100 మంది ఉద్యోగులను తొలగించడం గమనార్హం. 'ముఖ్యంగా కాల్ సెంటర్ కార్యకలాపాల్లో ఏఐని వాడటంతో ఖర్చు భారీగా తగ్గింది. అంతేకాకుండా కస్టమర్లకు మెరుగైన సేవలందుతున్నాయి' అని మైక్రోసాఫ్ట్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ జడ్సన్ ఆల్థోఫ్ తెలిపారు. అయితే ఏకంగా 9,100 మంది ఉద్యోగులను తొలగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉండగా.. ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఏఐపై ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇంకా 100 ఏళ్లయినా ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదన్నారు. కోడింగ్‌కు కూడా మానవ మేధ అవసరమని చెప్పారు.

ఇన్‌స్టా రీల్స్ చేస్తోందని టెన్నిస్ క్రీడాకారిణిని కాల్చి చంపిన తండ్రి!



లఖ్‌నవూ, జూలై 10: యూపీలోని గురుగ్రామ్‌కు చెందిన ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ (25) దారుణహత్యకు గురయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమె అదేపనిగా రీల్స్ చేస్తున్నారని, ఆమె తీరు కారణంగా తెలిసిన వాళ్ల ఎదుట తలెత్తుకోలేకపోతున్నాననే కారణంతో కన్న తండ్రే ఆమెను తుపాకీతో కాల్చి చంపాడు. గురుగ్రామ్‌లోని ఆమె ఉంటున్న నివాసంలోనే ఈ ఘటన జరిగింది. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాధిక ఎన్నో పతకాలు సాధించారు. ఇటీవల ఆమెకు గాయం కావడంతో ప్రొఫెషనల్ టెన్నిస్‌కు దూరంగా ఉంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రభావశీల వ్యక్తిగా ఎదగాలనే లక్ష్యంతో ఆమె కొన్నాళ్లుగా రీల్స్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తున్నారు. గురువారం ఉదయం 10:30కు ఇంట్లోనే రాధికపై ఆమె తండ్రి కాల్పులు జరిపాడు. మూడు బులెట్లు ఆమె శరీరంలో దిగాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆమె తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. ఎప్పుడూ కూతురు సోషల్ మీడియాలో కనిపిస్తోందంటూ తెలిసిన వాళ్లు వెక్కిరిస్తుండటంతో గత 15 రోజులుగా తీవ్ర ఒత్తిడిలో ఉన్నానని పోలీసుల విచారణలో నిందితుడు చెప్పాడు.

2 వారాల్లో పూర్తి సమాచారం ఇవ్వండి

- ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలకు ధర్మాసనం ఆదేశం
- ఆ సమాచారం ఆధారంగా తాత్కాలిక ఫీజు ఖరారు



అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల ఫీజుల విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. ఫీజులు ఖరారు చేసేందుకు వీలుగా రెండు వారాల్లో నిబంధనల్లో నిర్దేశించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఏపీహెచ్ఈఆర్ఎంసీ)కు అందజేయాలని కాలేజీల యాజమాన్యాలను ఆదేశించింది. ఈ సమాచారం ఆధారంగా తాత్కాలిక ఫీజు ఖరారు చేయాలని ఏపీహెచ్ఈఆర్ఎంసీకి స్పష్టం చేసింది. అనంతరం తాత్కాలిక ఫీజు ఖరారు వర్క్‌షీట్లను కాలేజీ యాజమాన్యాలకు అందజేయాలని పేర్కొంది. దీనివల్ల ఫీజుల విషయంలో తమ వాదనలు వినిపించేందుకు కాలేజీలకు అవకాశం ఉంటుందని పేర్కొంది. కాలేజీలు కోరిన ఫీజులో కోత విధిస్తే అందుకుగల కారణాలను ఏపీహెచ్ఈఆర్ఎంసీ నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఫీజు ఖరారు కోసం అవసరమైన సమాచారాన్ని కాలేజీల నుంచి కోరకుండా కమిషన్‌ను నియంత్రిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను తప్పుపట్టింది. ఫీజులు ఖరారు చేసేందుకు కాలేజీల నుంచి సమాచారాన్ని కోరడం తప్పుకాదని పేర్కొంది. సెమినార్లు, వర్క్‌షాపులు, గార్డెనింగ్ నిర్వహణ ఖర్చుల విషయంలో కాలేజీలకు ఏపీహెచ్ఈఆర్ఎంసీ పరిమితులు విధించడాన్ని తప్పుబట్టింది. కాలేజీల నుంచి వివరాలు తెప్పించుకొని, ఏపీహెచ్ఈఆర్ఎంసీ ఫీజు ఖరారు చేసి, రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసేవరకు 2023-26 బ్లాక్ పీరియడ్‌కు జీవో 17 ప్రకారం ఖరారు చేసిన ఫీజు తాత్కాలికంగా అమల్లో ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. 2023-26 బ్లాక్ పీరియడ్‌కు ఏపీహెచ్ఈఆర్ఎంసీ ఖరారు చేసిన ఫీజులను సవాల్ చేస్తూ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి మద్దిశెట్టి శ్రీధర్, మరికొన్ని కాలేజీలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఫీజు ఖరారు విషయంలో కమిషన్ వైఖరిని తప్పుబట్టారు. చట్టనిబంధనలు అనుసరించి అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా ఫీజు ఖరారు చేయాలని కమిషన్‌ను ఆదేశించారు. కాలేజీల నుంచి సమాచారం కోరకుండా కమిషన్‌ను నియంత్రిస్తూ 2023 డిసెంబరు 5న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీహెచ్ఈఆర్ఎంసీ హైకోర్టులో అప్పీల్ చేసిన విషయం తెలిసిందే.

ఉపాధి బకాయిలకు మోక్షం!

- 230 కోట్లు విడుదలకు కేంద్రం ఓకే

అమరావతి/న్యూఢిల్లీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): 2014-19 మధ్య కాలానికి సంబంధించి ఉపాధి హామీ పథకం పెండింగ్ బకాయిల విడుదలకు మార్గం సుగమమైంది. సుమారు రూ.230 కోట్లు కేంద్రం వాటా నిధులను విడుదల చేసేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. వైసీపీ హయాంలో ఉపాధి హామీ పనులపైనా కత్తికట్టారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపును వైసీపీ అధికారంలోకి రాగానే నిలిపివేసింది. పనులు చేసిన వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. వీరికి బిల్లులు చెల్లించాలని తీర్పులు రావడంతో.. వైసీపీ ప్రభుత్వం ఏకంగా పనులన్నీ పూర్తయిపోయినట్లు కేంద్రానికి నివేదికలు పంపింది. దీంతో 4,22,633 పనులు పూర్తయినట్లు పేర్కొంటూ క్లోజ్ చేసేసింది. ఈ పనులకు కేంద్రం వాటాగా రావాల్సిన రూ.330 కోట్ల నిధులకూ తలుపులు మూసేసింది. కోర్టులకు వెళ్లినా ప్రయోజనం లేకుండా చేసింది. అప్పులు తెచ్చి మరీ పనులు చేసిన వారిలో కొందరు ఆత్మహత్యలు చేసుకోగా.. మరికొందరు వడ్డీలు కట్టుకుంటూ మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయారు. 2024లో కూటమి అధికారంలోకి రాగానే ఉపాధి బకాయిలపై దృష్టిసారించింది. చిక్కుముడులను విప్పుకొంటూ నిధుల విడుదలకు మార్గం సుగమం చేసింది. కేంద్రంతో మాట్లాడి అప్పట్లో పూర్తయినట్లు చూపిన పనులను తిరిగి ఆన్‌గోయింగ్ వర్క్స్‌గా చూపాలని విజ్ఞప్తులు చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు వైసీపీ హయాంలో పూర్తయినట్లు చూపిన పనుల్లో 3,52,788 పనులను ఆన్‌గోయింగ్ పనులుగా చూపేందుకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఫలితంగా కేంద్రం నుంచి రావాల్సిన సుమారు రూ.230 కోట్ల నిధుల విడుదలకు మార్గం సుగమం అయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తుల మేరకు కొద్ది రోజుల క్రితం రూ.100 కోట్ల పెండింగ్ ఉపాధి నిధులను కేంద్రం విడుదల చేసింది. కొద్ది రోజుల్లో రూ.230 కోట్ల నిధులు కూడా విడుదల కానున్నాయి. వీటితోపాటు మ్యాచింగ్ గ్రాంటుగా ఇవ్వాల్సిన రూ.220 కోట్ల నిధులను త్వరలోనే విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. పెండింగ్ ఉపాధి నిధుల విడుదలకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఉపాధి హామీ పెండింగ్ నిధుల సాధన కమిటీ కన్వీనర్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. కక్షసాధింపులు ఎల్లకాలం చెల్లవని మరోసారి రుజువైందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం కూడా తగిన మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించి, 30 రోజుల్లోగా కాంట్రాక్టర్లకు అన్ని బిల్లులు చెల్లించేలా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించామని తెలిపారు.

అమరావతిని అభివృద్ధి చేయలేక మాపై విమర్శలు: బుగ్గన

పంజాగుట్ట, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని కూటమి ప్రభుత్వం ఎందుకు అభివృద్ధి చేయడం లేదని వైసీపీ నేత బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రశ్నించారు. అమరావతిని అభివృద్ధి చేయలేకే తమపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. అప్పుల గురించి అడిగితే దేశద్రోహులను ముద్ర వేస్తున్నారని హైదరాబాద్‌లో విమర్శించారు. రాష్ట్రానికి డబ్బు రాకుండా వైసీపీ కుట్రలు చేసిందని, ఏపీ బాండ్లు కొనద్దంటూ పలు ఆర్థిక సంస్థలకు మెయిల్స్ చేసిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

నిమిష ప్రియ మరణశిక్షపై చివరి నిమిషంలో మలుపు

ఆదుకోవాలంటూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం.. 14న విచారణ

- 16నే శిక్ష అమలు చేయనున్నట్టు యెమెన్ ప్రకటన
- దౌత్యపరంగా సాయం చేయాలని ఏజీకి సూచన
- 'బ్లడ్ మనీ' చెల్లిస్తే శిక్ష రద్దు



న్యూఢిల్లీ, జూలై 10: హత్య చేసిందన్న నేరంపై యెమెన్ దేశంలో మరణశిక్ష పడ్డ కేరళ నర్సు నిమిష ప్రియ (36) కేసు చివరి నిమిషంలో మలుపు తిరిగింది. ఆమెను భారత ప్రభుత్వం కాపాడాలని కోరుతూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలయింది. దానిపై ఈ నెల 14న విచారణ జరపనున్నట్టు గురువారం సుప్రీంకోర్టు ప్రకటించింది. ఆమెను ఈ నెల 16న ఉరితీయనున్నట్టు ఆ దేశ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించడం గమనార్హం. 'నిమిష ప్రియ- ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' ఈ పిటిషన్ దాఖలు చేసింది. దీనిని జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ జోయ్‌మాల బాగ్చీల ధర్మాసనం విచారణకు స్వీకరించింది. కేసుపై విచారణ చేపట్టేలోగా దౌత్యపరమైన సహాయం పొందే విషయమై అటార్నీ జనరల్ (ఏజీ) కార్యాలయాన్ని సంప్రదించాలని పిటిషన్ దాఖలు చేసిన సీనియర్ న్యాయవాది రఘేంత్ బసంత్, న్యాయవాది సుభాష్ చంద్రన్ కేఆర్‌లను సూచించింది. దౌత్యపరంగా సాయం చేసే విషయాన్ని పరిశీలించాలని కేంద్రానికి తెలిపింది. తమ తరఫున సాధ్యమైనంత సాయం చేస్తామని ఇరాన్ దేశ దౌత్యాధికారి ఒకరు చెప్పినట్టు తెలిసింది. యెమెన్ దేశంలో అంతర్యుద్ధం నడుస్తుండడం, ప్రయాణాలపై ఆంక్షలు ఉండడంతో ఆమెకు సహాయం అందించడం కష్టంగా మారింది. హత్యకు గురయిన వ్యక్తి కుటుంబానికి 'దియాహ్' (రక్తపు సొమ్ము- బ్లడ్ మనీ) కింద తగినంత సొమ్ము ఇచ్చి, వారి క్షమాభిక్ష కోరితే శిక్ష నుంచి తప్పించుకునే అవకాశం ఉన్నా ఆంక్షల కారణంగానే సాధ్యపడడం లేదు. అందువల్ల ఉన్నత స్థాయిలో దౌత్యపరంగా జోక్యం చేసుకోవడమే మార్గమని న్యాయవాదులు సూచించారు. ఈ దిశగా ప్రభుత్వానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 'బ్లడ్ మనీ' చెల్లింపునకు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈలోగా మరణశిక్ష అమలును వాయిదా వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఆమెకు ఆర్థిక సాయం చేయాలని పలువురు ఎంపీలు ప్రభుత్వాన్ని కోరారు. నర్సింగ్ శిక్షణను పూర్తి చేసుకున్న నిమిషప్రియ 2008లో యెమెన్ వెళ్లి రాజధాని సనాలోని పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో పనిచేసింది. యెమెన్‌లో అంతర్యుద్ధం చెలరేగడం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో 2014లో ఆమె భర్త, చిన్నపాప అయిన కుమార్తెను తీసుకొని భారత్‌కు తిరిగి వచ్చేశారు. ఆమె మాత్రం అక్కడే ఉండి స్థానిక వ్యక్తి మెహదీ సాయంతో ఆస్పత్రి ప్రారంభించింది. యెమెన్‌లో వ్యాపారం చేయాలంటే స్థానిక భాగస్వామ్యం తప్పనిసరి కావడంతో ఆమె ఆ నిర్ణయం తీసుకోకతప్పలేదు. అతడు మోసగించడంతో నష్టపోయింది. అతడు లాక్కొన్న తన పాస్‌పోర్టును తిరిగి తీసుకునే క్రమంలో 2017లో అతడికి మత్తుమందు ఇచ్చింది. మత్తుమందు డోస్ ఎక్కువ కావడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఆరోపణను ఆమెను తిరస్కరించింది. నీళ్ల ట్యాంకులో శవం లభించడంతో హత్యా నేరాన్ని మోపారు. విచారణ జరిపిన కోర్టు ఆమెకు 2020లో మరణశిక్ష విధించింది. ఆమె చేసిన అప్పీలును 2023లో సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆమెకు విధించిన మరణశిక్షకు ఆమోదం తెలుపుతూ హౌతీ రెబల్ గ్రూపు సుప్రీం కౌన్సిల్ హెడ్ మహదీ అల్ మషాత్ జనవరి నెలలో ఆదేశాలు ఇచ్చారు. అందుకు అనుగుణంగా మరణశిక్ష విధింపునకు తేదీని ఖరారు చేశారు. దానిని నిలువరించే దిశగా ప్రస్తుతం భారత్‌లో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

ఏడుగురి జీవితాల్లో జ్యోతిర్ వెలుగులు

- బ్రెయిన్ డెడ్ వ్యక్తి నుంచి అవయవాల సేకరణ
- తిరుపతిలో విజయవంతంగా గుండె మార్పిడి



గుంటూరు మెడికల్, తిరుపతి (వైద్యం), జూలై 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించిన వ్యక్తి అవయవదానం చేసి మరో ఏడుగురు జీవితాల్లో వెలుగులు నింపారు. ఆ వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో పలువురికి కొత్త జీవితాన్ని ప్రసాదించాయి. విజయవాడలోని గవర్నర్‌పేటకు చెందిన శొంఠి జ్యోతిర్ భాను (56) ఈ నెల 7వ తేదీ ఉదయం వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా స్కూటీపై ట్రిపుల్ రైడింగ్ చేసుకుంటూ గుర్తుతెలియని వ్యక్తులు బలంగా ఢీకొట్టారు. తలకు తీవ్ర గాయాలైన ఆయనను సమీపంలోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు తరలించారు. మెదడులో రక్తస్రావం జరుగుతున్నట్లు గుర్తించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆయనను గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు తరలించారు. అక్కడి వైద్యులు ఆయనను బ్రెయిన్ డెడ్ అయినట్లు గుర్తించి జీవన్‌దాన్ ప్రతినిధులకు సమాచారం అందించారు. వారు రోగి కుటుంబ సభ్యులతో మాట్లాడి.. అవయవదానం ఆవశ్యకతను తెలియజేసి వారి అనుమతి పొందారు. అనంతరం గురువారం దాత నుంచి గుండె, రెండు కిడ్నీలు, కాలేయం, ఊపిరితిత్తులు, రెండు కళ్లను సేకరించారు. ఒక కిడ్నీని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ గుంటూరుకు, రెండో కిడ్నీని క్యాపిటల్ హాస్పిటల్‌కు, గుండెను తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి, ఊపిరితిత్తులను తెలంగాణలోని కిమ్స్ హాస్పిటల్స్‌కు (సికింద్రాబాద్), కాలేయాన్ని మణిపాల్ హాస్పిటల్స్‌కు, కళ్లు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు పంపారు. అవయవదానానికి అంగీకరించిన జ్యోతిర్ భాను కుటుంబ సభ్యులను ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అభినందించారు.

గ్రీన్‌చానల్ ద్వారా తిరుపతికి గుండె

బ్రెయిన్‌డెడ్ అయిన జ్యోతిర్ భాను గుండెను తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 34 ఏళ్ల వ్యక్తికి అమర్చారు. ఆయన కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయలో చికిత్స పొందుతున్నారు. ఇక్కడ దాదాపు 8 గంటలు శ్రమించి గుండెమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసింది. దీంతో ఇప్పటి వరకు 20 గుండె మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

భారత్‌పై 500% సుంకం.. పూర్తిగా నా అభిమతమే!

- రష్యా నుంచి చమురుకొనే దేశాలపై భారీ సుంకాల బిల్లుకు ట్రంప్ మద్దతు

వాషింగ్టన్, జూలై 10: రష్యా నుంచి ముడి చమురు, ఇతర ఇంధనాలను కొనుగోలు చేసే భారత్, ఇతర దేశాల దిగుమతులపై ఏకంగా 500% సుంకాలు విధించే బిల్లు తన అభిమతం ప్రకారం రూపొందినదేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. తన సన్నిహితుడు, రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించిన 'శాంక్షనింగ్ రష్యా యాక్ట్-2025' బిల్లుకు మద్దతు తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపేలా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు భారీగా ఆంక్షలు, సుంకాలు విధించేలా లిండ్సే గ్రాహమ్ ఈ బిల్లును ప్రతిపాదించారు. రష్యాకు కీలక ఆదాయ వనరులైన ముడి చమురు, సహజవాయువు, యురేనియం, తదితర ఇంధనాలను ఇతర దేశాలు కొనుగోలు చేయకుండా నియంత్రించడం కూడా ఇందులో భాగం. అలా రష్యా నుంచి ఇంధనాలు కొనుగోలు చేసే దేశాలపై 500% సుంకాలు విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. రష్యా ఇంధన ఎగుమతుల్లో సుమారు 70% భారత్, చైనాలే కొనుగోలు చేస్తున్నాయి. రష్యాపై ఆంక్షల బిల్లు చట్టంగా మారితే.. రష్యాతోపాటు భారత్, చైనాలపై ప్రభావం పడుతుంది. యూరప్‌కు చెందిన ది సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అంచనాల ప్రకారం.. ఈ ఏడాది ఒక్క మే నెలలోనే రష్యా నుంచి భారత్ చేసిన ఇంధన కొనుగోళ్లు సుమారు రూ.42 వేల కోట్ల (420 కోట్ల యూరోలు) పైమాటే.

టీటీడీ ఈవో పేరుతో ఫేస్‌బుక్‌లో నకిలీ అకౌంట్

» విచారణకు ఆదేశించిన టీటీడీ

తిరుమల, జూలై 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల అగడాలకు తిరుమల వేదికగా మారుతోంది. ఏకంగా టీటీడీ ఈవో శ్యామలరావు పేరుతోనే ఫేస్‌బుక్‌లో నకిలీ అకౌంట్ క్రియేట్ చేశారు. 'శ్యామల రావు ఐఏఎస్' అనే పేరుతో ఉన్న ఇందులో ఈవోకు సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా అప్‌లోడ్ చేశారు. ఇది తనది కాదని ఈవో శ్యామలరావు తేల్చిచెప్పారు. దీనిపై విచారణ చేపట్టాలని టీటీడీ విజిలెన్స్ విభాగాన్ని ఈవో ఆదేశించారు.



శ్రీమఠం మధ్వమార్గ్ కారిడార్‌లో భక్తుల రద్దీ

మంత్రాలయం భక్తజన సంద్రం

» రాఘవేంద్రస్వామి మఠానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం లక్ష మందికి పైగా వచ్చిన భక్తులతో మఠం ప్రాంతంతో పాటు మంత్రాలయం పట్టణం రద్దీగా కనిపించింది. గురుపౌర్ణమితో పాటు రాఘవేంద్రస్వామికి ఇష్టమైన గురువారం కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్ర, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వ మార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మఠం అధికారులు రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సీమ కరువుపై అధ్యయనానికి కేంద్ర బృందం

» కరువు పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళికలు

» కేంద్ర మంత్రి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

పుట్టపర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లోని కరువు సమస్య పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చెప్పారు. ఇందుకోసం ఐసీఏఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి శాస్త్రవేత్తలు, అధికారులతో ఓ ప్రత్యేక బృందాన్ని రాయలసీమకు పంపుతామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో గురువారం కరువు పీడిత జిల్లాల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి చౌహాన్, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. రాయలసీమలో వర్షాభావం, కరువు, వ్యవసాయ రంగ సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి అచ్చెన్నాయుడు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా శివరాజ్‌సింగ్ మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాల్లోని కరువు సమస్యకు సత్వర, శాశ్వత పరిష్కారం చూపడానికి దీర్ఘకాలిక ప్రణాళికల అమలుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, చిత్రంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్న, కలెక్టర్ చేతన్

ముగిసిన రొట్టెల పండుగ

» ఐదు రోజుల్లో 11 లక్షల మందికిపైగా భక్తుల రాక

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 10(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగ శుక్రవారం రాత్రి ముగిసింది. ఈ నెల 10వ తేదీన పండుగ ప్రారంభమవగా ఐదు రోజుల పాటు 11 లక్షల మందికిపైగా భక్తులు హాజరైనట్లు అధికారుల అంచనా.

పీఆర్‌జీఐ కార్యకలాపాలు సమన్వయం చేస్తా

» మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రత్నాకర్



పి.రత్నాకర్

విజయవాడ(కృష్ణలంక), జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పీఆర్‌జీఐకి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రచార కార్యకలాపాలు, క్షేత్ర ప్రచార కార్యకలాపాలు, ప్రింట్ మీడియా సంస్థలకు సంబంధించిన వివిధ కార్యకలాపాలను సమన్వయం చేస్తానని విజయవాడలోని పత్రికా సమాచార కార్యాలయం మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పి.రత్నాకర్ తెలిపారు. బుధవారం ఆయన ఈ బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌జీఐ) డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

నాల్కో నుంచి విద్యుత్ కొనుగోలు

» ఏపీఎస్పీడీసీఎల్ ఒప్పందం

» యూనిట్ 2.49 చొప్పున పవన విద్యుత్: ఏపీఈఆర్సీ ఆమోదం

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో)తో ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందాన్ని చేసుకుంది. యూనిట్‌కు రూ. 2.49 చొప్పున 50.4 మెగావాట్ల పవన విద్యుత్తు కొనుగోలుకు రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆమోదిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు నాల్కోతో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం ఈ ఏడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి 2041 ఏప్రిల్ ఒకటో తేదీ దాకా కొనసాగుతుంది. అయితే.. ఈ విద్యుత్తు కొనుగోలు ఒప్పందం 'మస్ట్ రన్' పరిధిలోకి రాదని పేర్కొంది.. ఎస్పీడీసీఎల్ ఎప్పుడు వద్దనుకుంటే అప్పుడు కరెంటు కొనుగోలు చేయవచ్చన్న షరతుకు నాల్కో ఆమోదించింది.

'నేడూ' మారని 'నాడు'!

ఆగిన పథకానికి బిల్లుల చెల్లింపు.. ఆరోగ్యశాఖ అధికారుల నిర్వాకం

» పీజీ సీట్ల బడ్జెట్ నుంచి రూ.కోట్లు మళ్లింపు

» 765 పీజీ సీట్లకు రూ.756 కోట్లు ఇచ్చిన కేంద్రం

» తొలి విడతగా రూ.198 కోట్లు విడుదల

» కడప ఆస్పత్రికి మాత్రమే 'క్యాథ్‌ల్యాబ్'

» జగన్ ప్రాపకం కోసం ఒక అధికారి పాకులాట

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఆరోగ్యశాఖ అధికారుల్లో పాత వాసనలు పోవడంలేదు. వైసీపీ ప్రభుత్వం 'నాడు-నేడు' కింద చేపట్టిన పనులను కొనసాగిస్తూ... వాటికి దొడ్డిదారిన బిల్లులు చెల్లిస్తున్నారు. నేటి ప్రభుత్వం 'నాడు-నాడు'ను నిలిపివేసిన సంగతి తెలిసీ... అదే పేరుతో 'కొనుగోళ్లు' కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో పీజీ సీట్ల పెంపు ప్రక్రియలో భాగంగా రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన నిధులను ఇటు మళ్లించి.. 'గుట్టు' బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో 17 కొత్త మెడికల్ కాలేజీలు, 11 బోధనాస్పత్రుల్లో 'నాడు - నేడు' పనులంటూ అప్పట్లో జగన్ హడావుడి చేశారు. కానీ... ఆయన ఒక్క ప్రాజెక్టుకు కూడా పైసా విడుదల చేయకపోవడంతో రూ.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరికొన్ని పనులు కూడా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పటి పనులను పూర్తిగా రద్దు చేసింది. అప్పుడు ఆరోగ్య శాఖ ఏమి చేయాలి? ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి. కానీ, కొన్ని 'నాడు-నేడు' పెండింగ్ పనులను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అధికారులు కొనసాగిస్తున్నారు. డీఎంఈ ఆస్పత్రులకు అవసరమైన రూ. 2 కోట్ల విలువైన అల్ట్రాసౌండ్ మిషన్ల దగ్గర నుంచి బోధనాస్పత్రుల కోసం రూ. మూడు కోట్ల విలువైన అనస్థీసియా వైద్య పరికరాల వరకు కూటమి ప్రభుత్వ వచ్చిన తర్వాతే కొనుగోలు చేశారు.

కేంద్రం నిధులు మళ్లించేశారు

అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో 'నాడు - నేడు' కింద విలువైన వైద్య పరికరాల కోసం వైసీపీ ప్రభుత్వంలో టెండరు పిలిచి కాంట్రాక్టరును ఎంపిక చేశారు. ఆ తర్వాత ఆ ప్రక్రియ ముందుకు పోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత, ఆ వైద్య పరికరాల కోసం 2024 నవంబరు- డిసెంబరు నెలల్లో ఇండెంట్ ఇచ్చి సదరు కాంట్రాక్టరు నుంచి వాటిని రెండు విడతల్లో రూ. 8 కోట్ల చొప్పున కొనుగోలు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ, బయోమెడికల్ ఇంజనీర్లు ఒకసారి, ఆరోగ్యశాఖ అధికారులు మరోసారి ఇండెంట్ ఇచ్చి కొనుగోళ్లు జరిపారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేసి మరీ ఈ వ్యవహారం నడిపించారు. మరి బిల్లులు ఎలా చెల్లించాలి? అప్పటి పనులన్నీ రద్దుచేయడంతో ప్రభుత్వం నుంచి రూపాయి కూడా మంజూరయ్యే అవకాశం లేదు. మరి ఏం చేయాలి? ఈ సమయంలో పీజీ సీట్ల నిధులు ఆరోగ్యశాఖ వరంలా కనిపించాయి. రాష్ట్రంలో దాదాపు 750 కొత్త సీట్ల కోసం కేంద్రం రూ.756 కోట్లు కేటాయించింది. అందులో రూ.198 కోట్లు తొలి విడత కింద విడుదల చేసింది. ఈ నిధులే కొందరు అధికారుల పాలిట వరంగా మారాయి. 'నాడు - నేడు' కింద కొనుగోలు చేసిన వైద్య పరికరాలకు, చేపట్టిన నిర్మాణాలకు, ఇతర వాటికి ఈ నిధుల నుంచి చెల్లింపులు చేసేస్తున్నారు. ఇలా...ఇప్పటి వరకూ దాదాపు రూ.50 కోట్లు పైనే చెల్లింపులు చేసినట్లు తెలుస్తోంది. అనంతపురం మెడికల్ కాలేజీ అధికారులు కూడా ఈ నిధుల్నే బిల్లుల చెల్లింపునకు మళ్లించారు.

ఫేక్ యుసీలు

మెడికల్ కాలేజీల్లో కొత్తగా పీజీ సీట్లు పెంచాలంటే కొన్ని సౌకర్యాలు కల్పించాలి. కొత్త భవనాలు, కొన్ని వైద్య పరికరాలు తప్పనిసరి. వీటి కోసం కేంద్ర ప్రభుత్వం కొన్ని నిధులు కేటాయిస్తుంది. ఈ నిధులు కేటాయించాలంటే, ఏ అవసరాలకు ఆ నిధులు ఖర్చు చేస్తారనేది కేంద్రానికి సవివర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) అందించాలి. డీపీఆర్ ప్రకారమే ఆ నిధులు ఖర్చు చేయాలి. ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లను (యూసీలు) కేంద్రానికి పంపించాలి. యూసీలు కేంద్రానికి పంపించిన తర్వాతే రెండో విడత నిధులు కేంద్రం విడుదల చేస్తుంది. అయితే, ఆరోగ్యశాఖ తొలి విడతలో ఖర్చు చేసిన రూ.198 కోట్లకు ఇచ్చిన యూసీలు మొత్తం ఫేక్ అని తెలుస్తోంది.

జగన్ ప్రాపకం కోసం..

ఆరోగ్యశాఖలోని ఓ కీలకమైన అధికారి జగన్ ప్రాపకం కోసం ఏకంగా కేంద్రం నిధులు కూడా మళ్లించేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో ఏ ఆస్పత్రిలో లేని వైద్య పరికరాలు జగన్ సొంత జిల్లా కడప ఆస్పత్రిలోనే ఉండాలనేది ఆయన కోరిక. శ్రీకాకుళం, ఒంగోలు, కడప ఆస్పత్రుల్లో క్యాథ్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలనేది నిర్ణయం. అయితే, మిగతా రెండు ప్రాంతాలను వదిలేసి.. ప్రత్యేకంగా కడపపైనే సదరు అధికారి ఫోకస్ పెట్టారు. కడపలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుకు ఎక్కడా అంతరాయం కలగకూడదని, దాని కోసం పీజీ సీట్ల నిధుల నుంచి చెల్లింపులు చేయాలని ఆదేశించారు. ఫేక్ యూసీలు కేంద్రానికి పంపించి.. పీజీ సీట్ల నిధులతో కడపలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుకు సిద్ధమయిపోయారు.

అంతా ఇష్టారాజ్యం..

డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అధికారులు తాము ఏమీ చేసినా ప్రశ్నించేవారే లేరన్నట్లు వ్యవహరిస్తున్నారు. అనంతపురం బోధనాస్పత్రిలో రూ. ఎనిమిది కోట్ల విలువైన వైద్య పరికరాల కొనుగోలు వ్యవహారంలో పాత సూపరింటెండెంట్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ, బయోమెడికల్ ఇంజనీర్‌తో పాటు మరికొంత మంది అధికారుల పాత్ర ఉంది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. అయితే, విచిత్రంగా డీఎంఈ అధికారులు వారికి పదోన్నతులు కల్పిస్తున్నారు. వైద్య పరికరాల కొనుగోలుకు ఇండెంట్ పెట్టిన బయోమెడికల్ ఇంజనీర్‌కు పదోన్నతి కల్పించి డీఎంఈ కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. ప్రజాధనం వృథా అయిందని తెలిసినా సదరు బయో మెడికల్ ఇంజనీర్ కనీసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాలేదు, పైగా వైద్య పరికరాల కొనుగోలుకు ఆయనే ఇండెంట్ పెట్టారు. ఇలాంటి ఉద్యోగికి కీలకమైన డీఎంఈ కార్యాలయంలో పోస్టింగ్ ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఉత్తరాన వరదలు.. దక్షిణాన ఎండలు!

» మధ్య, తూర్పు, వాయువ్య భారతాన కుంభవృష్టి

» రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు

విశాఖపట్నం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఉత్తరాది రాష్ట్రాల్లో కుంభవృష్టిగా వర్షాలు కురుస్తుంటే.. దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు వర్షాల కోసం ఎదురుచూపులు చూస్తున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చినప్పటికీ... తొలి ఆరు రోజులే దక్షిణాదిలో మంచి వర్షాలు కురిశాయి. మే 29 నుంచి జూన్ 16 వరకు రుతు పవనాలు దక్షిణాదిలోనే ఉన్నా.. రాష్ట్రంలో వర్షాభావం కొనసాగింది. మళ్లీ జూన్ మూడు, నాలుగు వారాల్లో ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. జూలైలో వర్షాలు మెరుగుపడతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. జూన్ 1 నుంచి గురువారం వరకు రాష్ట్రంలో 141.9 మి.మీ.కు గాను 101 (28.8% తక్కువ) మి.మీ. వర్షపాతమే నమోదైంది. రాష్ట్రంలోని 8 జిల్లాల్లో సాధారణ, మిగిలిన జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. పల్నాడు, నెల్లూరు, అన్నమయ్య, కడప జిల్లాల్లో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి.

అక్కడ వరద.. ఇక్కడ ఎండ మంట

నైరుతి రుతుపవనాలు కొద్దిరోజులుగా మధ్య, వాయువ్య, తూర్పు భారతదేశంలో నిలకడగా ఉండిపోయాయి. అక్కడి రాష్ట్రాల్లో కుంభవృష్టిగా వర్షాలు కురుస్తున్నాయి. కేరళ, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు దక్షిణ భారతంలోని మిగిలిన ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఎండలు మండిపోతుండటంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి గత రెండు వారాల్లో పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడ్డాయి. నైరుతి రుతు పవనాల (4నెలలు) కాలంలో తడి, పొడి దశలు ఉంటాయని, ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో పొడి దశ కొనసాగుతోందని, కొద్దిరోజుల్లో తడి (వర్షాలు కురవడం) దశ వస్తుందని వాతావరణ నిపుణులు తెలిపారు.



కోనసీమ జిల్లా గంటిపెదపూడిలో బూరుగులంక నదీపాయలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి

కోనసీమలో కొట్టుకుపోయిన రోడ్డు

పి.గన్నవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం బూరుగులంక నదీపాయలో లంక గ్రామాల ప్రజలు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారి గురువారం వరద నీటిలో కొట్టుకుపోయింది. వరదనీరు గట్టును తాకిన అరగంటలోనే రోడ్డంతా కొట్టుకుపోయింది.

రెండు మూడు రోజుల్లో మనకూ వర్షాలు!

రుతుపవన ద్రోణి రానున్న రెండు మూడు రోజుల్లో దక్షిణాది వైపు వచ్చే అవకాశం ఉందని, దీంతో ఈ నెల 13 నుంచి ఉత్తర కోస్తాలో ఓ మాదిరి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణుడొకరు చెప్పారు. 15 తర్వాత రాయలసీమ, మధ్య కోస్తాలోనూ ఓ మాదిరి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు.

తుంగభద్ర, శ్రీశైలంకు భారీగా వరద

కర్నూలు, జూలై 10(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంలో 75.934 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 46,955 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం జలాశయానికీ వరద కొనసాగుతోంది. ఎగువన జూరాల, సుంకేసుల నుంచి 1,75,233 క్యూసెక్కుల వరద డ్యాంకు చేరుతోంది. స్పిల్‌వే ద్వారా 81,195 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 67,552 క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు.



తన ఇద్దరు కుమారులను రక్షించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం ఇచ్చిన సూర్యకుమారి

నా బిడ్డలను విడిపించండి!

» మానవ అక్రమ రవాణా ముఠా చేతిలో మగ్గుతున్నారు

» డిప్యూటీ సీఎంకు విజయనగరం మహిళ విన్నపం

» వెంటనే విదేశాంగ మంత్రితో మాట్లాడిన పవన్

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసోయి విదేశాల్లో మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలంటూ విజయనగరానికి చెందిన గండబోయిన సూర్యకుమారి అనే మహిళ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వేడుకున్నారు. ఈమేరకు ఆమె గురువారం డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చి పవన్‌కు వినతిపత్రం అందించారు. మయన్మార్ సరిహద్దుల్లో బందీలుగా ఉన్న తమ వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, వారిని విడిపించేందుకు సాయం చేయాలని వేడుకున్నారు. తమ ఇద్దరు కుమారులతో పాటు ఎనిమిది మంది అక్రమ రవాణా చెరలో ఉన్నట్లు వివరించారు. ఆమె ఆవేదన చూసిన పవన్ కల్యాణ్ వెంటనే కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్త శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో చిక్కుకున్న వారిని రక్షించాలని ఆయన్ని కోరారు. ఈ వ్యవహారంపై విదేశీ వ్యవహారాల శాఖ సానుకూలంగా స్పందించింది. విదేశాల్లో మగ్గుతున్న వారిని వెనక్కి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తామని ఆమెకు పవన్ హామీ ఇచ్చారు.

విహారయాత్రలో విషాదం

» కర్నూలు జిల్లాలో ట్రాక్టర్‌ను ఢీకొన్న స్కార్పియో

» నలుగురు దుర్మరణం, ఆరుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

ఓర్వకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): విహారయాత్ర ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. కడప జిల్లా మైదుకూరు పట్టణం మహబూబ్‌నగర్‌కు చెందిన షేక్ కమాల్ బాషా, అతని భార్య షేక్ మహబుబ్ చాన్, కుమార్తెలు, అల్లుడు, మనమరాలితో పాటు.. మరదలు మున్నీస, ఆమె కుమారుడు మున్నా మంగళవారం రాత్రి హైదరాబాద్ వెళ్లారు. బుధవారం రాత్రి తిరుగు ప్రయాణం అయ్యారు. గురువారం తెల్లవారుజామున కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ సమీపంలోకి రాగానే నంద్యాల వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వారు ప్రయాణిస్తున్న స్కార్పియో వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో షేక్ మున్నీస(40), షేక్ కమాల్ బాషా(50) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ మహబూబ్ చాన్(49), మనవరాలు 3 నెలల నజియా కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మృతిచెందారు. డ్రైవర్ సహా ఐదుగురు తీవ్రంగా గాయపడగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పీఆర్సీని వెంటనే నియమించాలి

» ఏపీ ఎన్జీవో సంఘం

మచిలీపట్నం టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమం దృష్ట్యా వెంటనే ప్రభుత్వం పీఆర్సీ పునర్నియమించాలని ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి మచిలీపట్నం ఎన్జీవో హోంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత ఆరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ తమ హక్కులను కోల్పోయారన్నారు. 11వ పీఆర్సీ రివర్స్ పీఆర్సీగా మారిందని, చివరకు ఉద్యోగులు పీఆర్సీ వద్దు అనే విధంగా రూపొందించారన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు రూ.27500 కోట్లు బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగో డీఏ ఇవ్వబోతోందని, మూడు డీఏలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని కోరుతున్నామన్నారు. సీపీఎస్ విధానం సవరించి ఉద్యోగులకు సరైన న్యాయం చేయాలని విద్యాసాగర్ డిమాండ్ చేశారు.

భారతదేశ పటంలో తెలంగాణకు చోటు లేదా?

» ఏపీ బీజేపీ అధ్యక్షుడు లోకేశ్‌కు ఇచ్చిన దేశ పటంలో తెలంగాణ లేదేం?

» ఇది బీజేపీ విధానమా?.. ప్రధాని స్పందించాలి: కేటీఆర్

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): భారతదేశ చిత్రపటంలో తెలంగాణకు చోటు లేదా? తెలంగాణను తొలగించడంలో మీ ఉద్దేశం ఏంటి? అని బీజేపీ నేతలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ ఆ రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు ఇచ్చిన భారతదేశ పటంలో తెలంగాణ లేకపోవడంపై గురువారం ఎక్స్‌లో కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లోకేశ్‌కు బహుమతిగా ఇచ్చిన చిత్రపటంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను మాత్రమే చూపించడం దారుణమన్నారు. ఇది పూర్తిగా అనుచితమని, ఇది బీజేపీ అధికారిక అభిప్రాయమా? అని కేటీఆర్ ప్రధాని మోదీని ప్రశ్నించారు. తెలంగాణను భౌగోళికంగా గుర్తించకపోవడంపై ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజల త్యాగాలు, రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలను అగౌరవపర్చడం తగదని పేర్కొన్నారు. పొరపాటైతే, తెలంగాణ ప్రజలను అపహాస్యం చేసినందుకుగాను బీజేపీ నాయకత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

బలవంతపు భూసేకరణకే వ్యతిరేకం

» కరేడు రైతుల ఉద్యమాన్ని సీఎంకు తెలియపరుస్తాం

» మొండిగా ముందుకు వెళితే పోరాటమే: సీపీఐ రామకృష్ణ

ఉలవపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనకు, రాష్ట్ర అభివృద్ధికి, ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, ప్రజాభీష్టం లేకుండా బలవంతపు భూసేకరణ ఎక్కడ జరిగినా వ్యతిరేకిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టంచేశారు. గురువారం ఆయన ప్రకాశం, నెల్లూరు జిల్లాల సీపీఐ నాయకులతో కలిసి కరేడు గ్రామంలో పర్యటించారు. రైతులు, రైతు కూలీల స్థితిగతులు, ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. అమరావతిలో రైతులు అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ఆర్థిక లబ్ధి చేకూరుతుందనే ఉద్దేశ్యంతో స్వచ్ఛందంగా భూములు ప్రభుత్వానికి కట్టబెట్టారని, కానీ కరేడులో పరిస్థితులు అలా లేవన్నారు. కరేడు రైతులు ఇండోసోల్ పరిశ్రమకు భూములు ఇవ్వరని, బలవంతపు భూసేకరణ వ్యతిరేకిస్తామనే ఏకాభిప్రాయాన్ని నేరుగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతులను ఒప్పించి భూములు తీసుకుంటామని కందుకూరు సబ్‌కలెక్టర్ పత్రికలకు ఇంటర్వ్యూలు ఇవ్వడం సమంజసం కాదని, స్థానిక ఎమ్మెల్యే రైతుల అభిప్రాయాన్ని వక్రీకరించి చెప్పడం గందరగోళం సృష్టించడమే అని రామకృష్ణ విమర్శించారు. ప్రజాభిప్రాయం లేకుండా ఒక్క గజం భూమిని సేకరించాలని చూసినా సీపీఐ, వామపక్ష పార్టీలు కరేడు రైతులకు అండగా ముందుండి పోరాటం చేస్తాయని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నిర్లక్ష్యం కూల్చిన వంతెన


గుజరాత్‌లోని వడోదరలో మహి నదిపైన నలభైయేళ్ళక్రితం నిర్మించిన బ్రిడ్జి పాక్షికంగా కూలిన ఘటనలో మృతుల సంఖ్య పదహారుకు పెరిగింది. మరో ముగ్గురి ఆచూకీ తెలియాల్సి ఉన్నదని, గాలింపుచర్యలు కొనసాగుతున్నాయని చెబుతున్నా, ఆశలూ అవకాశాలూ అంతంతమాత్రమే. భారీశబ్దాలతో ఓ భాగం కూలడం, దానిపైన ప్రయాణిస్తున్న వాహనాలు వరుసపెట్టి నదిలో పడిపోవడం అతిదగ్గరగా గమనించిన మత్స్యకారులు భయంతో వొణికిపోయారు. ఈ వంతెనకు రిపేర్లు, తనిఖీలు, నాణ్యత పరీక్షలు ఎప్పుడు, ఎవరు నిర్వహించారన్న వివరాలు తెప్పించుకొని మరీ నలుగురు ఇంజనీర్లను ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్ గురువారం సస్పెండ్ చేశారట. ఆ నివేదికలో ఇంకా ఏమున్నదో, పాపులు వీరని ఎలా నిర్ణయించారో మనకు తెలియదు. అయితే, సరిగ్గా మూడేళ్లక్రితం వడోదరకు చెందిన ఒక సామాజిక కార్యకర్త ఈ బ్రిడ్జి నిర్వహణకు సంబంధించి ఒక అధికారితో చేసిన సంభాషణ ఈ ప్రమాదం నేపథ్యంలో వెలుగులోకి వచ్చింది. వంతెన పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నందున తనిఖీలు, మరమ్మతులు వెంటనే చేపట్టాలంటూ తాము ఇప్పటికే ప్రతిపాదనలు పంపామంటూ సదరు అధికారి వివరిస్తున్న సంభాషణ అది. ఈ వంతెన ఏడాదికంటే నిలవదని, కూలడం ఖాయమని ఆ అధికారి అప్పట్లోనే చెబితే, అది మరో మూడేళ్ళు నిలిచి, ఎవరూ ఎంతకూ పట్టించుకోని కారణంగా ఇప్పటికి ఇలా కూలిందని అర్థం.

ఇది కాంగ్రెస్ ఏలుబడిలో నిర్మించిన బ్రిడ్జి అనీ, వారి చేతిచలువవల్లనే, నాలుగుదశాబ్దాలకే దానికి నూరేళ్ళూ నిండిపోయాయని బీజేపీ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు. ఇది పూర్తిగా నిర్వహణ లోపమనీ, రాష్ట్రంలో గత నాలుగేళ్ళలో ఈ తరహాఘటనలు కనీసం ఏడు జరిగిన నేపథ్యంలో సిట్ విచారణకు ఆదేశించాలని కాంగ్రెస్ అంటోంది. గుజరాత్‌లో అవినీతి పతాకస్థాయిలో ఉన్నందున, ప్రతీ దానినీ డబ్బుతో ముడిపెడుతూ చివరకు ప్రజల ప్రాణాలకు కూడా రక్షణలేకుండాపోయిందని కాంగ్రెస్ విమర్శ. గతంలో బ్లాక్‌లిస్ట్ చేసిన కంపెనీలు కూడా ఇప్పుడు కాంట్రాక్టులు సంపాదిస్తున్నాయని, అవి కట్టినవి కూలిపోతున్నా, మరమ్మతులు నిలవకున్నా పాలకులు నిమ్మకునీరెత్తినట్టు ఉంటున్నారని కాంగ్రెస్ వాదన. మధ్య గుజరాత్‌ను సౌరాష్ట్రతో అనుసంధానించే అతి కీలకమైన ఈ బ్రిడ్జి నిర్వహణలోనూ అవినీతి, నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందన్నది విమర్శ. ఆనంద్–వడోదర జిల్లాలను కలిపే ఈ బ్రిడ్జి కూలిన కారణంగా ఈ మార్గం గుండావెళ్ళే వాహనాలు ఇప్పుడు యాభైకిలోమీటర్లు చుట్టూ తిరిగిపోవలసి వస్తోంది.

ఈ వంతెనలో నిర్మాణపరమైన లోపాలేమీ లేవని, కూలిన భాగాలు ముందే దెబ్బతిన్న సూచనలూ కనబడలేదని, వందేళ్ళు నిలవాల్సిన ఈ నిర్మాణానికి గత ఏడాది కూడా చిన్నచిన్న రిపేర్లతో నిర్వహణ సుబ్బరంగా చేశామని, సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న ప్రచారాలను ఏ మాత్రం నమ్మవద్దని అత్యున్నత ఇంజనీర్ ఒకాయన గురువారం మీడియాకు వివరణ ఇచ్చారు. ఏ లోపమూ లేదు, ఏ లోటూ చేయలేదు కానీ, అదే తనకుతానుగా కూలిందన్నట్టుగా ఆయన మాట్లాడారు. మానవతప్పిదాలు, నిర్లక్ష్యాలు, లేదా కుట్రలు లేనిదే ఈ స్థాయి ప్రమాదాలు జరగవు. రాకపోకలు ఆపకుండా, ప్రయాణానికి పనికిరాదని నిర్ధారించకుండా, మరోవైపు మరమ్మతులు చేయకుండా నిర్వహణను గాలికి వదిలేసి ఇప్పుడు ఎందుకు కూలిందో తెలియదన్నట్టుగా మాట్లాడటం విచిత్రం. నష్టపరిహారాలు ఇవ్వడం, కమిటీలు వేయడం ఇటువంటి సందర్భాల్లో సహజంగా జరిగిపోతాయి. బలంగా ఉన్నదనీ, నూరేళ్ళు నిలవాల్సినదనీ అంటున్న బ్రిడ్జి అర్థంతరంగా ఇలా ఎందుకు ఒరిగిందన్న సత్యం ఎప్పుడు తెలుస్తుందో, ఎవరు ఆ గుట్టు విప్పుతారో చూడాలి. ఉదయం ఏడున్నర గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది కాబట్టి సరిపోయింది కానీ, రద్దీ వేళల్లో అయితే మృతుల సంఖ్య చాలా హెచ్చుగా ఉండేది. రద్దీసమయాల్లో అతివేగంగా వాహనాలు పోతున్నప్పుడు ఈ భాగం నుంచి భారీ శబ్దాలు వెలువడేవని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రమాదఘంటికలు ఎంతోకాలంగా వినిపిస్తున్నా ఎవరికీ పట్టకపోవడం ఆశ్చర్యం. 2022లో మోర్బీ బ్రిడ్జి కుప్పకూలిన ఘటన నుంచి గుజరాత్ ఏ పాఠాలూ నేర్చుకోలేదని, ప్రజల భద్రత పాలకులకు పట్టలేదని ఈ ఘటన తెలియచెబుతోంది.

భావజాల మార్పుతోనే హిందూరాజ్య స్థాపన

సుమారు అరున్నర దశాబ్దాల హిందూ వ్యతిరేక పాలన తర్వాత అనూహ్యంగా ఆవిర్భవించిన ప్రస్తుత బీజేపీ నాయకత్వంలోని ప్రధాని మోదీ పాలన దేశాన్ని హిందూ రాజ్యం వైపుగా నడిపిస్తున్నదనడంలో ఎవరికీ సందేహం లేదు. ఈ తరుణంలోనే రాజ్యాంగ ప్రవేశిక నుంచి 'సెక్యులర్, 'సోషలిస్ట్' అనే పదాలను తొలగించాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కోరడం కూడా గమనార్హం. దేశం యాభై ఏళ్ల ఎమర్జెన్సీని గుర్తు చేసుకుంటున్న సందర్భంలో, హిమంత బిశ్వశర్మ భారతీయ రాజ్యాంగ ప్రవేశిక నుంచి 'లౌకిక' (సెక్యులర్), 'సామ్యవాద' (సోషలిస్ట్) పదాలను రద్దు చేయాలని పిలుపునిచ్చారు. ఈ పదాలను మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పాలనలో రాజ్యాంగంలో చేర్చారని, తొలినాటి రాజ్యాంగంలో ఇవి లేవని ఆయన అన్నారు. 'లౌకికవాదం' అనేది భారతదేశం ప్రాథమిక నమ్మకమైన సర్వధర్మ సమభావన (అన్ని మతాలను సమానంగా గౌరవించడం) అనే దానికి విరుద్ధమని, 'సోషలిజం' ఎప్పుడూ అసలు భారతీయ ఆర్థిక ఆలోచన కాదని కూడా ఆయన వాదించారు. బదులుగా, భారతదేశం ఎల్లప్పుడూ సర్వోదయ (అందరికీ మంచి), అంత్యోదయ (అత్యల్ప వర్గాలకు ప్రయోజనం) సూత్రాలను అవలంబించిందని ఆయన పేర్కొన్నారు.



ఈ తరుణంలో భారత్ 'లౌకిక' దేశంగా ఉండటంలో తప్పేముంది అన్న ప్రశ్న ప్రజల మనసుల్లో తలెత్తడం సహజం. దారితప్పిన లౌకికవాదం వల్ల హిందూ ధర్మానికి, సమాజానికి కలిగే హానితోపాటు ఈ దేశాన్ని పూర్తి స్థాయి హైందవ దేశంగా పునరుద్ధరించడం ఎందుకు ముఖ్యమో ప్రజలందరూ తెలుసుకోవాలి. 1947లో జరిగిన భారత్ విభజనతో ఈ కథ ప్రారంభమైంది. ఇది అసంపూర్ణంగానే కాకుండా ఏకపక్షంగా, పూర్తి అహేతుకంగా జరిగిందన్న అభిప్రాయం అనేకులలో ఉంది. 1947 విభజన సమయంలో హిందువులు ఎక్కువగా నష్టపోయారన్నది వాస్తవం. బ్రిటిష్ వారు భారత్‌ను దోచుకున్న తర్వాత, ఇస్లామిక్ పాకిస్థాన్ రూపంలో మన దేశానికి శాశ్వత తలనొప్పిని మిగల్చాలని నిర్ణయించుకున్నారు. కొత్తగా ఏర్పాటైన రెండు దేశాల మధ్య పూర్తి జనాభా మార్పిడి గురించి వీర సావర్కర్, డాక్టర్ అంబేడ్కర్ ఇచ్చిన వివేకవంతమైన సలహాను ఆనాడు గాంధీ, నెహ్రూ ప్రభృతులు ఎవరూ పట్టించుకోలేదు. భారతదేశంలోకి స్థానభ్రంశం చెందిన ముస్లిం జనాభాకు వక్ఫ్ బోర్డును ప్రసాదించారు. ప్రతిగా స్థానభ్రంశం చెందిన హిందువులకు మాత్రం రిక్తహస్తం చూపించారు. పాకిస్థాన్‌లో ప్రతీదీ వదులుకున్న హిందువులకు శూన్యమే మిగిలింది. ఇన్ని దశాబ్దాల అనంతరం కూడా భారతదేశంలో హిందువుల పరిస్థితి మెరుగుపడలేదు. ఈ అసమానత్వం 1940ల్లోనే ప్రామాణికంగా నమోదైంది. అయినా, రాజకీయంగా సరిదిద్దే యత్నం జరగలేదు.

ఈ పరిస్థితికి ప్రధాన కారణమైన రాజకీయ వర్గం ఉదాసీనత ఏమేరకు వ్యాపించిందో చరిత్రకు బాగా తెలుసు. వారి ముస్లిం సంతృప్తీకరణ భావజాలం పతాక స్థాయికి చేరింది. నాటి నుంచి నేటి వరకూ రాజకీయ నాయకులు ముస్లింలను సంతృప్తిపరుస్తూనే ఉన్నారు. ఇదే సమయంలో హిందూ ప్రయోజనాలను తుంగలో తొక్కుతూనే ఉన్నారు. 2014 నుంచి ఈ దృశ్యం బాగా మారిపోయింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్, ఇతర ప్రభుత్వాలు ముస్లింలను సంతృప్తిపరచడానికి చాలా వేగంగా పోటీ పడుతూ ముందుకు సాగాయి. ఓట్ల కోసం చివరకు భారతీయ నగరాల మురికివాడల్లో బంగ్లాదేశీయులను అక్రమంగా స్థిరపరిచినట్లు కూడా కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు ఉన్నాయి. ప్రధాని మోదీకి ముందున్న బీజేపీ ప్రభుత్వం (వాజ్‌పేయి హయాంలో) కూడా ఎక్కువగా లౌకికవాదంగానే ఉండేది. అయితే, నాటి బీజేపీ పాలకులు హిందువుల పట్ల ఎప్పుడూ వివక్ష చూపకపోవడమే రక్షణాత్మక దయగా భావించాలి.

భారత్‌లో మెజారిటీ హిందువులు. అయినా, దురవస్థ తప్పడం లేదంటే దాని కారణాలు విశ్లేషించుకొని ఆ మేరకు రాజకీయ నిర్ణయాలు తీసుకోవలసి ఉంది. హిందూ ద్వేష భావజాలాన్ని నిర్మూలించకుండా, బలవంతంగా హిందుస్థాన్‌ను ఏర్పరచడం వల్ల దేశ మనుగడ మళ్లీ ప్రశ్నార్థకం అవుతుంది. మానవీయ కోణంలో ఈ దిశగా అందరూ ఆలోచించాలి.

– దోర్బల బాలశేఖరశర్మ

ఈ శతాబ్ద ఆధిపత్యం ఎవరిది?





■ రాహుల్ కుమార్

కాలవిభజనలేని పరిస్థితిని ఊహించలేం. శకం, యుగం, శతాబ్దం, దశాబ్దం అంటూ ఎన్నో విభజనలు పెట్టుకుని ప్రగతినీ క్షీణతనీ మదింపు వేసుకుని ఆశనిరాశల్లో కొట్లాడటం అన్ని కాలాల్లోనూ ఉంది. 20వ శతాబ్దం దీనికి అతీతం కాదు. దాన్ని విప్లవాత్మకమైందిగా, యుద్ధ బీభత్సమైందిగా, పర్యావరణ వినాశనకరమైందిగా పేర్కొంటూ ఎన్నో వ్యాఖ్యానాలూ వచ్చాయి. వాటితోపాటు శతాబ్ది, దశాబ్ది ఆధిక్యతలనూ కొన్ని దేశాలకు ఆపాదించటమూ జరిగింది. కిందటి శతాబ్దం అమెరికాదేనంటూ పేర్కొనటం అలాంటిదే. ఆ సూత్రీకరణలో నిజం లేకపోలేదు! శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక, సైనిక, రాజకీయ శక్తిగా అమెరికాకు సాటిరాగల దేశం 20వ శతాబ్దంలో ఏదీ లేదు. ఆ ఘనతను అమెరికాకు ఆపాదించటంలో పెద్దగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాలేదు. ఒక శతాబ్దం పాటు ఒక దేశం తిరుగులేని శక్తిగా ఉండటం సాధారణ విషయం కాదు. ప్రజాస్వామ్యం, స్వయంపాలన, సమానత్వం కోసం ఎన్నో రూపాల్లో, ఎన్నో దేశాల్లో ప్రజలు నినదించి ఉద్యమించిన శతాబ్దంలో దాన్ని సాధించటమే ఒక విశేషం!

కీలక రంగాల్లో ఆ ఆధిక్యత అగ్రరాజ్య హోదానీ అమెరికాకు కట్టబెట్టింది. సోవియట్ యూనియన్ కొంతకాలం సైనికశక్తిపరంగా అమెరికాకు బలమైన సవాల్ విసిరినా ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దీటైన పోటీని ఇవ్వలేకపోయింది. అందుకే 20వ శతాబ్దం అమెరికాదేనన్న భావనపై పెద్దగా వివాదం నెలకొనలేదు. ఇప్పుడు ఆ పరిస్థితి వేగంగా మారిపోతోంది. 21వ శతాబ్దంలో అమెరికాకు అగ్రతాంబూలం ఇచ్చే పరిస్థితి రోజురోజుకీ తరిగిపోతోంది. ఒకనాటి బ్రిటన్ పరిస్థితే అమెరికాకు 2050 నాటికి ఎదురవుతుందన్న అంచనాలు పెరుగుతున్నాయి. మరోవైపు ఆసియాదే 21వ శతాబ్దం అన్న భావన బలం పుంజుకుంటోంది. డొనాల్డ్ ట్రంప్ సారథ్యంలో అమెరికా ప్రతిచర్యనూ సందిగ్ధ దృష్టితో చూడటం దేశదేశాలకు అలవాటైపోతోంది. అగ్రరాజ్య అధ్యక్షుడి వ్యవహారశైలిపై దేశాధినేతలు లోలోపల రగిలిపోవటం అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎప్పుడూ చూడని పరిణామం.

అమెరికా ఆధిపత్యానికి గండిపడుతున్న దృశ్యం మూడు విషయాలను పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతుంది. ఆర్థికాభివృద్ధి ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోవటం లేదు. 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత ఒకటి రెండేళ్ల మినహా పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడలేదు. స్థూలదేశీయ ఉత్పత్తి (జీడీపీ) 1990 నుంచి సగటున 2.40శాతం దాటలేదు. అదే కాలంలో చైనా సగటు జీడీపీ 8.74శాతం ఉంది. ఖర్చులకు అనుగుణంగా పన్ను ఆదాయాన్ని పెంచుకోలేని దుస్థితిలో అమెరికా పడిపోయింది. ప్రపంచ దేశాలకు లోటు బడ్జెట్‌ల గురించీ అప్పుల కట్టడి గురించీ నిత్యమూ పాఠాలు వినిపించిన అమెరికా ఈ రెండు విషయాల్లో క్రమేపీ సంక్షోభ స్థితిలోకి వెళుతోందనే ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. 2024 ఫెడరల్ బడ్జెట్‌లో 6.75 ట్రిలియన్ డాలర్లను ఖర్చుపెట్టాలని ప్రతిపాదిస్తే వచ్చే ఆదాయాన్ని 4.92 ట్రిలియన్ డాలర్లుగా చూపించారు. ఈ లోటును భర్తీ చేసుకోటానికి అప్పులు తప్ప మరోమార్గం లేదు. ఇప్పటికే అమెరికా అప్పులు 37 ట్రిలియన్ డాలర్లకు చేరాయి. ట్రంప్ మానసపుత్రికగా చెప్పుకొనే 'బిగ్ బ్యూటిఫుల్ బడ్జెట్ బిల్' చట్టంతో అవి 40 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతాయి. జీడీపీతో పోల్చితే అప్పులు 133 శాతానికి చేరుకుంటాయి. అప్పులపై చెల్లింపులే వచ్చే 10 ఏళ్లల్లో 13.8 ట్రిలియన్ డాలర్లకు పైగా ఉంటాయి. 2024 బడ్జెట్‌లో వీటి కోసం 14.06 శాతం నిధులను ప్రతిపాదించారు.

అప్పుల భారం తీవ్రంగా ఉన్నా పన్ను రాయితీలను మరింతగా పెంచుతున్నారు. ఆదాయ అసమానతలను ఇవి తగ్గిస్తున్నాయా? అంటే అదీలేదు. 1980ల నుంచీ సంపద, ఆదాయాల్లో అసమానతలు విపరీతంగా పెరిగిన దేశాల్లో అమెరికా ఒకటి. పన్ను రాయితీలన్నీ అధికాదాయం కలిగిన 10 శాతం జనాభాకే లబ్ధిని చేకూర్చుతున్నాయి. 2017లో ట్రంప్ ప్రవేశపెట్టిన పన్నురాయితీలు ఈ డిసెంబరుతో ముగిసిపోతాయి. వాటిని కొనసాగించటానికే ప్రధానంగా కొత్త చట్టాన్ని ఆమోదించారు. ఆరోగ్య, ఆహార సబ్సిడీల్లో కోతలు విధించి రక్షణ బడ్జెట్‌కు అదనంగా 150 బిలియన్ డాలర్లను ఇస్తున్నారు. శుద్ధ ఇంధనంపై రాయితీలను తగ్గించారు. రిపబ్లికన్ పార్టీ దృష్టిలో పర్యావరణ విధ్వంసానికి విలువ ఉండదు. అసలు విధ్వంసం జరుగుతున్న విషయాన్నే అంగీకరించని సందర్భాలు ఎక్కువ. ప్రగతి వ్యతిరేకులు మాత్రమే విధ్వంసం గురించి మాట్లాడతారని రిపబ్లికన్ నేతలు ఎద్దేవా చేస్తారు. వలసల నియంత్రణకు బడ్జెట్‌ను విపరీతంగా పెంచారు. వచ్చే అయిదేళ్లలో 100 బిలియన్ డాలర్లను ఇందుకోసం ఖర్చుపెడతారు. ప్రస్తుతం ఏటా 8 బిలియన్లు ఉన్న ఖర్చు 20 బిలియన్లకు పెరుగుతుంది. అంటే విదేశీ విద్యార్థులు, ఉద్యోగార్థులతో పాటు అక్రమంగా అమెరికాలో ప్రవేశించే వారిపై తనిఖీలు, వెనక్కి పంపటాలు ఎక్కువవుతాయి. లోటు బడ్జెట్‌ను తగ్గించటానికి ధనికుల నుంచి అధిక పన్నులను వసూలుచేసే వెసులుబాటు ఉన్నా దాన్ని కాదనుకుని అనుచితంగా వాణిజ్య యుద్ధాలను ప్రకటించి అన్ని దేశాల్లో ఆగ్రహాన్ని రేకెత్తించటం ఇంతలా ఎప్పుడూ జరగలేదు.

1990ల నుంచి సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులతో మంచి ఉద్యోగాలు ఉన్నత చదువులు ఉన్నవారికే పరిమితం అవుతున్నాయి. కృత్రిమ మేధతో అదింకా ఉధృతం అవుతోంది. సంపదను సృష్టించే రంగాల్లో ఉద్యోగ కల్పన తగ్గుముఖం పడుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దటానికి కొత్త విధానాలు చేపట్టే దిశగా అమెరికాలో అడుగులు పడటం లేదు. అందినంత మేర అప్పులు చేయటం, భారీలోటు బడ్జెట్లతో బండినెట్టుకు రావటమే విధానమైపోయింది. ఆర్థికాభివృద్ధి వేగం పుంజుకోక పోవటానికి విపరీత ఆదాయ అసమానతలు ప్రధాన కారణంగా పేర్కొంటూ ఎన్నో అధ్యయనాలు వెలువడ్డాయి. కొనుగోలు శక్తి కొద్ది మంది చేతుల్లో భారీగా ఉండటం ఆర్థిక వ్యవస్థకు అవసరమైన వస్తువుల గిరాకీని బాగా తగ్గిస్తుంది. దీన్ని సరిదిద్దకుండా చౌక ధరలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్న దేశాలను శత్రువులుగా చూపించటమే ట్రంప్ హయాంలో సర్వసాధారణమైంది. ఇతర దేశాల నుంచి దిగుమతులు అవుతున్న ఉత్పత్తులతో అమెరికాలోని పారిశ్రామిక కార్మికులకు డిమాండు తగ్గిపోయింది. పెరిగిన ధరలతో పోల్చితే వేతనాల్లో పెరుగుదల నిలిచిపోయింది. పాఠశాల విద్య వరకూ చదివి కిందిస్థాయి ఉద్యోగాలకు పరిమితమైనవారు.. వేతనాల పెంపు కోసం సంఘటితమయ్యే పరిస్థితిని కోల్పోయారు. అన్నివైపులా అసంతృప్తి నెలకొన్న ఈ నేపథ్యంలోనే అమెరికాను మళ్లీ గొప్పదేశంగా మార్చుతానంటూ ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చారు. బైడెన్ హయాంలోనూ పరిస్థితులు పెద్దగా మారకపోవటంతో రెండోసారి ట్రంప్ సునాయాసంగానే ఎన్నికల్లో గెలిచారు.

అమెరికా వృద్ధి, క్షీణతలను విశ్లేషించిన నిపుణులు నాలుగు కీలక విషయాలను ప్రస్తావిస్తున్నారు. మొదటిది.. అసమానతలు విపరీతంగా పెరగటం వల్ల ఆదాయంలో సింహభాగం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైంది. రెండోది.. కిందటి శతాబ్దంలో జరిగినంత వేగంగా విద్యావ్యాప్తి జరగటం లేదు. ఉత్పాదకతలో పెరుగుదలను ఇది తగ్గిస్తోంది. మూడోది.. సగటు పనిగంటలు తగ్గుతున్నాయి. నాలుగోది.. వృద్ధుల సంఖ్య పెరగటంతో జనాభాలో పనిచేసే సామర్థ్యం ఉన్న వారి శాతం క్రమంగా తగ్గిపోతోంది. ఈ నాలుగు అంశాలూ ఇలాగే కొనసాగితే మెజారిటీ ప్రజల వాస్తవిక ఆదాయంలో ఎదుగుదల వచ్చే 25 ఏళ్లలో కూడా కన్పించని పరిస్థితినే తీసుకురావచ్చు. దీంతో అమెరికా ఆధిపత్యానికి కచ్చితంగా గండిపడే అవకాశాలే ఎక్కువ.

> అమెరికా వృద్ధి, క్షీణతలను విశ్లేషించిన నిపుణులు నాలుగు కీలక విషయాలను ప్రస్తావిస్తున్నారు. మొదటిది.. అసమానతలు విపరీతంగా పెరగటం వల్ల ఆదాయంలో సింహభాగం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైంది. రెండోది.. కిందటి శతాబ్దంలో జరిగినంత వేగంగా విద్యావ్యాప్తి జరగటం లేదు. ఉత్పాదకతలో పెరుగుదలను ఇది తగ్గిస్తోంది. మూడోది.. సగటు పనిగంటలు తగ్గుతున్నాయి. నాలుగోది.. వృద్ధుల సంఖ్య పెరగటంతో జనాభాలో పనిచేసే సామర్థ్యం ఉన్న వారి శాతం క్రమంగా తగ్గిపోతోంది. ఈ నాలుగు అంశాలూ ఇలాగే కొనసాగితే మెజారిటీ ప్రజల వాస్తవిక ఆదాయంలో ఎదుగుదల వచ్చే 25 ఏళ్లల్లో కూడా కన్పించని పరిస్థితినే తీసుకురావచ్చు. దీంతో అమెరికా ఆధిపత్యానికి ఖచ్చితంగా గండిపడే అవకాశాలే ఎక్కువ.

కిందటి శతాబ్దం అమెరికాదిగా భావించటానికి మరో ముఖ్యమైన కారణం అక్కడి విశ్వవిద్యాలయాలు నిర్వహించిన పాత్ర. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి ఉరుకులు పరుగులెత్తటంలో అమెరికా విశ్వవిద్యాలయాల చేయూత అసాధారణమైంది. వస్తూత్పత్తి రంగం (మాన్యుఫాక్చరింగ్ సెక్టార్) అమెరికాలో 1870–1970 మధ్య కీలకపాత్ర పోషించింది. 1945 నాటికి ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో అమెరికా వాటా 50 శాతం ఉండేది. 1990ల నాటికి అది గణనీయంగా పడిపోయినా సాఫ్ట్‌వేర్, డిజిటల్ రంగాల్లో సాధించిన మౌలిక ఆవిష్కరణలు చరిత్రలో ఎన్నడూ లేనంతగా ప్రపంచం అనుసంధానం అవ్వటానికి దోహదం చేశాయి. ఆ ఆవిష్కరణల్లో కంపెనీలు, సంస్థలతో పాటు విశ్వవిద్యాలయాల పాత్ర విస్మరించలేనిది. సామాజిక శాస్త్ర పరిశోధనల్లో కూడా విశ్వవిద్యాలయాలు గణనీయపాత్రను పోషించాయి. భారత్‌కు సంబంధించిన అనేక విషయాలపై లోతైన పరిశోధనలు, విశ్లేషణలు అందివ్వటంలో అమెరికా వర్సిటీలు చాలా ముందున్నాయి. నిధుల లభ్యత, మార్కెట్ అవసరాలతో పాటు స్వతంత్ర పరిశోధనలు వర్సిటీలకు అస్తిత్వాలుగా మారాయి. భారత్‌కు సంబంధించి ఏ విషయంలోనైనా మౌలిక పరిశోధనలు పదింటిని లెక్క పెడితే అందులో సగమైనా అమెరికా వర్సిటీల నుంచి వెలువడినవే అయివుంటాయి. అమెరికాకు ఎనలేని గుర్తింపు తెచ్చిన వర్సిటీలపై ప్రభుత్వం వైపు నుంచి బహిరంగంగా వేధింపులు.. నిధుల కోతలు, గుర్తింపు రద్దులు లాంటి హెచ్చరికలు గతంలో ఎప్పుడూ లేవు. అసమ్మతిని, ప్రభుత్వ వ్యతిరేకతను సహించటం, ప్రత్యామ్నాయ ఆలోచనల మంచిచెడ్డలపై సమాలోచనలు జరపటం అక్కడ వర్సిటీలకు ఉన్న బలం. ఇప్పుడా బలాన్ని దెబ్బతీయటం మొదలైంది. ఇదింకా పేట్రేగితే అమెరికా ఆధిపత్యానికి కారణమైన మేధో పునాదే బీటలు వారటం మొదలవుతుంది.

> అసమ్మతిని, ప్రభుత్వ వ్యతిరేకతను సహించటం, ప్రత్యామ్నాయ ఆలోచనల మంచిచెడ్డలపై సమాలోచనలు జరపటం అమెరికా వర్సిటీలకు ఉన్న బలం. ఇప్పుడా బలాన్ని దెబ్బతీయటం మొదలైంది. ఇదింకా పెట్రేగితే అమెరికా ఆధిపత్యానికి కారణమైన మేధో పునాదే బీటలు వారటం మొదలవుతుంది.

అంతర్జాతీయ వ్యవహారాల్లో ఈ శతాబ్దంలో అమెరికాకు ఎదురుదెబ్బలే ఎక్కువ. అమానవీయ చర్యలతో, తప్పుడు నిర్ణయాలతో స్నేహ దేశాల దృష్టిలోనూ పెద్దరికాన్ని కోల్పోతోంది. ఇరాక్‌పై యుద్ధాన్ని (2003) మొదలుపెట్టి ఘోరంగా విఫలమైంది. ఇస్లామిక్ తీవ్రవాదంపై పోరుతో సాగించిన యుద్ధం అదింకా పెరిగేలా చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబాన్లకు తిరిగి అధికారాన్ని కట్టబెట్టేలా వ్యవహరించింది. పాలస్తీనా సమస్యను ఆరని అగ్నిగుండంగా మార్చింది. హమాస్ తీవ్రవాదులపై దాడుల పేరుతో గాజాలో నరమేధాన్ని సాగిస్తోందన్న ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచి ఆ ఘోరకలిని పర్యవేక్షిస్తోందన్న అపకీర్తిని తెచ్చుకుంటోంది. నాటో కూటమిని విస్తరించి రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య చిచ్చు రగిల్చింది. వియత్నాం నుంచి మొదలుకుని ఇప్పటివరకూ ప్రత్యక్ష సైనిక జోక్యం చేసుకున్న ఏ దేశంలోనూ ప్రజాస్వామ్యాన్ని, పటిష్ఠ ఆర్థిక వ్యవస్థనూ ఏర్పాటు చేయలేకపోయింది. అనేక దేశాల్లో ఏర్పరచుకున్న సైనిక స్థావరాలు ఆర్థికంగా గుదిబండలుగా మారాయి. ఇతర కారణాలు ఎన్ని ఉన్నప్పటికీ ఆర్థిక మందగమనాలు, మేధోరంగంపై దాడులు, విదేశీ వ్యవహారాల్లో తప్పటడుగులతో అమెరికా ఆధిపత్యం ప్రశ్నార్థకంగా మారుతోంది!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

సరైన ప్రణాళికలుంటే, జనాభా వరమే!

జనాభా అంశంపై ప్రపంచ దేశాలు రెండుగా విడిపోయాయి. కొన్ని దేశాలు ఇప్పటికే అధిక జనాభాతో ఉన్నట్లు భావించి నియంత్రణ చర్యలు పాటిస్తుండగా, మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. గతంలో జనాభా నియంత్రణను కఠినంగా అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు ఆ నిబంధనను సడలిస్తున్నాయి. భారతదేశంలోని రాష్ట్రాల పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయి. ఉత్తర భారతానికి చెందిన యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికీ జనాభా నియంత్రణకు ప్రాధాన్యమిస్తుండగా, దక్షిణాదికి చెందిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనాభా అనేది ప్రధాన సమస్య కాదని, ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళికలు లేకపోవడమే అసలు కారణమని తెలుస్తున్నది. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన ప్రణాళికలతో జనాభాను వినియోగించుకుంటే అది దేశానికి వరమే అని పలు దేశాలు నిరూపించాయి.



143 కోట్ల జనాభాతో ప్రపంచంలో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, 142 కోట్లతో చైనా రెండో స్థానంలో ఉన్నది. జనాభా పెరుగుదల సమస్యలు దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణంపై ఆధారపడి ఉంటాయి. సరైన ప్రణాళిక లేనప్పుడు జనాభా పెరుగుదల ఒత్తిడిని సృష్టిస్తుంది, కానీ సమర్థవంతమైన విధానాలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు.

జనాభాను అంకెల పరంగానే కాకుండా జనసాంద్రత పరంగా పరిశీలిస్తే కొన్ని దేశాలు సరైన ప్రణాళికలతో ఎలా అభివృద్ధిపథంలో నడిచాయో తెలుస్తుంది. ఇందులో అధిక జనసాంద్రత ఉన్నా, సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించింది. ప్రపంచంలో జనసాంద్రత పరంగా సింగపూర్ మూడో స్థానంలో ఉంది. ఈ దేశ వైశాల్యం 719.9 చదరపు కిలోమీటర్లు కాగా, చదరపు కిలోమీటర్‌కు 8,595 మంది నివసిస్తున్నారు. అయితే అధిక ఆర్థిక వృద్ధి, అత్యుత్తమ గృహనిర్మాణం, ఆరోగ్య సేవలతో ప్రపంచంలోనే ఈ దేశం అగ్రగామిగా ఉంది. 1960–70లలో 'స్టాప్ ఎట్ టూ' కార్యక్రమం ద్వారా జనన రేటును తగ్గించగా, 1980ల నుంచి బేబీ బోనస్ స్కీమ్ ద్వారా జనన రేటును సమతుల్యం చేసింది.

జనసాంద్రత పరంగా చైనా ప్రపంచవ్యాప్తంగా 83వ స్థానంలో ఉంది. చదరపు కిలోమీటర్‌కు 153 మంది నివసిస్తున్నారు. 1980 నుంచి 2015 వరకు చైనా వన్ చైల్డ్ పాలసీని అమలు చేసి, దాదాపు 40 కోట్ల జనాభాను నియంత్రించింది. ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఆ దేశం జనాభా వనరులను సమర్థవంతంగా ఉపయోగించింది. ఫలితంగా చైనా రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారింది. అయితే కఠిన విధానాలు జనాభా నియంత్రణలో విజయవంతమైనా, దీర్ఘకాల సామాజిక పరిణామాలను పరిగణనలోకి తీసుకోకపోవడం సమస్యలను సృష్టించింది. వృద్ధ జనాభా ఎక్కువ కావడం, లింగ నిష్పత్తిలో తేడాలు రావడంతో వెంటనే అప్రమత్తమై 2015లో టూ చైల్డ్ పాలసీ, 2021లో ముగ్గురు పిల్లల విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఇక, భారతదేశంలో జనసాంద్రత (485/చ.కి.మీ.) కూడా ఎక్కువే. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో యువ జనాభా 65 శాతం (35 ఏళ్లలోపు) ఉంది. ఈ అంశం సరైన ప్రణాళికతో ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. సరైన అర్బన్ ప్లానింగ్ పాలసీ, ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక వినియోగం వంటి వాటిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. ఎక్స్‌పోర్ట్ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చవచ్చు. సాంకేతికతను ఉపయోగించి, గ్రామీణ–నగర అసమానతలను తగ్గించవచ్చు. జనాభా సమస్యల సవాళ్ల నుంచి అభివృద్ధికి మార్గాలను వెతికితే.. కొన్ని దశాబ్దాల్లోనే భారతదేశం నంబర్ వన్ ఆర్థిక శక్తిగా మారే అవకాశముంది.

– ఫిరోజ్ ఖాన్

(నేడు ప్రపంచ జనాభా దినోత్సవం)

పేదరిక నిర్మూలనకే పీ4

యావత్ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న భూతం పేదరికం. ఈ భూమి మీద పేదరికాన్ని నిర్మూలించిన దేశం లేదు. కానీ పేదరికం తగ్గించేందుకు ప్రపంచంలోని అన్ని దేశాలు కృషి చేస్తున్నాయి. పేదరిక నిర్మూలనకు భారతదేశంలో గత 75 ఏళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను రూపొందించినా, ఇంకా పేదరికం తాండవిస్తూనే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 50 లక్షల కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే... పేదరికం ప్రధాన సమస్యగా ఉందని గ్రహించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దానిని సమూలంగా రూపుమాపే కార్యక్రమం రూపొందించాలని నిర్ణయించుకున్నారు. 2047 నాటికి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ఉన్నత స్థానంలో నిలిపేలా విజన్ 2047 డాక్యుమెంట్‌కు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా మొట్టమొదటగా పబ్లిక్–ప్రైవేట్–పీపుల్–పార్టనర్‌షిప్(పీ4)పై చంద్రబాబు తన ఆలోచన విధానాన్ని వివరించారు. 2029 నాటికి రాష్ట్రంలో ఉన్న నిరుపేద కుటుంబాలను అభివృద్ధి వైపు నడిపించి పేదరికం లేకుండా చేయాలన్నది ఆయన సంకల్పం. ఆ సంకల్పంతో పుట్టిందే పీ4. తెలుగు వారి పర్వదినం ఉగాది పండుగ నాడు ఈ మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఐక్యరాజ్యసమితి పేదరికం నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ప్రపంచంలో పేదరికం లేని దేశాలు లేవు. కానీ కొన్ని దేశాలు పేదరికాన్ని చాలా తక్కువ స్థాయికి తగ్గించగలిగాయి. ఐస్‌లాండ్, నార్వే, డెన్మార్క్, స్విట్జర్లాండ్ వంటి దేశాలు పేదరికం తక్కువగా ఉన్న దేశాలు. ఏం చేస్తే పేదరికాన్ని రూపుమాపొచ్చనే అంశాలను ఐక్యరాజ్యసమితి రూపొందించింది.

స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిందే పేదరికాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి రూపుమాపాలన్న ఒక మహోన్నతమైన ఆలోచనతో. పేదవాడికి కూడు, గూడు, బట్ట అందించాలన్న ఎజెండాతో ఆయన ముందుకెళ్లారు. పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, పింఛన్లు, జనతా వస్త్రాలు వంటి కార్యక్రమాలు అమలు చేశారు. అన్నగారి ఆశయాలను కొనసాగిస్తూనే చంద్రబాబు జన్మభూమి కార్యక్రమం పేరుతో గ్రామీణ, పట్టణ రూపురేఖలనే మార్చేశారు. స్థానిక ప్రజల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులను గ్రామాల్లోకి పంపి, ప్రజల సమస్యలను నేరుగా వినడం, వాటిని పరిష్కరించడం కోసం 'ప్రజల వద్దకు పాలన' కార్యక్రమాన్ని నిర్వహించారు. విజన్ 2020ని ప్రవేశపెట్టి 2020 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపేందుకు కృషి చేసేలా ప్రణాళికలు రచించారు. మహిళలను స్వయం సహాయక బృందాలతో ఏకీకృతం చేసి, సూక్ష్మ రుణాలు అందజేయడం ద్వారా చిన్న తరహా వ్యాపారాలను ప్రోత్సహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేయడం, రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. నిరుపేద కుటుంబాలకు నేరుగా ఆర్థిక సాయం, గృహ నిర్మాణం కోసం రాయితీలు, ఆహార భద్రత కోసం రేషన్ వ్యవస్థను బలోపేతం చేశారు. జన్మభూమి, నీరు–మీరు, స్వయం సహాయక బృందాలు, రైతు బజార్ వ్యవస్థ ఏర్పాటు వంటి కార్యక్రమాలతో రాష్ట్రంలో పేదరికం నుంచి బయటపడ్డ కుటుంబాలు, గ్రామాలు అనేకం ఉన్నాయి.

> సమూలంగా, శాశ్వతంగా పేదరికం నిర్మూలించాలనే బలమైన లక్ష్యంతో పీ4 విధానానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. ఇప్పటికే ఈ విధానం ద్వారా 87 వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా దత్తత తీసుకొని, అభివృద్ధి చేసి పేదరికం నుంచి బయటపడేసేలా కృషి చేస్తోంది.




దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పూర్తిగా పేదరికాన్ని రూపుమాపే కార్యక్రమాలు ఒక్కటీ అమలు చేయడం లేదు. కానీ ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే సమూలంగా, శాశ్వతంగా పేదరికాన్ని నిర్మూలించాలనే బలమైన లక్ష్యంతో పీ4 విధానానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. ఇప్పటికే ఈ విధానం ద్వారా 87 వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా దత్తత తీసుకొని, అభివృద్ధి చేసి పేదరికం నుంచి బయటపడేసేలా కృషి చేస్తోంది. పీ4 విధానంలో భాగంగా తెలుగు ప్రవాసీయులు, హై-నెట్‌వర్త్ వ్యక్తులు 10 శాతం మంది సహకారంతో ఆదాయం తక్కువగా ఉన్న 20 శాతం వర్గాలను ఎంపిక చేసి ఆర్థికంగా అభివృద్ధి చేయడం. ఇళ్ల నిర్మాణం, పరిశుభ్రమైన వనరులు, తాగునీరు, పారిశుద్ధ్యం, డిజిటల్ కనెక్టివిటీ, సౌర విద్యుత్ వంటి సౌకర్యాలు పేదరికంలో ఉన్న కుటుంబాలకు అందించడం, వారిలో నైపుణ్యాలను పెంపొందించేలా నాయకత్వ శిక్షణ ఇవ్వడంతో పాటు స్థానికంగా కమ్యూనిటీ సహకారం అందించే లక్ష్యంతో పీ4 విధానం అమలవుతుంది. ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి, విద్యుత్, వంట గ్యాస్, ఆరోగ్య బీమా కవరేజ్, మరుగుదొడ్లు, మురుగు కాల్వల సదుపాయాలు వంటి ప్రాథమిక సేవలు అందించేందుకు 'కుటుంబానికో వ్యాపారి' అనే లక్ష్యంతో ప్రతి ఇంటి ఆర్థిక స్వావలంబనకు పీ4 మార్గం చూపించనుంది.

రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి నియోజకవర్గంలో 10 వేల పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా అధికారులు ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో ఎలాంటి కోత ఉండదు. పేదలు, ధనికుల మధ్య అంతరాలు తగ్గించేందుకే ఈ పీ4 విధానం అమలు చేస్తున్నారు. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను, లక్ష మంది మార్గదర్శులను గుర్తించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. పీ4 కోసం ఇప్పటికే 28 లక్షల కుటుంబాలను ఏపీ ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటివరకు 19,15,771 కుటుంబాలను ఎంపిక చేయగా 87,395 కుటుంబాలను దత్తత తీసుకున్నారు.

పీ4 విధానం ద్వారా లబ్ధి పొందిన వారి కుటుంబాల గాథలను ప్రజల్లోకి తీసుకెళ్లి... పేదరికం లేని సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పేదరికంలో ఉన్న కుటుంబాలను 2029 నాటికి వృద్ధిలోకి తేవడం... 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కఠోర శ్రమను అభినందిద్దాం. పేదరికం లేని సమ సమాజ నిర్మాణానికి మనవంతుగా ప్రచారం చేద్దాం.

■ ఏలూరి సాంబశివరావు
పర్చూరు ఎమ్మెల్యే





జీవన జ్యోతి

ఈనెల 7న నగరంలో జ్యోతిర్భానుకు రోడ్డు ప్రమాదం

- అవయవదానానికి కుటుంబ సభ్యుల అంగీకారం
- ఏడుగురి ప్రాణాలు నిలిపిన ఆదర్శం



విధి పగబట్టి వాకింగ్‌కు వెళ్తున్న ఆయన ప్రాణాన్ని ప్రమాదంలో పడేసింది. బ్రెయిన్‌డెడ్ అయితేనేం.. ఆయన ప్రాణం దీపంలా మారి ఏడుగురి జీవితాల్లో వెలుగునింపింది. గత సోమవారం బందరు రోడ్డులో కుమారుడితో కలిసి వాకింగ్ వెళ్లిన దుర్గా ఎలక్ట్రానిక్స్ అధినేత శొంఠి జ్యోతిర్భాను అనుకోని ప్రమాదానికి గురై బ్రెయిన్‌డెడ్ అయ్యారు. అవయవ దానానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో గురువారం ఆయన అవయవాలను రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. 6

వడ్డమానులో పూలింగ్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్

తిరువూరు సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావు సస్పెన్షన్



సాయీ.. నీ దివ్య చరణం

జిల్లాలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

జిల్లాలో గురు పౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని బాబా మందిరాల్లో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. సాయి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. కానూరులోని మందిరంలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

శాకంబరీ శరణం

ఇంద్రకీలాద్రిపై ముగిసిన శాకంబరీ ఉత్సవాలు

ఇంద్రకీలాద్రిపై మూడు రోజుల పాటు ఘనంగా జరిగిన శాకంబరీ ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. మూడో రోజు కూడా భక్తులు భారీగా తరలివచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు. మహా పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికారు. 6



స్వచ్ఛతకే O_2

నగరంలో ఆక్సిజన్ పార్కు నిర్మాణానికి శ్రీకారం

ఎక్కడ నిర్మించాలన్న అంశంపై కసరత్తు

స్వచ్ఛమైన గాలి లభించడమే గగనమైపోయింది. ఎటుచూసినా కాలుష్యం నగరాన్ని కమ్మేస్తోంది. నగర జీవన విధానంలో స్వచ్ఛత అనే మాటే కరువైపోయింది. ఇలాంటి భయంకరమైన వాతావరణం నుంచి నగరవాసికి కాస్త ఉపశమనం కలిగించేందుకు, స్వచ్ఛమైన ప్రకృతిని, స్వచ్ఛత కలిగిన గాలిని అందజేయాలనే సంకల్పంతో ఆక్సిజన్ (O_2) పార్కు నిర్మాణానికి అధికార యంత్రాంగం సంకల్పించింది

- కాలుష్య నియంత్రణ మండలి ప్రణాళికలు
- ఆక్సిజన్ విడుదల చేసే మొక్కల పెంపకానికి ప్రాధాన్యం
- ఆరోగ్యాంధ్రప్రదేశ్‌లో భాగంగానే..





(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో ఆక్సిజన్ (O_2) పార్కు నిర్మించడానికి అధికార యంత్రాంగం సంకల్పించింది. దీనికి సంబంధించిన ప్రణాళికలను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రూపొందిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లోని ఆక్సిజన్ పార్కులను పరిశీలించి వాటికి భిన్నంగా అధునాతన పార్కును నగరవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు.

ఆరోగ్యంగా ఉండటానికే..

నగరం ఇప్పటికే కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయింది. శివారు ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల్లో బహుళ అంతస్థుల భవనాలు వెలుస్తున్నాయి. వాహనాల సంఖ్య మిగతా 6లో..

అధిక ఆక్సిజన్‌ను విడుదల చేసే మొక్కలివే..

పిప్పళ్ల : ఈ చెట్టు నుంచి రాత్రిపూట ఆక్సిజన్ విడుదలవుతుంది.

వేప : ఇందులో ఔషధ గుణాలు ఎక్కువ. గాలిని శుద్ధిచేసే లక్షణాలు ఉంటాయి.

మర్రి : ఎక్కువగా ఆక్సిజన్‌ను విడుదల చేసే చెట్లలో ఇదొకటి. దీనికి పెద్ద ఆకులు ఉంటాయి. ఈ మొక్క ఎదిగే కొద్దీ విస్తృతిని పెంచుకుంటుంది.

అర్జున : ఈ చెట్టు గాలిని పీల్చడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ చెట్టుకు గాలిని స్వచ్ఛంగా మార్చే లక్షణాలు ఉంటాయి.

తులసి : సాధారణంగా తులసి మొక్కలను ఇళ్లలో పెంచుకుంటారు. ఈ మొక్కల్లో ఔషధ గుణాలు ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతుంటారు. ఈ మొక్కలు అధిక స్థాయిలో ఆక్సిజన్ విడుదల చేస్తాయి.

మామిడి : అధికంగా ఆక్సిజన్‌ను విడుదలచేసే చెట్ల జాబితాలో మామిడికి ప్రత్యేక స్థానం ఉంది. దీని ఆకుల్లో ఆక్సిజన్ సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. గాల్లో ఉన్న కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి.



స్నాతకోత్సవం

పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన (హార్టీకల్చర్) విశ్వవిద్యాలయం ఆరో స్నాతకోత్సవం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో గురువారం ఘనంగా జరిగింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొని డిగ్రీలు పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందించారు. 6



ఆత్మీయ సమ్మేళనం

కొండపల్లి జడ్పీ ఉన్నత (బాలికల) పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం (మెగా పీటీఎం 2.0) జరిగింది. కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని విద్యార్థులతో ఉత్సాహంగా గడిపారు. కోలాటం ఆడటంతో పాటు విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. 8


మరో మాయం

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఇంకో దోపిడీ

- నిన్న టెస్టింగ్ టూల్స్, నేడు ఏసీలు, కంప్యూటర్లు మాయం
- 3 స్ప్లిట్ ఏసీలు, ఒక విండో ఏసీ, 18 కంప్యూటర్లు అదృశ్యం
- ఇంటిదొంగల చేతివాటం.. ఆలస్యంగా వెలుగులోకి..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో ఇంటిదొంగల దోపిడీ ఎక్కువైంది. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ (సర్కిల్) మిగతా 6లో..

కొండల్ని పిండేస్తున్నారు



రాఘవాపురం కొండలో తవ్వకాలు

నందిగామలోని రాఘవాపురం, పల్లగిరి కొండలు హాంఫట్

- పెద్దవరం అటవీ, ఏపీఐఐసీ భూములు, మైన్యూర్ సర్క్యూట్ కూడా..
- అధికార పార్టీ నాయకులే అక్రమార్కులు
- వైసీపీ హయాంలో అక్రమ మైనింగ్‌పై ఉద్యమించినవారే..
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నందిగామ మండలంలోని రాఘవాపురం, పల్లగిరి కొండలతో పాటు పెద్దవరం అటవీ, మైన్యూట్ సర్క్యూట్, ఏపీఐఐసీ భూములను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. వైసీపీ హయాంలోనే ఈ ప్రకృతి సంపదను దోపిడీ చేయగా, ఉద్యమాలు చేసిన నాటి ప్రతిపక్ష నాయకులు.. నేడు అధికార పార్టీ నాయకులు కావడంతో అక్రమాలకు తెరలేపారు. అధికారం చేతిలో ఉండటంతో అన్ని శాఖల అధికారులను నియంత్రణలో పెట్టి దందాలు నడుపుతున్నారు.

నందిగామ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాఘవాపురం, పల్లగిరి కొండలను అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు సొంత ఆస్తిలా పిండేస్తున్నారు. గత వైసీపీ పాలనలో బైపాస్ రోడ్డు పనులతో పాటు రియల్ ఎస్టేట్ వెంచర్లకు భారీగా మట్టిని అమ్మారు. ఆ సమయంలో విపక్షాలుగా ఉన్న నాయకులు అనేక ఉద్యమాలు చేశారు. నేరుగా దాడులు చేసి యంత్రాలను పట్టుకున్నారు. వాటిని మిగతా 6లో..

ప్రకృతి రమణీయతకు శాపం

నందిగామ పట్టణానికి అతి సమీపంలో ఉన్న పల్లగిరి, రాఘవాపురం కొండలపై ఆలయాలు, మసీదులు, చర్చిలు ఉన్నాయి. మునేటి ఒడ్డున రమణీయమైన వాతావరణం కనిపిస్తుంది. అలాంటి కొండలను అక్రమార్కులు తొలిచేయడంపై భక్తులు మండిపడుతున్నారు. రాఘవాపురం కొండ పరిసరాల్లోనే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కౌలురైతు ఆత్మహత్య

వరుస పంటనష్టంతో పెరిగిన అప్పులు

తీర్చే మార్గం లేక పురుగు మందు తాగి బలవన్మరణం



రాకేశ్ (ఫైల్)

వత్సవాయి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో అప్పులపాలై ఓ కౌలురైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు మిగతా 6లో..

సున్నంపాడు పోస్టాఫీసులో నగదు స్వాహా

300 మంది ఖాతాల్లో రూ.20 లక్షలు పోయినట్టు నిర్ధారణ

మరో రెండు, మూడు రోజులు కొనసాగనున్న విచారణ

జి.కొండూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జి.కొండూరు మండలం సున్నంపాడు గ్రామంలోని పోస్టాఫీసులో భారీ కుంభకోణం బయటపడింది. గ్రామంలోని 400 మందికి పైగా పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరిచి డబ్బు దాచుకోగా, వారిలో దాదాపు 300 మంది అకౌంట్లలో రూ.20 లక్షల వరకు అదృశ్యమైంది. పోస్టుమాస్టరే ఈ డబ్బును స్వాహా చేసినట్లు గురువారం జరిగిన విచారణలో తేలింది. ఈ విచారణ మరో రెండు, మూడు రోజుల వరకు జరిగే అవకాశం ఉంది. ఒక వ్యక్తి తన పేరు మీద రూ.2 లక్షలు డిపాజిట్ చేయగా, స్టాంప్ లేకుండా డబ్బును జమ చేసుకున్న పోస్టుమాస్టర్ ఖాతా పుస్తకం ఇచ్చాడు. డిపాజిట్ చేసిన వ్యక్తి మిగతా 6లో..



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ముగిసిన శాకంబరీ ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. యాగశాలలో గురువారం వేద పండితులు, అర్చకులు తుది హోమాలను నిర్వహించి అమ్మవారికి వివిధ ఉపచారాలను నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో దంపతులు ప్రధాన హోమగుండంలో సామగ్రిని హోమంలో సమర్పించారు. మూడు రోజుల పాటు శాకంబరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారి ఆలయాన్ని యాపిల్‌పండ్లు, బత్తాయి, అనాసలు తదితర పండ్లతో అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు కదంబ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. మూడురోజుల పాటు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. పౌర్ణమి కలిసి రావటంతో ఆలయంలో చండీహోమాలు, లక్షకుంకుమార్చనలు, శ్రీచక్రనవావరణార్చనలు, ఇతర ఆర్జిత సేవలు జరిగాయి. పూర్ణాహుతి అనంతరం ఈవో మాట్లాడుతూ, ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ముగిశాయని, భక్తులకు సంతృప్తికరంగా అమ్మవారి దర్శనాలు జరిగాయని చెప్పారు.

అన్నదానానికి ఈవో విరాళం

ఈవో వీకే శీనానాయక్ తన జన్మదినం సందర్భంగా గురువారం అన్నవితరణ నిమిత్తం రూ.50వేలను చెక్కురూపంలో విరాళంగా అందజేశారు. శీనానాయక్ దంపతులు, కుమారుడు సంతోష్‌కు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక ఆశీర్వచనం అందజేశారు.



భక్తి ప్రపత్తులతో గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని గిరిప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు ఉత్సవమూర్తులతో గిరిప్రదక్షిణ చేయటానికి సిద్ధంగా ఉన్న సమయంలో వర్షం అంతరాయాన్ని కలిగించింది. ఈవో శీనానాయక్, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి, తదితరులు కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. అనంతరం జై భవానీ, జైజై భవానీ అంటూ భక్తులు జేజేలు పలుకగా.. గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. వందలాదిమంది మహిళా భక్తులు అమ్మవారి నామస్మరణ చేసుకుంటూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ల మీదుగా బయలుదేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. వందలాది భక్తులు గిరిప్రదక్షణలో పాల్గొన్నారు. కాగా, గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు మార్గ మధ్యలో మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్న సూచన చేశారు.



కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి పై సాంస్కృతిక శోభ

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలను పురస్కరించుకుని ధర్మ ప్రచారం, సాంస్కృతిక కార్యక్రమాలతో గురువారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. అమ్మలగన్నయమ్మ ప్రకృతి స్వరూపంగా దర్శనమిస్తుండగా భజన సంకీర్తనలు, కోలాట నృత్యాలు, కూచిపూడి కళారూపాలు భక్తులను పరవశింపజేశాయి. రాజమండ్రికి చెందిన కోలాట నృత్య బృందాలు, చల్లపల్లికి చెందిన భజన సంకీర్తనలు, విజయవాడ నగరానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారులు దుర్గమ్మ సన్నిధిలో కళా ప్రదర్శన చేశారు. మన సంస్కృతి, కళలను గురించి భావి తరాలకు ప్రకటించే కళాబృందాలకు అమ్మవారి దర్శనం కల్పించి, కదంబం ప్రసాదం అందచేశారు.

గురువులకు పూజలు

గురుపౌర్ణమి సందర్భంగా గురువారం దేవస్థానం యాగశాలలో దేవస్థాన వేదపండితుడు తంగిరాల వెంకటేశ్వర ఘనాపాటి, సీనియర్ అర్చకులు శంకరమంచి శివప్రసాద్, ఆహితాగ్ని, వేదపండితుడు శ్రీరామచంద్ర సోమయాజుల దంపతులకు ఈవో శీనానాయక్ దంపతులు గురుపూజ చేశారు. శాస్త్రోక్తంగా, మంత్రపూర్వకంగా పాదపూజ చేసి పూలమాలలు సమర్పించారు. అనంతరం నూతన వస్త్రాలు, దక్షిణ తాంబూలాలు, ప్రసాదాలతో సత్కరించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, వేద పండితులు గురువుల ఆశీస్సులు అందుకున్నారు.

పశువుల మందుల టెండర్ రద్దు చేయాలి: జమలయ్య



అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పశువుల మందుల కొనుగోలుకు పాత నిబంధనలతోనే కొత్త టెండరును పిలవాలని ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పశుసంవర్ధక శాఖను కోరారు. నాసిరకం మందులు సరఫరా చేసే కంపెనీలకు అనుకూలంగా కొత్త నిబంధనలు పెట్టి, టెక్నికల్ బిడ్ ఓపెన్‌కు సిద్ధమౌతున్న నేపథ్యంలో ఆ టెండరును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ.15కోట్ల టర్నోవర్ కలిగిన కంపెనీలను టెండరు ద్వారా పిలవాల్సి ఉండగా.. టర్నోవర్‌ను రూ.12.5కోట్లకు కుదించడం వల్ల మందుల నాణ్యత ప్రశ్నార్థకమౌతుందన్నారు. 2018 నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్థాయిలో మందులు కొనే పద్ధతి ఉండగా, ఇప్పుడు జిల్లా పశువైద్యాధికారి మందులు కొనుగోలు చేసే పద్ధతిని ప్రవేశపెట్టడం సరికాదన్నారు. ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ విధానాన్ని కొనసాగించాలని, మందుల నాణ్యత నిర్ధారణ తర్వాతే కంపెనీలకు చెల్లింపులు జరపాలని సూచించారు.

స్వచ్ఛతకే O_2

(5వ పేజీ తరువాయి)

ఏటా పెరుగుతూనే ఉంది. ఈ ప్రభావమంతా నగరవాసులపై పడుతోంది. ఏటా శ్వాసకోశ వ్యాధులకు సంబంధించిన రోగులు పెరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి కాలుష్య కారణాలు లేని స్వచ్ఛమైన గాలిని ప్రజలకు అందజేయాలనే ఆలోచన నుంచి పుట్టిందే ఈ ఆక్సిజన్ పార్కు నిర్ణయం. రాష్ట్రం ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా ఉండాలంటే వ్యాయామం, యోగా దినచర్యగా ఉండాలని ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది. వ్యాయామం, వాకింగ్, యోగా వంటివి ఆక్సిజన్ పార్కులో చేసుకుంటే ఆరోగ్యం మరింత బాగుంటుందన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. నగరంలో రహదారులను కాలుష్యం కమ్మేసినా.. కొద్ది గంటల పాటు ఆక్సిజన్ పార్కులో గడిపితే చాలు స్వచ్ఛమైన గాలి అందే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ పార్కులో అధికంగా ఆక్సిజన్‌ను విడుదల చేసే మొక్కలను పెంచడానికి ప్రణాళికలు రూపొందించారు. ఈ తరహా ఆక్సిజన్ పార్కు తెలంగాణలోని మేడ్చల్ జిల్లా కండ్లకోయలో ఉంది.

రైతుల ఆదాయం పెంచడంలో..

ఉద్యాన రంగానిది కీలక పాత్ర

» పట్టభద్రులకు అవార్డుల ప్రదానం

» డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



ఉంగుటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పోషకాహార భద్రతను నిర్ధారించడంతోపాటు రైతుల ఆదాయాన్ని పెంచడంలో ఉద్యాన రంగం కీలకపాత్ర పోషిస్తుందని రాష్ట్ర గవర్నర్, ఉద్యాన విశ్వవిద్యాలయం కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో గురువారం పశ్చిమగోదావరి జిల్లా, వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన(హార్టీకల్చర్)విశ్వవిద్యాలయం ఆరో స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గవర్నర్, హార్టీకల్చర్ వర్సిటీ చాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించి డిగ్రీలు పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు.

ముఖ్యఅతిథిగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఐసీఏఆర్ -ఎన్ఏఏఆర్ఎం) డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్ విచ్చేసి స్నాతకోపన్యాసం చేశారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాలు విద్యార్థుల జ్ఞానాన్ని పెంచడంతోపాటు, వ్యక్తిత్వ నిర్మాణానికి పునాదిగా పనిచేస్తాయని, బాధ్యతాయుతమైన పౌరులుగా మారడానికి మూలస్తంభాలుగా నిలుస్తాయన్నారు. భారతదేశం క్రమంగా ప్రపంచ ఆర్థికశక్తి కేంద్రంగా, ప్రపంచ ఆహారసరఫరాకు కీలకమైన సహకారిగా అభివృద్ధి చెందుతోందన్నారు. 2024-25లో దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి 354మిలియన్ టన్నులకు చేరుకుందని, ఇది మునుపటి సంవత్సరం కంటే 6.5శాతం పెరుగుదలను సూచిస్తుందన్నారు. జాతీయ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)కి ఉద్యానరంగం సహకారం గణనీయంగా వుందన్నారు. 2024లో వ్యవసాయ అనుబంధరంగాలు జీడీపీలో దాదాపు 16శాతం వాటా కలిగివున్నాయన్నారు. ఉద్యానవన రంగం రాష్ట్రంలో సూర్యోదయ రంగంగా గుర్తించబడిందని పేర్కొన్నారు. 15.98లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 275.13లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యానవన ఉత్పత్తితో రాష్ట్రం దేశంలో ఐదవస్థానంలో వుందన్నారు. మిరప. కోకో, నిమ్మ, ఆయిల్‌పామ్, బొప్పాయి, టమోటా, జీడిపప్పు, మామిడి, అరటి, నారింజ వంటి పంటల ఉత్పత్తి, ఉత్పాదకతకు రాష్ట్రం మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఈసందర్భంగా పట్టభద్రులవుతున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. తొలుత ఉపకులపతి కె.గోపాల్ విశ్వవిద్యాలయం ఏర్పాటు, అందిస్తున్న కోర్సులు, సాధించిన విజయాలు, పురోభివృద్ధి గురించి వివరించారు. అనంతరం అతిథుల చేతులమీదుగా బంగారు పతకాలు సాధించిన 10మంది విద్యార్థులతోపాటు 38మంది పీహెచ్‌డీ స్కాలర్లు, 119మంది పీజీ, 1152మంది బీఎస్సీ(ఆనర్స్)పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. 2023నుంచి 2025వరకు అత్యుత్తమ సేవలు అందించిన కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.దీప్తికి బెస్ట్ ఎక్స్‌టెన్సన్ సైంటిస్ట్ అవార్డు, డాక్టర్ కె.లలితకు బెస్ట్ టీచర్ అవార్డు, వి.శివకుమార్‌లకు బెస్ట్ సైంటిస్ట్ అవార్డులు, అందజేశారు. ఎన్ఏఏఆర్ఎం డైరెక్టర్ గోపాల్‌లాల్ మాట్లాడుతూ, ప్రపంచ ఆహారం, పోషక భద్రతకు ఉద్యానరంగం చాలా అవసరమన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపుచేసి పోషక శ్రేయస్సును నిర్ధారించడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక స్థూల విలువ ఆధారిత మైన 11 ఉద్యానపంటలను క్లస్టర్డ్ విధానంలో ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్, ఉద్యాన విశ్వవిద్యాలయ కులపతి అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ కె.గోపాల్ ఘనస్వాగతం పలికారు. స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రజామందిరం వెలుపల పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం గవర్నర్ ప్రజామందిరంలోకి ప్రవేశించి అకడమిక్ కౌన్సిల్ సభ్యులతో గ్రూప్ ఫోటో దిగారు. తదుపరి ఆయనను ప్రత్యేక పోలీస్ బ్యాండ్ మేళంతో వేదిక వద్దకు సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ అగ్రికల్చర్ కో-ఆపరేషన్ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.శ్రీనివాసులు, బోర్డు మెంబర్లు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు, ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండల్ని పిండేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

అదుపులోకి తీసుకోవాలంటూ రాత్రంతా అక్కడే ఉండి ఉద్యమించారు. నాడు ఉద్యమాలు చేసిన వారే నేడు అధికారం చేతిలో ఉండటంతో అదే తరహా దోపిడీకి దిగడం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. కొందరు ముఖ్య నాయకులు రాఘవాపురం కొండ మట్టిని అమ్మేసుకుంటున్నారు. వైసీపీ తరహాలోనే బైపాస్ రోడ్డు విస్తరణకు రూ.కోట్ల విలువచేసే మట్టిని సరఫరా చేసి లబ్ధి పొందారు. మైనింగ్ అక్రమాలను అరికట్టేందుకు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్త చట్టాలు తీసుకొచ్చారు. అవేమీ తమకు వర్తించవన్నట్టు అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారు. నందిగామ, పరిసర ప్రాంతాల్లో ఎవరికైనా మట్టి అవసరం ఉంటే, ఏ అధికారి వద్దకు వెళ్లినా మట్టి లభించదు. అదే.. అధికార పార్టీ నాయకుల వద్దకు వెళ్తే పగలు డబ్బు చెల్లిస్తే రాత్రికి సరఫరా చేసేస్తారు. టిప్పరు మట్టిని రూ.4,800కు విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు వేలాది ట్రిప్పుల మట్టిని రియల్ ఎస్టేట్ వెంచర్లకు విక్రయించి రూ.కోట్లు దండుకున్నారు.

ఆర్డీవో పరిశీలన

మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్న రాఘవాపురం కొండ ప్రాంతాన్ని ఆర్డీవో కె.బాలకృష్ణ, తహసీల్దార్ సురేష్ తదితరులు గురువారం సందర్శించారు. బుధవారం కొండచరియలు విరిగి లారీ కార్మికుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఇకపై అక్రమ మైనింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని ఆర్డీవో తెలిపారు. అక్రమార్కులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతిపక్షాలకు సమాధానం చెప్పాలి : సీపీఎం

వైసీపీ హయాంలో రాఘవాపురంలో జరిగిన మట్టి అక్రమ తవ్వకాలపై ఉద్యమించిన నాయకులు ప్రస్తుతం వారు చేస్తున్నదేమిటో చెప్పాలని సీపీఎం స్థానిక నాయకుడు కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. నాడు వాహనాలను అడ్డుకుని రాత్రంతా ఉద్యమించిన నేతలు నేటి దుస్థితికి ఏం చెబుతారని ప్రశ్నించారు. అధికారంలో ఎవరున్నా అవినీతి కామన్ ఉందన్నారు.

కౌలురైతు ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

తెలిపిన సమాచారం మేరకు.. పెంట్యాలవారిగూడెం గ్రామానికి చెందిన కూనం రాకేశ్ (50) కొద్ది సంవత్సరాలుగా కౌలుకు భూమి తీసుకుని సేద్యం చేస్తున్నాడు. గత ఏడాది ఆరు ఎకరాలు కౌలు తీసుకుని మిర్చి, పత్తి పంట వేశాడు. పంట సరిగ్గా చేతికి రాక నష్టాలపాలయ్యాడు. అయినప్పటికీ ఈ ఏడాది కూడా ఏడెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి సాగు చేపట్టాడు. వరుస నష్టాలతో సుమారు రూ.12 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. గత సోమవారం పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు దివ్యాంగుడు. భార్య ఫిర్యాదు మేరకు వత్సవాయి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శొంఠి జ్యోతిర్‌భాను(ఫైల్)

జీవన జ్యోతి

» అవయవదానంతో ఏడుగురి ప్రాణాలు నిలిపిన ఆదర్శం

విజయవాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన దుర్గా ఎలక్ట్రానిక్స్ అధినేత శొంఠి జ్యోతిర్‌భాను అవయవదానం పలువురికి ఆదర్శంగా నిలిచింది. ఆయన భౌతికంగా దూరమైనా, ఏడుగురిలో సజీవంగా ఉంటారనే ఉన్నతమైన ఆశయంతో ఆయన కుమారులు, కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఏడుగురి జీవితాల్లో వెలుగులునింపింది. వివరాల్లోకి వెళితే.. ఈనెల ఏడో తేదీన బందరురోడ్డులోని రేడియోస్టేషన్ ఎదురుగా కుమారుడితో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్న శొంఠి జ్యోతిర్‌భాను రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. స్కూటీపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను రమేశ్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించినా ఫలితం లేకుండాపోయింది. మరుసటి రోజు ఆయన బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. కాగా, జ్యోతిర్‌భాను కుటుంబానికి అవయవదానంపై అవగాహన ఉంది. ఆయన తల్లిదండ్రులు సైతం నేత్రాలను దానం చేశారు. ఈ నేపథ్యంలోనే జ్యోతిర్‌భాను కుటుంబసభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. అవయవాల రవాణాకు ప్రతికూల పరిస్థితులు నెలకొనడంతో రెండు రోజుల పాటు ఆసుపత్రిలోనే జ్యోతిర్‌భానును ఉంచారు. గురువారం వైద్యులు అవయవాలను సేకరించారు. కిడ్నీని విజయవాడ క్యాపిటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి అమర్చారు. గుండెను తిరుపతిలోని పద్మావతి ఆసుపత్రికి, లివర్‌ను గుంటూరులోని మణిపాల్ ఆసుపత్రికి, ఊపిరితిత్తులను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, నేత్రాలను విజయవాడలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందజేసినట్టు వైద్యులు వెల్లడించారు.



తంగిరాల సౌమ్యను సత్కరిస్తున్న తానా సభ్యులు

సౌమ్యకు తానా సభ్యుల సత్కారం

నందిగామ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఐటీరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి తెలుగు వారు విదేశాలలో స్థిరపడేలా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర శ్రామికుడిలా నేటికీ పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. తానా సభలకు అమెరికా వెళ్లిన ఆమె పలు రాష్ట్రాల్లో పర్యటించి తెలుగు వారితో మాట్లాడారు. ఉత్తర అమెరికాలో పర్యటనలో ఆమెను పలువురు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ, ఐటీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన చంద్రబాబు లక్షలాది మంది తెలుగువారిని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా తీర్చిదిద్దారన్నారు. అదే స్ఫూర్తితో నేడు ఎంతోమంది విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ప్రవాసాంధ్రులు స్పందించిన తీరు మరువలేనిదన్నారు. సీఎం చేపట్టిన పీ4 పథకం అమలులో ప్రవాసాంధ్రులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా తానా సేవలను ఆమె కొనియాడారు.



బుద్దా వెంకన్నకు శాలువా కప్పి సత్కరిస్తున్న కె.శివశర్మ

బుద్దా వెంకన్నకు సత్కారం

వన్‌టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను వన్‌టౌన్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం 39వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కె.శివశర్మ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వెంకన్నకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివశర్మ మాట్లాడుతూ, తనకు రాజకీయ ఓనమాలు నేర్పిన గురువు బుద్దా వెంకన్న అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏలూరి వెంకన్న, నక్కా కృష్ణ, నెల్లూరు నాని, రామిశెట్టి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ ఈయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బస్‌స్టేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 129 డిపోలు, నాలుగు వర్క్‌షాపుల వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీ.వి.నరసయ్యలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయం వద్ద పతాక ఆవిష్కరణ జరిపిన అనంతరం విజయవాడ మెయిన్ డిపో వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, మరికొందరు ప్రముఖులు హాజరవుతారని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

అమరావతి రాజధానిలో పూలింగ్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్

» తిరువూరు సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావు సస్పెన్షన్

విజయవాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలోని వడ్డమానులో పూలింగ్‌లో ఉన్న వ్యవసాయ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేసినందుకు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావును విజయవాడ డీఐజీ రవీంద్రనాథ్ సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో విజయవాడ గాంధీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ డి.శ్రీనివాసరావును ఇన్‌చార్జిగా నియమించారు. మూడు రోజుల కిందటే ఈ ఘటన జరిగినా.. రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారులు అత్యంత రహస్యంగా ఉంచారు. ప్రాథమిక సమాచారం మేరకు.. గుంటూరు జిల్లా మేయర్ కోవెలమూడి నానికి చెందిన తుళ్లూరులోని 4 ఎకరాల వ్యవసాయ భూమిని శివశంకరరెడ్డి అనే వ్యక్తి మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించినట్టుగా తెలిసింది. సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావు ఆ ప్రైవేటు వ్యక్తికి సహకరించారని తన దృష్టికి రావటంతో గుంటూరు మేయర్ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి, రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఐజీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విజయవాడ డీఐజీ విచారణ జరిపారు. ప్రాథమిక విచారణలో అక్రమ రిజిస్ట్రేషన్‌గా తేలటంతో బాణావతు జగన్మోహనరావును సస్పెండ్ చేయటం జరిగింది. బాణావతు జగన్మోహనరావు ఇంతకు ముందు మైలవరం సబ్ రిజిస్ట్రార్‌గా పని చేశారు. కొద్దికాలం కిందట ఆయన తిరువూరుకు సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చారు. శివశంకరరెడ్డి అనే వ్యక్తి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ), డెత్ సర్టిఫికెట్లను చూపి ఆ భూమి తమదేనని పార్టీషన్ చేయించుకున్నట్టు తెలుస్తోంది.

సబ్ రిజిస్ట్రార్ 1బీ రికార్డును పరిశీలిస్తే.. అసలు ఈ భూమిపై వారికి వాస్తవ హక్కులు ఉన్నాయా లేదా అన్నది తెలిసేది. కానీ, ఈ కేసులో బాణావతు జగన్మోహనరావు 1బీని పరిశీలించలేదు. పార్టీషన్ డీడ్స్‌కు సంబంధించి పూర్వార్జితాలకు 1బీ పరిశీలన అవసరం లేదన్న నిబంధన ఉంది. ఈ నిబంధనను ఆధారంగా చేసుకుని సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసినట్టుగా తెలుస్తోంది. ఈ రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే గుంటూరు మేయర్ కోవెలమూడి నాని బంధువులు తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి ఇవి తమ భూములని, అక్రమ రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని పెద్ద గొడవే చేశారు. దీంతో ఆ రోజున తనను బలవంతం పెట్టి శివశంకరరెడ్డి అనే వ్యక్తి పార్టీషన్ డీడ్ రాయించుకున్నారని తిరువూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసు పెట్టినప్పటి నుంచి సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావు సెలవులో ఉన్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తిరువూరు సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావును సస్పెండ్ చేశారు. శివశంకరరెడ్డి ఎవరు , ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి అన్న వాటిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.

ఆగస్టు 21 నుంచి చెస్ టోర్నమెంట్

లబ్బీపేట(స్పోర్ట్స్), జూలై 10 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టు 21 నుంచి 25 వరకు ఆంధ్ర చెస్ అసోసియేషన్, ఎస్.ఆర్.ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఓపెన్ ఫీడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.ఫణికుమార్ తెలిపారు. టోర్నమెంట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం కలెక్టర్ లక్ష్మీశ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫణి మాట్లాడుతూ, పీబీ సిద్ధార్థ కళాశాలలో 10 లక్షలనగదు బహుమతితో ఈ టోర్నమెంట్ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకడమి వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ కృష్ణారావు, ఆంధ్ర, ఎన్టీఆర్ అసోసియేషన్ సెక్రటరీలు కె.జగదీష్, ఎం.రాజు, చెస్ కోచ్ ఎస్.కె. కాశిమ్ తదితరులు పాల్గొన్నారు.



సుజికాన్ 2025 బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్లు ధీరజ్, సతీష్ కుమార్ తదితరులు

నేటి నుంచి సుజికాన్-2025 సదస్సు

లబ్బీపేట, జూలై10 (ఆంధ్రజ్యోతి): 36వ సదరన్ యూరాలజిస్ట్స్ అసోసియేషన్ వార్షిక సదస్సు (సుజికాన్ 2025)ను ఈ నెల 11 నుండి 13వరకు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్టు కార్యక్రమ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ధీరజ్ కాసరనేని తెలిపారు. లబ్బీపేటలోని ప్రశాంత్ హాస్పటల్స్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చరిత్రలోనే అతి పెద్ద యూరాలజీ సమావేశం జరగనుందని, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 1000 మంది యూరాలజిస్టులు హాజరవుతున్నారని తెలిపారు. తాజా ఆవిష్కరణలను ప్రదర్శిస్తూ 75 ట్రేడ్ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన యూరాలజికల్ సబ్ స్పెషాలటీలలో 50కి పైగా శాస్త్రీయ సెషన్‌లు నిర్వహించబడతాయని తెలిపారు. అదే విధంగా 8 కేంద్రీకృత ఉప స్పెషాలటీ సమావేశాలు, సాంస్కృతిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సుజికాన్ 2025 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డాక్టర్ కె.ప్రశాంత్ కుమార్, డాక్టర్ సీవీ సతీష్ కుమార్, డాక్టర్ జి. శ్రీనివాసరావు, డాక్టర్ జి.రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపూర్-అరుణాచలం స్పెషల్ రైలుకు వీరవాసరంలో అదనపు హాల్ట్

రైల్వేస్టేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నరసాపూర్-తిరువణ్ణామలై 07219 స్పెషల్ రైల్ ఈనెల 16న వీరవాసరంలో అదనంగా నిలుపుదల చేస్తున్నట్టు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల అధికారిణి నుస్రత్ ఎం మంద్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా తిరువణ్ణామలై - నరసాపూర్ 07220 రైల్ ఈనెల 17వ తేదీన వీరవాసరంలో అదనంగా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. మిగిలిన పాలకొల్లు, భీమవరం స్టేషన్‌లలో రైళ్లు యధావిగా ఆగుతాయని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

మరో మాయం

(5వ పేజీ తరువాయి)

కార్యాలయంలోని క్వాలిటీ కంట్రోల్ విభాగంలో రూ.కోటి విలువైన టూల్స్ మాయమైన ఘటన మరువకముందే, తాజాగా ఏసీలు, కంప్యూటర్లు అదృశ్యమైన విషయం వెలుగులోకి వచ్చింది. వీటి విలువ దాదాపు రూ.10 లక్షలు ఉంటుందని అంచనా. అధికారుల ఉదాసీనత, ఈఎన్‌సీ ఉన్నతాధికారుల అలసత్వం వెరసి ఇంటిదొంగలు చెలరేగిపోతున్నారు. స్టోర్‌రూమ్‌లో ఉన్న టూల్‌కిట్లు మాయమయ్యాయంటే.. సెక్యూరిటీ లేకపోవడం వల్ల కావచ్చు. ఏకంగా కార్యాలయంలోని ఏసీలు, కంప్యూటర్లు కూడా పోయాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఉద్యోగులు పనిచేసే గదుల్లోని 3 స్విట్ ఏసీలు, ఒక విండో ఏసీ, 18 పాత కంప్యూటర్లు కనిపించకుండా పోయాయి. సెలవు రోజుల్లో కార్యాలయానికి వచ్చి దోపిడీకి పాల్పడ్డారని తెలుస్తోంది. గత శీతాకాలం లేదా వర్షాకాలంలో ఇవి మాయమై ఉంటాయని కార్యాలయంలోని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అసలే వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఎస్ఈ కార్యాలయంలో ఏసీలు, కంప్యూటర్లు కూడా మాయం కావడంతో విషయాన్ని గుట్టుగా ఉంచారు.

అందరం ఒక్కమాట మీదే ఉందాం : ఉద్యోగుల సమాలోచనలు

క్వాలిటీ కంట్రోల్ విభాగంలో టూల్‌కిట్ల మాయం వ్యవహారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించడంతో ఇతర విషయాలు బయటకు పొక్కకుండా ఉద్యోగులంతా సంఘటితమయ్యారు. ఉన్నతాధికారులు ప్రశ్నిస్తే.. అంతా ఒకే అభిప్రాయంతో ఉండాలని, అనుమానాలకు తావీయొద్దని నిర్ణయించారు.

పోస్టాఫీసులో నగదు స్వాహా

(5వ పేజీ తరువాయి)

మరణించడంతో ఆయనకు రావాల్సిన నగదు కోసం వారి బంధువులు పోస్టాఫీసుకు వెళ్లారు. పోస్టుమాస్టర్ డబ్బు ఇవ్వకుండా కుంటిసాకులు చెబుతుండటంతో బాధితురాలు విజయవాడలోని పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న తన బంధువును ఆశ్రయించారు. దీంతో ఈ కుంభకోణం వెలుగుచూసింది. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. ఐదేళ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పోస్టుమాస్టర్ ఇలా చేశారని ప్రాథమిక విచారణలో తేలింది. ఇంకా ఎంతమంది ఖాతాదారుల సొమ్ము గల్లంతైందో తేలాల్సి ఉంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మందికి జరిమానా

విజయవాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మందికి రూ.2.70 లక్షల జరిమానా విధిస్తూ విజయవాడ 6వ అడిషనల్ జ్యుడిషయల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు గురువారం తీర్పు చెప్పారు. జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెండు, నాల్గవ ట్రాఫిక్ పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి మోటారు వాహనాలు నడుపుతున్న 25 మందిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. నిందితుల్లో నలుగురికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున, 21 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.



కేబీసీలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె



వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఆటల పోటీల విజేతలు



గుణదలలోని డీవీ గిరిధర కుమార అవంతి మోడల్ ప్రైమరీ స్కూల్‌లో..

తల్లిదండ్రుల త్యాగాలను గుర్తించాలి

కోనేరు బసవయ్య చౌదరి పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో విద్యార్థులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచన

● తూర్పులో అన్ని పాఠశాలల్లో వేడుకగా జరిగిన మెగా పీటీఎం 2.0కు తరలివచ్చిన తల్లిదండ్రులు



కేబీసీలో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న తల్లులు



కొమ్మా సీతారామయ్య బాలికోన్నత పాఠశాలలో సమావేశానికి వస్తున్న తల్లిదండ్రులు



కొమ్మా సీతారామయ్య బాలికోన్నత పాఠశాలలో సెల్ఫీ పాయింట్



దర్శిపేటలోని వీఎంసీ ప్రైమరీ పాఠశాలలో...

పటమట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాలను పిల్లలు తెలుసుకొని చక్కగా చదువుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. గురువారం 11వ డివిజన్ కోనేరు బసవయ్య చౌదరి పాఠశాలలో ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే రామ్మోహన్, జేసీ ఇలక్కియా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంవత్సరంలో నాలుగుసార్లు తల్లిదండ్రులు వచ్చి ఉపాధ్యాయులను కలిసి తమ పిల్లలు ఏవిధంగా చదువుతున్నారో తెలుసుకోవాలన్నారు. ఇలక్కియా మాట్లాడుతూ ఆత్మీయ సమావేశం వలన పిల్లల స్థితిగతులపై సమాచారం తెలుసుకోవచ్చునన్నారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, తహసీల్దార్ రోహిణి, కోనేరు రాజేష్, ఎంఈవో విజయలక్ష్మి, విద్యాకమిటీ ఛైర్మన్ ఫైజున్నిసా, హెచ్‌ఎం సత్యనారాయణ, పాల్గొన్నారు. ● పటమట శ్రీకృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జరిగిన సమావేశంలో శ్రీకృష్ణవేణి విద్యా సంస్థల ఛైర్మన్ చిగురుపాటి వరప్రసాద్ తల్లిదం డ్రుల చేత పిల్లలను విలువలతో పెంచుతామని ప్రమాణం చేయించారు. విద్యార్థులు వారి తల్లిదం డ్రులను సత్కరించి వారి దీవెలను అందుకున్నారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డైరెక్టర్ రమణరావు, రాజగోపాలరావు, స్వామి, శరత్‌బాబు, పాల్గొన్నారు. ● 12వ డివిజన్ సంజయ్‌గాంధీ స్కూల్లో జరిగిన సమావేశంలో కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు నిర్మాణం ఆగిపోయిన స్కూల్ పై అంతస్థు గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యార్థులకు బహుమ తులు అందజేశారు. సాయన బుజ్జి, ప్రసాద్, కరీం, సాంబశివరావు, పాల్గొన్నారు.

విద్యార్థులే మన సంపద: ఎమ్మెల్యే గద్దె

మొగల్రాజపురం: విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు దేశానికి రాష్ట్రానికి సంపద అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. మొగల్రాజపురం బోయపాటి శివరామకృష్ణయ్య పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో ముందుకు వెళితే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.● పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం జరిగింది. ఈ



సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో తల్లులు

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎన్టీఆర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వేమూరు రవికుమార్ హాజరయ్యారు. అకాడమీ జాయింట్ సెక్రటరీ నిమ్మగడ్డ ప్రసాద్, ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. విద్యార్థుల తల్లుల పేరుతో మొక్కలు నాటారు. కార్పొరేటర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.● వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ ఇండ్ల విశాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల పూర్వ విద్యార్థిని డాక్టర్ చలసాని అనూష, మరోపూర్వ విద్యార్థి, జేఈఈ అడ్వాన్స్ టాపర్ విశాల్‌కుమార్, నీట్ టాపర్ అగస్త్య ఇండ్ల తదితరులు మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. వైస్‌ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, హెచ్‌ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భారతీనగర్: గుణదలలోని డీవీ గిరిధర కుమార అవంతి మోడల్ ప్రైమరీ స్కూల్‌లో జరిగిన సమావేశంలో స్కూల్ అభివృద్ధి దాత దాసరి హరికృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధి జాస్తి ప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాలు నిర్వహించారు. హెచ్‌ఎంమురళీకృష్ణ, అధ్యాపకులు, స్కూల్ మేనేజింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ రమాదేవి పాల్గొన్నారు.

విజయవాడ కల్చరల్ : శ్రీ దుర్గామల్లేశ్వరీ సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.0 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ బిజినెస్ అసోసియేషన్(ఎల్ఐసీ) ఎం.కృష్ణప్రభ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మీటింగ్ విద్యార్థుల తల్లులకు, అధ్యాపకులకు మధ్య ఒక ఆరోగ్యకర స్నేహపూరిత వాతావరణాన్ని కలిగిస్తుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ మాట్లాడుతూ విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలబడిన ప్రభుత్వ సహాయాన్ని సమాజం మరిచిపోదని తెలిపారు. విద్యార్థుల తల్లులకు పెట్టిన ముగ్గుల పోటీలు, లెమన్ అండ్ స్పూన్ పోటీలు, 2025 ఐపీసీ మార్చిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం, విద్యార్థులంతా వారి తల్లులకు పాదపూజ కార్యక్రమం, తల్లులు, అధ్యాపకులతో ఇంటర్-యాక్ట్ ప్రోగ్రాం జరిగాయి. తర్వాత తల్లులందరికీ కళాశాల యాజమాన్యం అల్పాహారం, బిస్కెట్స్, కూల్‌డ్రింక్స్ అందించారు. విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొంటుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వెల్లడించారు. విద్యార్థులంతా ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఉద్బోధించారు. గురువారం కృష్ణలంక పొట్టి శ్రీరాములు హైస్కూల్, జూనియర్ కళాశాలలోని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో గద్దె రామ్మోహన్‌తో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ తమ పిల్లలు పాఠశాలలో ఏ స్థాయిలో ఉన్నారనే విషయాన్ని తెలుసుకోవడానికి ఇలాంటి సమావేశాల్లో తల్లిదండ్రులు పాల్గొనడం కూడా చాలా అవసరమని భావించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ పేరేపి ఈశ్వర్, టీడీపీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, కొర్రా అప్పన్న, కేశనం భావన్నారాయణ, జనసేన నాయకులు కొవ్వూరు కిరణ్‌కుమార్, బీజేపీ నాయకుడు వాసా పల్లపురాజు తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక సుధాకర్స్ ఐడీయల్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరిగింది. స్కూల్ ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, ఎంఈవో సాంబశివరావు, లీడ్ ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడికొండ సుబ్బారావు స్కూల్లో...

రాణిగారితోట: 18వ డివిజన్‌లోని తాడికొండ సుబ్బారావు స్కూలో జరిగిన ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె. ధనలక్ష్మి పీరుబాబు, వెంకటేశ్వరరెడ్డి, కళ్యాణ్ కిషోర్, స్కూల్‌ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేముల దుర్గారావు

నారాయణ ఐఐటీ మెయిన్స్ క్యాంపస్‌లో ...

బెంజిసర్కిల్: నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని నారాయణ ఐఐటీ మెయిన్స్ క్యాంపస్‌లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0ని ఘనంగా నిర్వహించినట్లు నారాయణ కో ఆర్డినేటర్ పి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అనంతరం గురుపౌర్ణమి సందర్భంగా తల్లిదండ్రులను గౌరవించి, వారి పాదాలకు పిల్లలు పాదాభివందనం చేశారు. పటమట సీఐ పవన్ కిషోర్, డీన్ సీవీ రెడ్డి, ఏజీఎం తాతినేని వినయ్, ప్రిన్సిపాల్ హరిప్రసాద్, 600 మంది విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



కృష్ణలంక డొంకరోడ్డులోని సాయిబాబా మందిరంలో

కృష్ణలంక, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక డొంకరోడ్డులోని సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి పురస్కరించుకొని గురు పూజోత్సవం నిర్వహించారు. భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ ధర్మకర్త కొడాలి సాయిబాబు తెలిపారు. ● స్థానిక 20వ డివిజన్‌లోని నవభారత్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ శ్రీహరిని స్థానిక కార్పొరేటర్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అడపా శేషు, బండ్రెడ్డి బాపిరెడ్డి, సురేష్ వర్మ పాల్గొన్నారు.

విజయవాడ లీగల్: విజయవాడ న్యాయవాది గుమస్తాల అసోసియేషన్ హాలులో సీనియర్ సభ్యులైన సుబ్బారావు, ఎడ్ల వెంకటేశ్వరరావు, టి.ఎస్.కె.శర్మ, రాష్ట్ర న్యాయవాది గుమస్తాల వెల్ఫేర్ కమిటీ మెంబర్ నాళం బాలకృష్ణలను మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషాలు గురువారం ఘనంగా సత్కరించారు. న్యాయవాద గుమస్తాల అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలకృష్ణమూర్తి, సెక్రటరీ శ్రీనివాస్, సంఘసభ్యులు రమేష్, సాయి, వెంకటేశ్వరరావు, మహేష్, ధనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **లబ్బీపేట:** నలంద డిగ్రీ కళాశాలలో జరిగిన గురు పౌర్ణమి వేడుకలకు ముఖ్య అతిథిగా హిందూ కాలేజీ విశ్రాంత ప్రదానాచార్యులు దివి నరసింహాదీక్షితు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేటి సమాజంలో గురువు పాత్ర అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్స్‌పాల్ ఎం.అనురాధ, అధ్యాపకులు రత్నకుమారి పాల్గొన్నారు. **గుణదల:** గుణదల్లోని ఎస్ఎల్‌వీ అమరావతి గ్రాండ్-2లో నిర్వహించిన గురుపౌర్ణమి కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త, సంఘసేవకుడు తొండెపు వెంకట హనుమంతరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడికి తనలోని అత్యంత నిగూఢమైన దివ్యత్వాన్ని ఓంకారం విశిష్టతను తెలియజేశారు. గురుపౌర్ణమి వేడుకకు తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా తమిళనాడు, కర్నాటక, ముంబై రాష్ట్రాల నుంచి సాధకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి, టి. శ్రీనివాస్, మమత, వందన, సాంబశివరావు, ప్రసన్న పాల్గొన్నారు.



గుణదల ఎస్ఎల్‌వి అమరావతి గ్రాండ్-2లో..



నలంద కాలేజీలో...

నాగార్జున నగర్ కాలనీలో.....

భారతీనగర్: నాగార్జున నగర్ కాలనీలోని సాయి మందిరంలో కాలనీ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 4000మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి పల్లకీ సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వీరమాచినేని పూర్ణచంద్రరావు, అసోసియేషన్ సభ్యులు సజ్జ వెంకట కృష్ణారావు, జి.సీతా రామయ్య, దుర్గాప్రసాద్, పాల్గొన్నారు. ● గురునానక్ కాలనీలోని సాయిమందిరంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు.

శాకంబరీగా రాజరాజేశ్వరీ అమ్మవారు

పటమట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పటమట దర్శి పేటలో ఉన్న శ్రీరాజరాజేశ్వరీ లలితా పరమేశ్వరీ అమ్మవార్లను ఆషాఢ మాసం సందర్భంగా పలు రకాలైన కూరగాయలతో శాకంబరీగా అలంకరించారు. ఆలయ ప్రధాన పూజారి మల్లిఖార్జునశర్మ అమ్మవారిని తీర్చిదిద్దారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ గౌరవాధ్యక్షుడు బొప్పన భవకుమార్, అధ్యక్షులు నాసరయ్య, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పాల్గొన్నారు.

18 నుంచి కాళీమాత అమ్మవారు

కృష్ణలంక: త్రిశక్తి పీఠంలోని కాళీమాత అమ్మవారు ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం 10 గంటలలోగా భక్తులు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఇచ్చి ఆలయ కమిటీకి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న గద్దె క్రాంతి, గద్దె రాజేష్ తదితరులు

మహిళ కుటుంబానికి గద్దె కుటుంబం వితరణ

రాణిగారితోట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం కోల్పోయిన మహిళ కుటుంబానికి గురువారం గద్దె క్రాంతి, గద్దె రాజేష్ ఆర్థికసాయం అందజేశారు. కృష్ణలంక బాలాజీనగర్‌కు చెందిన గొరుసుపల్లి నాగ మల్లేశ్వరి, భర్త, పెద్దకుమారుడిని కోల్పోయింది. మతిస్థిమితం కోల్పోయిన ఆమె కుటుంబ దీనగాథ తెలుసుకున్న ఎమ్మెల్యే గద్దె అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గురువారం బాలాజీనగర్‌లోని ఆ ఇంటికి గద్దె క్రాంతి, గద్దె రాజేష్ వెళ్లి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశా రు.



నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఆటోమొబైల్ మెకానిక్స్ అభివృద్ధికి కృషి

నూతన అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు వెల్లడి

కానూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్‌లో పనిచేసే ఆటోమొబైల్ మెకానిక్స్ అభివృద్ధికి తాను శాయశక్తుల కృషిచేస్తానని ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు(కొండ) తెలిపారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం సాయంత్రం జవహర్ ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ హాలులో జరిగింది. ఈసందర్భంగా 2025-2028 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐలా మాజీ ఛైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

అసోసియేషన్ సభ్యుడు శివాజీ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షునిగా రెండోసారి ఎన్నికైన గంధం వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా షేక్ దస్తగిరి, కోశాధికారిగా షైలు రామ్మోహనరావు, ఉపాధ్యక్షులుగా ఐనాల ఉమామహేశ్వరరావు, సయ్యద్‌రియాజ్ గాలిబ్, రేఖపల్లి రామకృష్ణ ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా తోట శంకర రావు, వేమూరి చంద్రమోహన్, లక్కింశెట్టి కనకారావు, 12 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారిగా పంచకర్ల వెంకట రమణ వ్యవహరించారు.

జాతీయ రహదారిపై భద్రత చర్యలు

● సత్యంగారి హోటల్ సమీపంలో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు



హైవే పై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్

విజయవాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు కేంద్రంగా మారిన కృష్ణలంక సత్యం గారి హోటల్ సమీపంలో రహదారి భద్రతా చర్యలను పోలీస్, నేషనల్ హైవే ఆథారిటీ, రవాణా శాఖ అధికారులు ఎట్టకేలకు తీసుకున్నారు. హైవే పై వాహనాల వేగాన్ని తగ్గించి, తద్వారా ప్రమాదాలను నివారించే దిశగా అధికార యంత్రాంగం అడుగులు వేసింది. దీనిలో భాగంగానే జాతీయ రహదారులు, పోలీస్, రవాణా శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో ఈ ప్రాంతాన్ని ఇటీవలే సందర్శించారు. మూడు శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ప్రమాదాల జరిగే ప్రాంతానికి అతి సమీపంలో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేశారు.

పెరిగిన విద్యుత్ ధరలు తగ్గించాలంటూ నిరసన

రాణిగారితోట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పెరిగిన విద్యుత్ ధరలు తగ్గించాలంటూ రాణిగారితోటలోని విద్యుత్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పీటర్ జోసెఫ్ మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలే పెను భారంగా మారినా మళ్లీ చార్జీలు పెంచటం అన్యాయమని వెంటనే ప్రభుత్వం చార్జీలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈకి వినతి పత్రం అందజేశారు. నాయకులు అబ్దుల్ అన్సారీ, దమ్ము రాజు పాల్గొన్నారు.

డబ్బులు తీసుకుని మోసం చేసిన ఇద్దరి పై కేసు

వన్‌టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మోసం చేసిన ఇద్దరి పై గురువారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. నిడమానూరు ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద నివాసం ఉంటున్న పరిమి వంశీ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి భవానీపురానికి చెందిన దీపక్‌తో పరిచయం అయ్యింది. దీపక్ అప్పుడప్పుడు వంశీ వద్ద డబ్బులు తీసుకుంటూ ఉంటాడు. యశ్వంత్‌ను తన అన్నయ్య అని వంశీకి దీపక్ పరిచయం చేశాడు. యశ్వంత్ తనకు కూడా రూ.10లక్షలు కావాలని వంశీని అడిగాడు. వంశీ జనవరి నెలలో రూ.7లక్షలు యశ్వంత్‌కు ఇచ్చాడు. మరోసారి రూ.3లక్షలు, మొత్తం కలిపి రూ.10లక్షలు యశ్వంత్‌కు ఇచ్చాడు. అందుకు యశ్వంత్ వంశీకి మూడు కార్లు తాకట్టు పెట్టి రెండు నెలల్లో డబ్బులు ఇచ్చి కార్లు తీసుకుంటానని చెప్పాడు. అయితే గడువు పూర్తయినా యశ్వంత్ డబ్బులు ఇవ్వకపోవడం, ఫోన్ ఎత్తకపోవడంతో వంశీ భవానీపురంలో ఉన్న యశ్వంత్ ఇంటికి వెళ్లాడు. జూన్ నెలాఖరులో డబ్బులు ఇస్తానని, కార్లు తీసుకుని బృందావన్ కాలనీకి రమ్మని వంశీకి చెప్పాడు. వంశీ మరో ఇద్దరితో కలిసి వెళ్లాడు. అయితే యశ్వంత్ వంశీతో మాట్లాడుతుండగా యశ్వంత్ అనుచరులు మూడు కార్లు వేసుకుని వెళ్లిపోయారు. దీంతో బాధితుడు కృష్ణలంక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. పోలీసులు దీపక్, యశ్వంత్‌ల పై కేసు నమోదు చేశారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రణాళిక

విజయవాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గృహ, వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ వినియోగారులకు రానున్న రోజుల్లో మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏపీసీపీడీసీఎల్ అధికారుల ప్రణాళిక సిద్ధం చేశారు. ఇటీవల జరిగిన వార్షిక సమావేశంలో జిల్లావ్యాప్తంగా గతేడాది నిర్మాణం చేసిన సబ్ స్టేషన్ల వివరాలను, ఈ ఏడాది నిర్మించ తలపెట్టిన సబ్ స్టేషన్ల వివరాలను ప్రకటించారు. తాజా నివేదిక ప్రకారం 2024లో 132/33 కేవీ స్టేషన్లు రెండు నిర్మాణం చేయాలని తలపెట్టి వాటిని పూర్తి చేశారు. 33/11 కేవీ సబ్ స్టేషన్లలో నాలుగింటికి మూడు, 30 వ్యవసాయ ఫీడర్లకు 16, పీఎం సూర్యఘర్ పథకం ద్వారా 20వేల సోలార్ రూఫ్‌టాప్‌లకు 1,969, 3,085 వ్యవసాయ సర్వీసులకు గానూ 3,765 పూర్తి చేశారు. ఈ ఏడాది 33/11 కేవీ సబ్ స్టేషన్లు రెండు నిర్మాణం పూర్తి చేయాలని, వ్యవసాయ ఫీడర్లు 68 ఏర్పాటు చేయాలని, సోలార్ రూఫ్‌టాప్‌లు 58,031, వ్యవసాయ కనెక్షన్లు 2,889 మంజూరు చేయాలని అంచనా వేశారు. రీవ్యామ్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ (ఆర్‌డీఎస్) పథకంలో భాగంగా 11 కేవీ ఫీడర్లు 84, 33 కేవీ ఓవర్ లోడ్ ఫీడర్లు తొమ్మిది, 11 కేవీ ఓవర్ లోడ్ ఫీడర్లు 29 అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటితో పాటు 33 కేవీ ఫీడర్లు మూడు, 11 కేవీ ఫీడర్లు 12, 18 ఎల్‌టీ లైన్లు పాత వాటి స్థానంలో పునరుద్ధరించనున్నారు.

మాజీ సీఎం జగన్ వీకెండ్ పొలిటీషియన్..!

● ఏపీ కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్ హెడ్ భార్గవ్

విజయవాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ వారంతపు రాజకీయ నేతగా రూపాంతరం చెందారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్ హెడ్ వల్లూరి భార్గవ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. పర్యటన పేరుతో మామిడి పంటలను నాశనం చేశారని, నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మహిళా ఎమ్మెల్యేని సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా అవమానకర వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. రైతు శ్రేయస్సు పేరుతో తప్పుడు స్క్రిప్ట్‌ను ప్రదర్శించి విఫలమయ్యారన్నారు. బెంగళూరు నుంచి వారం చివరిలో రాష్ట్రానికి వచ్చి రాజకీయ దుమారం రేపుతున్న జగన్‌పై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే అధికారంలో కొనసాగే అర్హత కూటమి ప్రభుత్వం కోల్పోతుందని హెచ్చరించారు. జగన్ చేస్తున్న తప్పులపై చర్యలు తీసుకోకుండా ఉన్న హోంమంత్రి, అధికారులు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

2445 మంది ఎస్సీ విద్యార్థుల

తల్లికి వందనం దరఖాస్తులు పెండింగ్

● షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి మహేశ్వరరావు

విజయవాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలకు చెందిన 2445 మంది ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి మహేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన తెలుపుతూ విద్యార్థుల బ్యాంకు, పోస్టల్ ఖాతాలు ఇప్పటివరకు ఎన్‌పీసీఐతో అనుసంధానం చేసుకోలేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎస్సీ విద్యార్థులతో బ్యాంక్, పోస్ట్ ఆఫీస్‌లో కొత్త ఖాతాలు తెరింపించి ఎన్‌పీసీఐకు అనుసంధానం చేయాలని ఆయన కోరారు.

మహిళ బ్యాగ్ చోరీ

విజయవాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్కూటర్‌పై వెళ్తున్న ఓ మహిళ బ్యాగ్‌ను గుర్తుతెలియని దొంగలు కాజేసిన ఘటన బుధవారం రాత్రి పడవలరేవు వంతెన వద్ద జరిగింది. నిడమానూరు శివాలయం వద్ద నివసిస్తున్న ఆవుల పావనిదేవి ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం ఉండడంతో రాత్రి 7 గంటల వరకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకున్నారు. సమావేశానికి హాజరైన వారికి స్నాక్స్ ఇవ్వడం కోసం విజయ టాకీస్ వద్ద ఉన్న రాజు ఫీ స్వీట్స్ షాపునకు అక్క కుమార్తె షర్మిష్టతో కలిసి స్కూటర్‌పై వెళ్లి తిరిగి నిడమానూరు ఇంటికి బయలుదేరారు. షర్మిష్ట స్కూటర్ నడుపుతుండగా పావని వెనుక వైపున కూర్చున్నారు. వారు పడవల రేవు జంక్షన్ వద్ద గల టిజిఫ్ ఫుడ్‌కోర్టు వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె చేతిలోని బ్యాగ్‌ను లాక్కుని బీఆర్టీఎస్ రోడ్డులోకి వెళ్లిపోయారు. బ్యాగ్‌లో రూ.లక్ష, సెల్‌ఫోన్ ఉన్నాయి. పావని మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అత్యాచార నిందితుడికి ఏడేళ్ల జైలు

విజయవాడ లీగల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): యువతిపై అత్యాచారం కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో ఏడేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం అజిత్‌సింగ్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఫిర్యాది తన కుటుంబంతో నివసిస్తోంది. 2018 జూన్ 23న కుటుంబసభ్యులు పనిమీద బయటకు వెళ్లినప్పుడు ఇంటిలో బాధితురాలు ఒక్కరే ఉండగా ఆమె మేనత్త కుమారుడైన వాంబేకాలనీకి చెందిన అత్తిలి కనకరాజు ఇంటిలోకి ప్రవేశించి బలవంతంగా బాధితురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుపై సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీ రాధ 14 మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రౌడీషీటర్ జాన్‌పై కేసు నమోదు

విజయవాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన రౌడీషీటర్ కొక్కిలిగడ్డ జాన్‌పై మాచవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే జాన్ ఇటీవల ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించి బెదిరించగా పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడలోని మునిసిపల్ ఎంప్లాయిస్ కాలనీలో ఓ ఇంట్లో సదరు మహిళ కుటుంబంతో అద్దెకుంటోంది. ఆమెను ఇంటి నుంచి పంపించేందుకు యజమాని ఓ ప్రజాప్రతినిధి సూచన మేరకు రౌడీషీటర్ జాన్‌ను సంప్రదించాడు. దీంతో జాన్ ఈ నెల 3న రాత్రి 8గంటలకు అనుచరులతో వచ్చి రౌడీయిజం చేశాడు. కుమారుడితో ఉన్న మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. తనపై చేతులతో దాడి చేయడంతో పాటు దుస్తులను చించేసి వివస్త్రను చేశారని, దీంతో తన కుమారుడు పారిపోయాడని బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొంది. రౌడీషీటర్‌ను పురమాయించిన ప్రజాప్రతినిధి సిఫార్సులకు తలొగ్గిన పోలీసులు ఫిర్యాదును బుట్టదాఖలు చేశారు. దీంతో మహిళ టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆశ్రయించింది. వారు కూడా అదుపులోకి తీసుకున్న జాన్‌ను విడిచిపెట్టారు. దీంతో బాధితురాలు పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించింది. వారి ఆదేశాల మేరకు జాన్‌పై పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు.

ఆపరేషన్ జీపీఎస్

10వేల పైగా వాహనాలకు జీపీఎస్ ఉండేలా చర్యలు ● వాహనదారులకు కౌన్సెలింగ్ ● ఇప్పటి వరకు 300 వాహనాలకు జీపీఎస్

ఒక వ్యక్తి ఊరు వెళ్తూ బైక్‌ను బంధువుల ఇంటి వద్ద పెట్టాడు. రెండు రోజుల తర్వాత వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు.

కొండ ప్రాంతంలో నివసించే ఓ యువకుడు ఖరీదైన బైక్‌ను కొనుగోలు చేశాడు. కొండ ఎక్కడానికి ఉన్న ర్యాంప్ వద్ద బైక్‌ను పార్క్ చేసి పైనున్న ఇంటికి వెళ్తుండేవాడు. ఈ కొత్త బైక్‌పై కన్నేసిన దొంగలు దాన్ని మాయం చేశారు.

భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన బైక్ చోరీలకు ఈ రెండు ఘటనలు ప్రత్యక్ష ఉదాహరణలు. పోలీసులు రాత్రిపూట ఎంత పటిష్ఠంగా గస్తీ నిర్వహించినా ఎక్కడో ఓ చోట బైక్ మాయమవుతూనే ఉంది. దీనితో భవానీపురం పోలీసులు ఆపరేషన్ జీపీఎస్‌కు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లోని వాహనాల భద్రత కోసం విస్తృతంగా అమలు చేస్తున్నారు. వాహనదారులకు జీపీఎస్ ప్రయోజనాలపై కౌన్సెలింగ్ చేసి వారితో ఆ పరికరాన్ని అమర్చుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ



భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఒకే కొండ ప్రాంతం ఉంది. ఇది కుమ్మరి పాలెం నుంచి సొరంగం వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో కింది నుంచి పై వరకు సుమారుగా 10వేలకు పైగా ద్విచక్ర వాహనాలున్నాయి. ఇక్కడి యువకులు ఖరీదైన బైక్‌లను కొనుగోలు చేస్తున్నారు. కొంతమందికే ఇంటి ముందు నిలుపుకునే వాహనం అవకాశం ఉంది. పైభాగంలో నివసించే వారు దిగువన గానీ, మధ్యలో నిర్మించిన ర్యాంపు వద్ద గానీ నిలుపుకుంటారు. ఈ వాహనాలకు భద్రత లేదు. ఎక్కడో ఒకచోట ఏదో ఒక వాహనం చోరీ అవుతూనే ఉంది. బైక్ కనిపించడం లేదంటూ రోజుకు రెండు ఫిర్యాదులు వస్తుండేవి. దీంతో పోలీసులు చైన్ ఆపరేషన్ మొదలుపెట్టారు. ఇది మామూలు ప్రదేశాల్లో విజయవంతమవుతోంది. కానీ కొండ ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీరికి జీపీఎస్ ద్వారా మాత్రమే రక్షణ కల్పించగలమని పోలీసులు భావించారు. కుమ్మరి పాలెం నుంచి సొరంగం వరకు ఉన్న 10 వేల ద్విచక్ర వాహనాల్లో ఇప్పటి వరకు 300కి పైగా వాహనాలకు జీపీఎస్ పరికరాన్ని అమర్చుకునేలా వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సాధారణంగా వాహనానికి జీపీఎస్ అమర్చుకోవడానికి మార్కెట్‌లో రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు. బ్లాక్ బక్ అనే సంస్థను తక్కువ ధరకు జీపీఎస్‌లు అమర్చడానికి ఒప్పించారు. ఇప్పుడు వాహనం కొత్తదైనా, పాతదైనా వాహనదారులు జీపీఎస్ పరికరం అమర్చుకోవడానికి ముందుకొస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీ చేసిన బైక్‌లను గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్నారని పోలీసులు గుర్తించారు. ఈ నేరగాళ్లు ఆంధ్ర - ఒడిశా సరిహద్దు (ఏవోబీ) ప్రాంతానికి తీసుకెళ్లి గంజాయి కోసం విక్రయించేస్తున్నారు.

ఫలితాలు వస్తున్నాయి..

ఉమామహేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్, భవానీపురం

కొండ ప్రాంతాల్లోని వాహనాలకు జీపీఎస్ పరికరం మాత్రమే రక్షణగా ఉంటుందని భావించాం. ఈ పరికరం ఉన్న వాహనాన్ని దొంగిలించినా ఏ ప్రాంతంలో ఉందో వాహనదారులకు ఫోన్‌కు సందేశం వస్తుంది. దీనికి అనుబంధంగా యాప్ ఉంటుంది. దాన్ని మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే ఎప్పటికప్పుడు సమాచారం తెలుస్తుంది. బైక్ స్టాండ్ తీసినా అలర్ట్ వస్తుంది. ఈ జీపీఎస్ ఆపరేషన్ మొదలుపెట్టిన తర్వాత ఫిర్యాదులు తగ్గాయి.

సాగుకు నోచని వంద ఎకరాలు

● రియల్ వెంచర్లతో రైతులకు కష్టాలు
● ప్లాట్లకు రోడ్డు కోసం కాలువలు పూడ్చివేత
● నీళ్లు పోయే దారి లేక చెరువుల్ని తలపిస్తున్న పొలాలు
● తాడేపల్లి రైతుల ఆవేదన



పొలాల్లో నిలిచిపోయిన నీళ్లను చూపిస్తున్న రైతు

వర్షాలు మొదలవడంతో ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. రైతులంతా నారు పనిలో బిజీగా ఉన్నారు. మరికొందరు పొలాలు దున్నుకుని ఇక నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే కొత్తూరు తాడేపల్లిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. తాడేపల్లి ఎర్రచెరువు కిచ్చాయకుంట సమీపంలోని మాగాణి రైతులు ఉసూరుమంటూతలలు పట్టుకుంటున్నారు. సుమారు వందకు పైగా ఎకరాల్లోని పొలాల్లో రెండేళ్లుగా నీరు నిలిచి ఉండటంతో కనీసం పొలంలోకి దిగే పరిస్థితులు లేవు. పంట పొలాల మీదుగా ప్రవహించే నీరు ఎటూ వెళ్లే దారి లేక ఎక్కడికక్కడే నిలిచి పోవడంతో పొలాలు చెరువులను తలపిస్తూ సాగుకు నోచుకోవడం లేదు. ఈ సమస్యకు కారణం అధికారుల నిర్లక్ష్యం, రియల్టర్ల నిర్వాకమేనని రైతులు ఆరోపిస్తున్నారు.

- విజయవాడ రూరల్, ఆంధ్రజ్యోతి

కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని ఎర్ర చెరువు కిచ్చాయకుంట వద్ద బుడమేరును ఆనుకుని వందకు పైగా ఎకరాల్లో మాగాణి భూములున్నాయి. ఇక్కడందరూ చిన్న, సన్నకారు రైతులే. ఏడాదికి రబీ, ఖరీఫ్ రెండు సీజన్లలో గతంలో పంటలు పండించేవారు. గత ఏడాది బుడమేరు వరదల పుణ్యమాని పొలాల వెంబడి కరకట్ట తెగి పొలాలన్నీ నీటమునిగి పంట పూర్తిగా దెబ్బతింది. అనంతరం స్థానిక రైతుల వినతుల మేరకు ఏడాదికి స్పందించిన అధికారులు ఎట్టకేలకు కట్టకు పడిన గండిని పూడ్చారు. అయితే అప్పటి నుంచి బుడమేరు నీటితో పాటుగా ఊరి వాడకపు నీరు ఇది చాలదన్నట్టు ఇటీవల కురిసిన వర్షపు నీరు కూడా ఈ పొలాల్లోకే వచ్చి చేరాయి. సాధారణంగా వర్షపు నీరు, బుడమేరు నీరు, ఊరి వాడకపు నీరంతా ఈ పొలాల మీదుగా దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతుంది. అయితే ప్రస్తుతం ఇక్కడ ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి దిగువ ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి లేక రెండేళ్లుగా పంటలకు నోచుకోవడం లేదు.

కాలువలు పూడ్చేసిన రియల్టర్లు

కిచ్చాయకుంట మాగాణి పొలల సమీపంలో పలువురు పంట పొలాలను వెంచర్లుగా మార్చేశారు. అందులో ప్లాట్లకు దారి కోసం దిగువ ప్రాంతాలకు ప్రవహించే నీటి కాలువలను పూడ్చి వేయడంతో సమస్య ఉత్పన్నమైంది. సాధారణంగా ఎర్రచెరువు కిచ్చాయకుంట మాగాణి పొలాల మీదుగా దిగువకు వెళ్లే నీరు సమీపంలోని తుంగ చెరువులోకి చేరుతుంది. దారిమధ్యలో పంట కాలువల నిర్వాహణను అధికారులు వదిలివేయడం, రియల్ వ్యాపారులు కాలువలు పూడ్చి వేయడంతో ఎగువ ప్రాంతాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



నష్టపరిహారం ఇవ్వాలి, భోగినేని కోటేశ్వరరావు రైతు

రెండేళ్లుగా పొలాల్లో నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నాం. దమ్ము చేయడానికి లేదు. నాట్లు వేయడానికి వీలులేదు. పొలాల్లో నీరు బయటకు పోయే మార్గం చూపడంలో అధికారులు విఫలమయ్యారు. కాలువల మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలి, లేదా సమస్యను ఎదుర్కొంటున్న 60 మంది రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి.

నీరుపోయే దారి చూపాలి, కాళీ, రైతు

ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. పొలాల్లో నీళ్లు బయటకు పోయే దారి చూపిస్తే రైతులు పంటలు వేసుకునే అవకాశం ఉంటుంది. లేదంటే ఈ సీజన్‌లోనూ పంటలు వేసే పరిస్థితి కనిపించదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.





విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విద్యార్థుల బంగారు భవితకు ప్రభుత్వ తపన

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ తపనంతా మీ బంగారు భవిష్యత్తు కోసమేనని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పన చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ సూచించారు. కొండపల్లి జడ్పీ ఉన్నత (బాలికల) పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు - తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం (మెగా పీటీఎమ్ 2.0)లో ఆయన స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. చిన్నారులకు మంచి భవిష్యత్తును అందించే సంకల్పంతో మంత్రి నారా లోకేశ్ ఒక వినూత్న కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులందర్నీ ఒకచోట చేర్చి విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పీటీఎమ్ 2.0ను నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో 1,453 పాఠశాలల్లో 3 లక్షల మంది విద్యార్థులు ఉత్సాహంగా పీటీఎమ్‌లో పాల్గొన్నారన్నారు. ఈసారి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోను పీటీఎమ్ నిర్వహించామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కనిపించే ప్రోగ్రెస్ కార్డులు ఈసారి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోను హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల రూపంలో అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థినులు తల్లికి వందనం నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కోలాటాన్ని ప్రారంభించి కాసేపు కోలాటం ఆడారు. విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన తరువాత పాఠశాల ఆవరణలో మొక్క నాటారు.

హరిత శోభకు గ్రీన్ పాస్‌పోర్టు

చిన్నప్పటి నుంచే పర్యావరణం పట్ల అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం గ్రీన్ పాస్‌పోర్టు అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. విద్యార్థి నాటిన మొక్క ఆరోగ్య పరిస్థితిని బట్టి విద్యార్థికి పాయింట్స్ ఇవ్వడమే గ్రీన్ పాస్‌పోర్టు అని అన్నారు. ఇప్పటికే 61వేల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.

థింక్ బిఫోర్ యూ క్లిక్

సైబర్ దాడులకు గురవకుండా విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మత్తు అనర్థాలను ఈగల్ బృందం వివరించింది. డ్రగ్స్ వద్దు బ్రో అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఈవో యూవీ సుబ్బారావు, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ బీ రమ్య కీర్తన, విద్యా కమిటీ చైర్మన్ షేక్ బాజీబీ, హెచ్.ఎం హేమలత, ఈగెల్ సెల్ ఎస్సై ఎం వీరాంజనేయులు పాల్గొన్నారు.

గురుస్థానం పవిత్రతను తెలియజేద్దాం

విజయవాడ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో గురుస్థానం దేవుడి కంటే గొప్పదని భావించే అత్యుత్తమ సమాజంలో 'గురు బ్రహ్మ, గురుర్విష్ణుః, గురు దేవో మహేశ్వరః' అనే శ్లోకం ద్వారా గురుస్థానంలోని ప్రతి ఒక్కరితో గౌరవభావంతో వ్యవహరించడం మనలాగే మన పిల్లలకు సైతం ఈ సంస్కృతి నేర్పించాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు వెలివెల సత్యనారాయణ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా గురుదేవులకు ఆత్మీయ సత్కారం అందించేందుకు ఏపీ సృజనాత్మక సంస్థ సమితి, శ్రీదేవి నాట్యమండలి కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా షిర్డీ సాయిబాబా గురు సచ్చరిత్ర పద్య నాటకాన్ని నిర్మాత, సంగీత దర్శకుడు చింతలపూడి నాగేశ్వరరావు నేతృత్వంలో శ్రీదేవి నాట్యమండలి కళాకారులు ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. అనంతరం దర్శకుడు నిమ్మగడ్డ ఏసుపాదం, పద్యనాటక రచయిత ఉప్పులూరి లక్ష్మీనారాయణతో పాటు రంగస్థల నటులు డాక్టర్ పీవీఎస్ కృష్ణ, డాక్టర్ జే జగన్ మోహన్‌రావు, డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు, డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, పుప్పాల వీరాంజనేయులు, కే గణేష్‌కుమార్, ఉప్పాల రాజేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు జే శ్రావణ్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, తెలుగు రాష్ట్రాలకు చెందిన రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

గురు సత్కార మహోత్సవం

గురు పౌర్ణమిని పురస్కరించుకొని సత్యనారాయణపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో గురువారం గురు సత్కార మహోత్సవం ఘనంగా జరిగింది. హంసధ్వని కూచిపూడి నృత్యాలయ విద్యార్థి, విద్యార్థినులు నిర్వహించారు. నాట్యాచార్యుడు అజయ్‌కుమార్ శిష్యబృందం చక్కటి నృత్య విన్యాసాలతో ప్రేక్షకులను మెప్పించారు. స్వాగతం, గణేశ స్తుతి, చేరి యశోదకు శిశువితడు, చందనచర్చిత, అలరులు కురియగా, ఆనంద తాండవం, కట్టెదుర వైకుంఠము, తిరువీధుల మెరసి దేవదేవుడు వంటి అంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపల్ కందుల లక్ష్మీ నరసమ్మ, నాట్యాచార్యుడు పద్మశ్రీ హేమంత్, ఉషా మాధవి, భాగవతుల శైలజ, నాట్యాచార్యుడు అజయ్‌కుమార్ శిష్య - ప్రశిష్యులు పాల్గొన్నారు. నాట్యాచార్య కె.వాసుదేవరావు వ్యాఖ్యానం అందించగా, నిర్వహణలో నిహారిక, సుష్మ, దివ్య, విఘ్నేష్, తానియా, ప్రణతి సహా హంసధ్వని నృత్యాలయ శిష్య ప్రశిష్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





పద్య నాటక రచయిత ఉప్పులూరి లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న పీవీఎస్ కృష్ణ, జగన్ మోహన్‌రావు తదితరులు, నాట్యాచార్య అజయ్‌కుమార్‌కు గురు సత్కారం నిర్వహిస్తున్న శిష్య ప్రశిష్యులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

» కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్
» విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు
» ప్రభావవంతంగా ఫ్రై డే - డ్రై డే
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకొంటున్నామని, ఇప్పటికే వివిధ శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని, 9154970454 నెంబరుతో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం, యాంటీ లార్వా ఆపరేషన్స్, ఫాగింగ్, ఓవర్‌హెడ్ ట్యాంకుల క్లీనింగ్ అండ్ క్లోరినేషన్, ఆసుపత్రుల్లో వైద్య సేవలు, ఇంటింటి ఫీవర్ సర్వే తదితరాలపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని, ముందు జాగ్రత్త చర్యలకు మార్గనిర్దేశం చేసినట్టు వివరించారు. సీజనల్ వ్యాధులు, విషజ్వరాల నివారణ, నియంత్రణపై వివిధ శాఖల అధికారుల మధ్య పటిష్ఠ సమన్వయం, సమాచార మార్పిడి, తక్షణ స్పందనకు వీలుగా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు చేరిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి ప్రత్యేక బృందాలకు అందించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. ప్రజలతో పాటు అధికారులు, సిబ్బంది ఎవరైనా సీజనల్ వ్యాధులకు సంబంధించిన సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయవచ్చని, సరైన సమాచారాన్ని అందించి వ్యాధుల కట్టడిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 11వ తేదీ శుక్రవారం ఫ్రై డే - డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్ని నియోజకవర్గాల ప్రత్యేక అధికారులకు సూచించినట్టు కలెక్టర్ తెలిపారు.

112 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: ట్రాన్స్‌జెండర్ (హిజ్రా)లకు సమాన అవకాశాలు కల్పించే దిశగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికార మంత్రిత్వ శాఖ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్-2020 చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ట్రాన్స్‌జెండర్లను గుర్తించి వారి అభ్యున్నతికి దోహదపడటానికి ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం వారికి ప్రత్యేక ఐడెంటిటీ కార్డులను జారీ చేస్తోంది. సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురైన వీరికి విద్యా, వైద్య, ఉద్యోగ అవకాలు కల్పించి అభివృద్ధి దిశగా నడిపించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. ఈ చట్టం ట్రాన్స్ పట్ల వివక్షత, హింసను వ్యతిరేకిస్తుంది.

జిల్లాలో దాదాపు 10వేల మంది..

జిల్లాలో దాదాపు 10వేల మందికి పైగా ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారనేది అధికారుల ప్రాథమిక అంచనా. సమాజ స్థితిగతులను అంచనా వేయగలిగిన కొందరు ఓటు హక్కు కల్పించాలని కోరుతూ 2024 ఎన్నికల ముందు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వీరికున్న హక్కులను మాత్రం తెలుసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నూతన చట్టం ప్రకారం వీరంతా గుర్తింపు కార్డులు పొందవచ్చు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చొరవతో 112 మంది మాత్రమే కార్డులు పొందగలిగారు. తద్వారా ఉచిత ఇల్లు, విద్య, ఉద్యోగం, వైద్యంతో సమాన అవకాశాలు పొందడంతో పాటు విమర్శలు, సవాళ్లను దీటుగా ఎదుర్కొనే అవకాశం ఉంది.



మూఢం ఎందుకు వస్తుంది?

హిందువులు ఏ పనులు ప్రారంభించినా ముహూర్తాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. సాధారణంగా ముహూర్తాలు గ్రహాల బలం మీద ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా శుభకార్యాలను తలపెట్టాలన్నా... గురు, శుక్ర గ్రహాల బలాల ఆధారంగా పండితులు ముహూర్తాలు నిర్ణయిస్తారు. ఈ రెండు గ్రహాలు తమ భ్రమణంలో బలహీనంగా మారినప్పుడు బలమైన ముహూర్తాలు ఉండవు. శుభకార్యాలు నిర్వహించడానికి బలమైన ముహూర్తాలు లేని రోజులను 'మూఢం' (మౌఢ్యమి) అంటారు. మరికాస్త వివరంగా చెప్పాలంటే... నవగ్రహాలలో అత్యంత శక్తిమంతమైన, స్వయం ప్రకాశకత్వం కలిగిన గ్రహం సూర్యుడు. అందుకే సూర్యగ్రహాన్ని గ్రహాలన్నిటికీ రాజు అంటారు. సూర్యుడికి అత్యంత సమీపంలోకి ఏ గ్రహమైనా వస్తే... ఆ గ్రహం తన శక్తిని కోల్పోతుంది. గ్రహాల భ్రమణంలో గురుగ్రహం సూర్యునికి దగ్గరకు వస్తే 'గురు మూఢం' అని, శుక్ర గ్రహం దగ్గరికి వస్తే 'శుక్ర మూఢం' అని వ్యవహరిస్తారు. ఈ సమయంలో గురు, శుక్ర గ్రహాలు తమ బలాన్ని కోల్పోతాయి. ఈ ఏడాది జూన్ 10 నుంచి జూలై ఎనిమిది వరకూ సూర్యుడికి దగ్గరగా గురు గ్రహం ఉండడంతో ఆ కాలాన్ని 'గురుమూఢం'గా పరిగణించడం జరిగింది. ఈ ఏడాది నవంబర్ 30 నుంచి వచ్చేఏడాది ఫిబ్రవరి 13వ తేదీ వరకు సూర్యుడికి శుక్రుడు దగ్గరగా ఉంటాడు. ఆ కాలాన్ని 'శుక్రమూఢం' అంటారు.

> గ్రహాల భ్రమణంలో గురుగ్రహం సూర్యునికి దగ్గరకు వస్తే 'గురు మూఢం' అని, శుక్రగ్రహం దగ్గరికి వస్తే 'శుక్ర మూఢం' అని వ్యవహరిస్తారు. ఈ సమయంలో గురు, శుక్ర గ్రహాలు తమ బలాన్ని కోల్పోతాయి.

చేయకూడనివి, చేయదగ్గవి...


ఈ రెండు సమయాల్లో వివాహాది శుభకార్యాలు, వాటికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టడం, పిల్లలకు పుట్టువెంట్రుకలు తీయించడం, చెవులు కుట్టించడం, కొత్త వ్యాపారాలు ప్రారంభించడం, కొత్త వాహనాల కొనుగోలు, శంకుస్థాపనలు, వ్రతాలు, విగ్రహ ప్రతిష్ఠలు, చెరువులు తవ్వడం లాంటి పనులు చేయకూడదని, దానివల్ల దుష్ఫలితాలు ఎదురవుతాయని పూర్వులు చెప్పారు. కాగా చిన్న పిల్లలకు అన్నప్రాశన, దూరప్రయాణాలు, ఇళ్ళకు చిన్న మరమ్మతులు, భూముల క్రయవిక్రయాలు, అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు, విదేశీ యానాలు, కొత్త ఉద్యోగాల్లో చేరడం, నూతన వస్త్రాల కొనుగోలు, పుణ్యక్షేత్ర సందర్శన, దేవాలయాల్లో అన్నదానాలు, గృహాల్లో సీమంతాలు, ఇతర దైవ, పితృకార్యాలు, నవగ్రహ శాంతులు, హోమాలు తదితరాలు చేయవచ్చునని సూచించారు.

తెలుసుకుందాం



• సి.ఎన్.మూర్తి,
8328143489

విశేషం



అందుబాటులో రాజ్యాధికారం, చతురంగబలాలు అపారమైన సంపద, గుణ రూపలావణ్యవతులైన భార్యలు, ఎంతో ప్రేమగా చూసుకొనే తల్లిదండ్రులు... వీటన్నిటినీ విడిచిపెట్టి, యవ్వనంలోనే సన్న్యాస దీక్ష తీసుకొని, అపూర్వమైన గ్రంథ నిధిని మధ్వ సిద్ధాంత వాఙ్మయానికి అందించిన వారు శ్రీజయతీర్థులు. 'మధ్వాఖ్యరాజు'గా ప్రసిద్ధి పొందిన ఆయన మధ్వ సంప్రదాయంలో ఎందరో మహనీయులకు మార్గదర్శిగా నిలిచారు.

జ్ఞానసేతువు

సాధినాడు సంస్థానానికి చెందిన యువరాజు సాధి దొండు రఘునాథరాయలు. ఒకసారి అతను వేటకు వెళ్ళాడు. తిరిగి తిరిగి అలసిపోయిన అతను భరించలేని దాహార్తితో... భీమా నదిని చేరుకున్నాడు. కిందికి దిగకుండా... గుర్రం మీద నుంచి వంగి, నదిలోని నీటిని నేరుగా నోటితో తాగుతున్నాడు. మధ్వాచార్యుల శిష్యులైన అక్షోభతీర్థులు నదికి అవతలివైపు నుంచి దీన్ని గమనించారు. "కిం పశుః పూర్వ దేహే?" (నువ్వు గత జన్మలో పశువువా?) అని ప్రశ్నించారు. ఆ నాలుగు పదాల ప్రశ్నతో... తను గత జన్మలో ఒక ఎద్దుగా జన్మించి, శ్రీమధ్వాచార్యుల గ్రంథాలను మోసి, ఆయన తన శిష్యులకు శాస్త్రజ్ఞానం బోధిస్తూ ఉండగా విన్న అనుభవాలు రఘునాథరాయలుకు తక్షణమే జ్ఞాపకం వచ్చాయి. అక్షోభతీర్థుల వద్దకు పరుగుపరుగున వచ్చాడు. తన తలను ఆయన పాదాలకు భక్తితో తాకించి "నన్ను తమరి శిష్యులుగా స్వీకరించాలని, శ్రీమధ్వశాస్త్రాన్ని ఉపదేశించి నన్ను పునీతుణ్ణి చేయాలని ప్రార్థిస్తున్నాను" అని ఆర్తితో వేడుకున్నాడు. అక్షోభతీర్థులు అతణ్ణి సంతోషంగా పైకి లేపి "నీకు శ్రీమధ్వశాస్త్రాన్ని బోధించడం కాదు... నిన్ను శ్రీమధ్వాచార్యుల వేదాంత సామ్రాజ్యానికి అధిపతిగా పట్టాభిషిక్తుణ్ణి చేస్తాను. సన్న్యాసి కావడానికి సిద్ధపడు" అని చెప్పారు.

అప్పుడు రఘునాథరాయలు "నాకు శాస్త్రజ్ఞానం ఉంటే చాలు. అంతటి ఉన్నత స్థానానికి అర్హుణ్ణి కాదు" అన్నాడు. "ఇది దైవసంకల్పం. దీన్ని నీవు స్వీకరించాలి" అన్నారు అక్షోభతీర్థులు.

గురు ఆదేశంలో గ్రంథ రచన

ఆ రాత్రి రఘునాథరాయలు కలలో శ్రీవాయుదేవులు కనిపించి "నీవు సన్న్యాసం స్వీకరించు. శ్రీరాముణ్ణి పూజించు. విద్వదగ్రగణ్యుడివి అవుతావు, సర్వజ్ఞానులకు ఆశ్రయం అవుతావు" అని ఆశీర్వదించారు. ఆ మరుసటిరోజే రఘునాథరాయలు సన్న్యాసదీక్ష స్వీకరించి, 'జయతీర్థులు'గా వినుతికెక్కారు. "భాష్యం లేనిదే సూత్రాలు అర్థం కావు. టీకా లేనిదే భాష్యార్థం తెలుసుకోలేరు. అటువంటి టీకాలను రచించే బాధ్యత భగవంతుడు నీపైన ఉంచాడు" అంటూ తన శిష్యుణ్ణి గ్రంథరచన చేయాల్సిందిగా అక్షోభతీర్థులు ఆదేశించారు. ఆ మాటలు వినగానే "నా భాష్యాలకు వ్యాఖ్యానం రాసేది ఈ ఎద్దే" అని శ్రీమధ్వాచార్యులు (జయతీర్థుల పూర్వజన్మలో) అన్న మాటలు శ్రీజయతీర్థుల చెవిలో మారుమోగాయి. జీవితంలో... మొదటి ఇరవై ఏళ్ళపాటు వ్యాకరణ శబ్దాల జోలికే పోని వ్యక్తి... సన్న్యాసదీక్ష తీసుకున్న తరువాత ఇరవై ఏళ్ళలోనే మధ్వ సిద్ధాంతానికి టీకా, వ్యాఖ్యానాలు రాసి... విద్వాంసులందరినీ మెప్పించడం అనేది ఊహాతీతం. 'న్యాయసుధ' (శ్రీమధ్వాచార్యుల అణువ్యాఖ్యానానికి టీకా), 'తత్త్వ ప్రకాశిక' (సూత్రభాష్యానికి టీకా), 'న్యాయవివరణ' టీకా, 'సంబంధ దీపిక' ('ఋగ్భాష్యా'నికి టీకా), 'ప్రమేయ దీపిక' (గీతాభాష్యానికి టీకా)... ఇలా అనేక అసాధారణమైన గ్రంథాలను ఆయన రచించారు. వేద, ఉపనిషత్, పురాణ వాక్యాలు ఎన్నిటినో తన రచనలలో ఆయన అడుగడుగునా పొందుపరిచారు. తనపై ఉన్నది మహత్తరమైన బాధ్యత అనీ, దాన్ని తన బుద్ధిద్వారానో, పాండిత్య ప్రతిభతోనో నిర్వర్తించలేనని, భగవంతుడు, వేదవ్యాసుడు, శ్రీవాయుదేవుడు, సరస్వతీదేవి, దుర్గాదేవిల అనుగ్రహం వల్లనే అది సాధ్యమని శ్రీజయతీర్థులకు తెలుసు. అందుకే దుర్గా బెట్ట అనే ప్రదేశాన్ని తన తపోభూమిగా ఎంచుకున్నారు. కొన్నాళ్ళు పచ్చగడ్డి, ఆకులు, ఆ తరువాత ఎండుగడ్డి, రాలిన ఆకులను మితంగా స్వీకరిస్తూ తపస్సు చేశారు. ఆయన తపస్సు ఫలించి సరస్వతీదేవి, దుర్గాదేవి ప్రత్యక్షమయ్యారు. గ్రంథ రచనకు కావాల్సిన జ్ఞానాన్ని, సాధన సంపత్తిని అనుగ్రహించారు. ఆయన తపోనిరతులై ఉన్నప్పుడు ఆదిశేషుడు వచ్చి... తన పడగను ఆయన నాలుకపై ఆడించాడు. ఇది కూడా ఆయన విశేష జ్ఞానసిద్ధికి కారణమయింది.

టీకారాయలు

వైష్ణవ వేదాంత సంప్రదాయంలో శ్రీమధ్వాచార్యుల తరువాత... తన అసాధారణ వాఙ్మయ తపస్సుతో మాన్యుడైన శ్రీజయతీర్థులదే అగ్రస్థానం. 'టీకారాయలు'గా ఆయన ప్రసిద్ధి చెందారు. "వ్యాససూత్రాలు అనే మందర పర్వతాన్ని... శ్రీమధ్వుల భాష్యాలనే తాడుతో చుట్టి... ఆ వేదరాశిని చిలకడం ద్వారా ఉద్భవించినదే శ్రీజయతీర్థుల న్యాయసుధ" అని శ్రీవ్యాసరాయలు ప్రశంసించారు. శ్రీవ్యాసరాయలు, శ్రీవాదిరాజులు, శ్రీరఘోత్తములు, శ్రీరాఘవేంద్రస్వామి... ఇలా అనేకమంది మహనీయులు ఆయన గ్రంథాల్లోని ఆశయాలను వ్యక్తీకరించడమే తమ జీవన సిద్ధిగా భావించి రచనలు చేశారు. ఒక విధంగా చెప్పాలంటే భాష్యకారుల సంప్రదాయానికి ఆయన జ్ఞానసేతువు అయ్యారు. తత్త్వజ్ఞాన దుందుభిని మోగించి... 'మధ్వాఖ్యరాజు'అని కీర్తి పొందారు. మలఖేడ్ రాజ్యం ఇప్పుడు లేదు. కానీ ఆ ప్రదేశం ఇప్పుడు పుణ్యక్షేత్రం అయింది. శ్రీజయతీర్థులు స్థిరపరచిన మధ్వ సిద్ధాంతం అక్కడ శోభాయమానంగా వెలుగొందుతోంది.

(ఈనెల 14 నుంచి 16 వరకు శ్రీజయతీర్థుల ఆరాధన మహోత్సవాలు)

• శ్రీమధ్వ ప్రచార పరిషత్

సద్బోధ

మాటలులేని ప్రశ్న

టిబెట్‌కు చెందిన బౌద్ధ గురువుల్లో ప్రసిద్ధి చెందినవాడు మార్పా. ఒకసారి ఒక వ్యక్తి అతని దగ్గరకు వచ్చి... "మీరు చాలా గొప్ప జ్ఞాని అని విన్నాను. మీరు జ్ఞాని అనే విషయాన్ని మాటలు ఉపయోగించకుండా నాకు తెలియజేస్తే సంతోషిస్తాను" అన్నాడు. అప్పుడు మార్పా నవ్వి "సరే! ముందు మాటలు ఉపయోగించకుండా మీరు ప్రశ్నించండి. తరువాత మాటలు వాడకుండా మీరు కోరినదాన్ని తెలియజేస్తాను" అన్నాడు. "అదెలా సాధ్యం?" అని అడిగాడు ఆ వ్యక్తి. "అది నా సమస్య కాదు, మీ సమస్య. మీరే బాగా ఆలోచించి, దానికి పరిష్కారాన్ని కనుక్కొని రండి" అన్నాడు మార్పా.

'మాటలు ఉపయోగించకుండా ప్రశ్నించడం ఎలా?' అని ఆ వ్యక్తి తీవ్రంగా ఆలోచిస్తూ ఇంటికి బయలుదేరాడు. ఏళ్ళ తరబడి అలా ఆలోచిస్తూనే ఉన్నాడు. అలా ఆలోచించి, ఆలోచించి చివరకు అదే అతని మనస్సులో నిలిచిపోయింది. ఒక రోజు తెలియని ఆనందమేదో అతని హృదయంలో పెల్లుబికింది. తను మార్పాను ప్రశ్నించినట్టు, తనకు సమాధానం లభించినట్టు అనిపించింది. సరిగ్గా అదే సమయంలో మార్పా వచ్చి ఆ ఇంటి తలుపు తట్టాడు. ఆ వ్యక్తి తలుపు తీశాడు. అతని ఎదురుగా నవ్వుతూ నిలబడిన మార్పా... "మాటలు వాడకుండా మీరు ప్రశ్నించారు. నేనూ మీకు అదే విధంగా బదులు ఇచ్చాను" అన్నాడు.

> సద్గురువులు, జ్ఞానులు, అవతార పురుషులు... భాషాతీతమైన, భావాతీతమైన శక్తిని (శక్తిపాతం ద్వారా) ప్రసరింపజేసి, ఎదుటివారిలో జ్ఞానాన్ని ప్రజ్వలింపజేస్తారు. వారిని దివ్యమూర్తులుగా తీర్చిదిద్దుతారు. కళాశాల విద్యార్థి అయిన నరేంద్రుణ్ణి కేవలం ఒక స్పర్శతో.... ప్రపంచ ప్రఖ్యాతుడైన వివేకానందస్వామిగా శ్రీరామకృష్ణ పరమహంస ప్రకాశింపజేశారు.



ఇద్దరూ నవ్వుకుంటూ బయటకు నడిచారు. ఆ రోజు నుంచి ఆ వ్యక్తి ఏదీ మాట్లాడకుండా... కేవలం నవ్వుతూ మార్పా వెంట అతని నీడలా ఊరూరా తిరిగేవాడు. అతణ్ణి చూసినవారు మార్పాతో "గురువుగారూ! అతను మాట్లాడకుండా ఎప్పుడూ నవ్వుతూ ఎందుకు ఉంటాడు? మీరు అతణ్ణి ఏం చేశారు?" అని అడిగాడు. "అతను ఒక విషయం గురించి ఏమీ మాట్లాడకుండా ప్రశ్నించాడు. నేనూ ఏమీ మాట్లాడకుండానే అతనికి సమాధానం ఇచ్చాను. అంతే!" అన్నాడు మార్పా. జ్ఞానం పొందడానికి మాటలు అక్కరలేదు. మౌనమే జ్ఞానం.

పండితులు తమ పాండిత్యాన్ని ప్రదర్శించి ప్రజల నుంచి సన్మానాలను, ప్రశంసలను పొందుతారు. సద్గురువులు, జ్ఞానులు, అవతార పురుషులు... భాషాతీతమైన, భావాతీతమైన శక్తిని (శక్తిపాతం ద్వారా) ప్రసరింపజేసి, ఎదుటివారిలో జ్ఞానాన్ని ప్రజ్వలింపజేస్తారు. వారిని దివ్యమూర్తులుగా తీర్చిదిద్దుతారు. కళాశాల విద్యార్థి అయిన నరేంద్రుణ్ణి కేవలం ఒక స్పర్శతో.... ప్రపంచ ప్రఖ్యాతుడైన వివేకానందస్వామిగా శ్రీరామకృష్ణ పరమహంస ప్రకాశింపజేశారు. బడికి వెళ్ళే ఒక బాలుణ్ణి... ఒక ముద్దుతో మెహర్‌బాబాగా, లక్షలాదిమందికి ఆరాధ్యదైవంగా బాబాజాన్ నిలబెట్టింది. మార్పా చేసింది కూడా అలాంటిదే. అందుకే ఆ వ్యక్తిలో నిరంతరం ఆనందం తొణికిసలాడింది. ఆ ఆనందంతో అతని జీవితం నిండిపోయింది.

• రాచమడుగు శ్రీనివాసులు


ప్రభువు పాదాలపై శతాధిపతి

ఏసు ప్రభువు ఒక ఊరిలో ప్రజలకు బోధ చేస్తున్నాడు. ఆయనను కనులారా చూసేందుకు జన సందోహం ఆ ప్రదేశానికి పెద్ద సంఖ్యలో చేరుకుంది. ఆయన చెబుతున్న మాటలను అందరూ ఆసక్తిగా వింటున్నారు. కాసేపటికి ఒక శతాధిపతి అక్కడికి వచ్చాడు. రోమన్ సామ్రాజ్యంలో సైనికాధికారులకు అపరిమితమైన అధికారాలు ఉండేవి. ఆ సామ్రాజ్యానికి, దాని అధినేతకు రక్షణ అందించే బాధ్యతలను ఆ శతాధిపతి నిర్వహిస్తున్నాడు. 'ఇతను ఇక్కడికెందుకు వచ్చాడు?' అని జనం గుసగుసలాడుకుంటున్నారు, భయపడుతున్నారు కూడా. కానీ ఆ శతాధిపతి నేరుగా ఏసు క్రీస్తు కాళ్ళముందు శిరసు వంచి మోకరిల్లడంతో వారు విస్మయం చెందారు. 'ఇతను అహాన్ని విడిచి ఇలా చేస్తున్నాడంటే... ఈ వినయ విధేయతల వెనుక ఏదో కారణం ఉండే ఉంటుంది. క్రీస్తుతో ఏ పని ఉండి వచ్చాడో?' అనుకున్నారు.

ఇంతలో ఆ శతాధిపతి "ప్రభూ! నా కుమారుడు చావు బతుకుల్లో ఉన్నాడు. అతణ్ణి బతికించు. నీ దర్శన భాగ్యానికి నా ఇల్లు నోచుకోలేదేమో. నీవు అక్కడికి రానక్కరలేదు. ఒక మాట పలికితే చాలు... నా కుమారుడు స్వస్థత పొందుతాడు" అని వేడుకున్నాడు.

అప్పుడు ఏసు "నీ విశ్వాసమే నిన్ను కాపాడుగాక. నీ కుమారుడు బతికే ఉన్నాడు, వెళ్ళు" అన్నాడు.

దైవమార్గం



> శతాధిపతి అన్న ఆ మాట చిన్నది కాదు. చాలా ముఖ్యమైన మాట. విశ్వాసానికి పరాకాష్ట అయిన మాట. అందుకే రోమన్ క్యాథలిక్‌లు తమ దైనందిన ఆరాధనలో ఈ వాక్యాన్ని కూడా పఠిస్తారు.

ఆ రోమన్ సైన్య శతాధిపతి కళ్ళు చెమర్చాయి. అంతకుపూర్వమే క్రీస్తు చేస్తున్న అద్భుతాలను అతను విన్నాడు. ఆయన కృపతో తన కుమారుడికి నయం కాగలదనే నమ్మకంతో క్రీస్తు దగ్గరకు వచ్చాడు. క్రీస్తు మాటలు వినగానే... ప్రభువు తనను అనుగ్రహించాడని, ఆయన వాక్కు వ్యర్థం కాదని నమ్మి, వెనుతిరిగాడు.

అతను ఊహించినదే జరిగింది. ప్రభువు వాక్కు ఫలించింది. అతని ఇంటి నుంచి బయలుదేరిన సైనికులు మార్గమధ్యంలోనే అతణ్ణి కలిశారు. "మీ అబ్బాయి స్వస్థత పొందాడు. లేచి కూర్చున్నాడు" అంటూ శుభవార్త అందించారు. కోరుకున్న ఫలితం దక్కడంతో అతను సంతృప్తిగా వెనుతిరిగాడు.

విశ్వాసంతో ప్రార్థిస్తే దైవానుగ్రహం తప్పక లభిస్తుందనీ, దానికి తరతమ భేదాలు ఉండవనీ స్పష్టం చేసే ఉదాహరణగా ఈ కథను పేర్కొంటారు. 'నీవు పలికితే చాలు, నా కుమారుడు బతికిపోతాడు' అనే మాట చిన్నది కాదు. చాలా ముఖ్యమైన మాట. విశ్వాసానికి పరాకాష్ట అయిన మాట. అందుకే రోమన్ క్యాథలిక్‌లు తమ దైనందిన ఆరాధనలో ఈ వాక్యాన్ని కూడా పఠిస్తారు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

రాజుకన్నా గొప్పవారు

"ధార్మిక విశ్వాసం కలిగిన విద్వాంసులను అనుసరించండి. ఎందుకంటే వారు ఇహ-పరలోకాలకు కాంతి లాంటివారు. భూమిపైన, సముద్రాల్లో పయనిస్తున్న వ్యక్తులు నక్షత్రాల ద్వారా మార్గాన్ని తెలుసుకుంటారు. ఒకవేళ నక్షత్రాలు మాయమైపోతే... వాటిని అనుసరించేవారు మార్గం తెలియక తప్పిపోతారు. ఆకాశంలో ఉన్న ఆ నక్షత్రాల్లాంటివారే భూమిపై ఉన్న విద్వాంసులు, పండితులు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ చెప్పారు.

జ్ఞానులకు, పండితులకు పూర్వం ప్రజల్లో ఎంత విలువ ఉండేదో వివరించే ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ఖలీఫా అయిన హారూన్ రషీద్ తన సైన్యంతో వచ్చి ఒక నగరంలో బస చేశాడు. అదే సమయంలో విద్వాంసుడైన హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ముబారక్ అక్కడకు వస్తున్నారనే వార్త నగరమంతా వ్యాపించింది. ప్రజలు సంతోషించారు. నగర శివార్లలోనే బిన్ ముబారక్‌కు సాదరంగా స్వాగతం పలకడానికి తండోపతండాలుగా బయలుదేరారు. ఆయనను ప్రత్యక్షంగా చూడాలనే కోరిక వారిని అక్కడకు చేర్చింది. ఖలీఫాకు బానిసగా ఉన్న ఒక మహిళ దీన్ని గమనించింది. "ఏం జరుగుతోంది?" అని ఇక్కడ ఉన్నవారిని అడిగింది. "బిన్ ముబారక్‌గారు వస్తున్నారు. ఆయనను స్వాగతించడానికి జనం పోటీ పడుతున్నారు" అని వారు చెప్పారు. అప్పుడు ఆ బానిస స్త్రీ "ఖలీఫా హారూన్ రషీద్ కోసమైతే ప్రజలను బలవంతంగా రప్పించవలసి వచ్చేది. ఇక్కడ ఎలాంటి బలవంతమూ లేదు. కేవలం చిన్న వార్తతోనే నగరమంతా బిన్ ముబారక్ కోసం కదిలి వచ్చింది. దైవసాక్షిగా... అసలైన రాజు అంటే ఆయనే" అంది.

ఇలాంటి మరో సంఘటన... ఖాజా హసన్ బస్రీ గొప్ప జ్ఞానిగా ప్రాచుర్యం పొందాడు. ఆయన అంటే ప్రజలు ఎంతో ప్రేమాభిమానాలు చూపించేవారు. ఆ రోజుల్లో బస్రాకు గవర్నర్‌గా క్రూరుడు, కఠినాత్ముడు అయిన హజ్జాజ్ బిన్ యూసఫ్ ఉండేవాడు. పుర ప్రముఖుడు, పండితుడు అయిన ఖాలిద్ బిన్ సఫ్వాన్‌తో ఒక రోజు యూసఫ్ మాట్లాడుతూ "బస్రా నగరానికి సర్దార్ ఎవరు?" అని అడిగాడు. తన పేరును ఖాలిద్ చెబుతాడని అతను ఆశించాడు. కానీ దానికి భిన్నంగా "హసన్ బస్రీ" అని ఖాలిద్ సమాధానం ఇచ్చాడు. యూసఫ్ ఆశ్చర్యపోతూ "అదెలా సాధ్యం? హసన్ బానిస వంశానికి చెందినవాడు కదా?" అన్నాడు.

"హసన్ ప్రజల నాయకుడు. ధర్మం విషయంలో ప్రజలకు ఆయన అవసరం ఉంది కానీ... ప్రాపంచిక విషయాల్లో ఆయనకు ఎవరి అవసరమూ లేదు. సామాన్యులు కావచ్చు, ధనవంతులు కావచ్చు... హసన్ ప్రసంగాలు వినడానికి, తద్వారా జ్ఞానం పొందడానికి అందరూ తహతహలాడుతారు. ఆయనతో సన్నిహితంగా ఉండాలనుకుంటారు" అని చెప్పాడు ఖాలిద్. అసలైన నాయకుడంటే ఎవరో, ప్రజలు ఎటువంటివారిని గౌరవిస్తారో బిన్ యూసఫ్‌కు అర్థమయింది. అందుకే 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే" అన్నారు పెద్దలు.

• మహమ్మద్ వహీదుద్దీన్

సందేశం



గీతాసారం

ధ్యానం... పరమానందం కోసం

మన మెదడులోని కేంద్ర స్థానంలో... సరిగ్గా రెండు కనుబొమల మధ్య పీనియల్ గ్రంథి ఉంటుంది. శంకువు ఆకారంలో, బఠానీ గింజ పరిమాణంలో ఉండే ఈ గ్రంథి...

మన శరీరంలో మెలటోనిన్, సెరటోనిన్ అనే నాడీ ప్రసారకాలను (న్యూరోట్రాన్స్మిటర్స్) ఉత్పత్తి చేసి.. మన నిద్రకు, భావోద్వేగాలకు కారణం అవుతుంది. దీనిలో మామూలు కంటిలో ఉన్నట్టే కాంతి గ్రాహకాలు (ఫొటో రిసెప్టర్స్) ఉంటాయి కనుక దీన్ని 'మూడో కన్ను' అని కూడా అంటారు. ఆత్మకు పీఠంగా, ఆధ్యాత్మిక సాక్షాత్కార కారకంగా, పంచేంద్రియాలకు అందని భావనను అందుకోగలిగే ఆరో ఇంద్రియంగా, ఆధ్యాత్మిక సంకేతంగా, భౌతిక-ఆధ్యాత్మిక జగతి మధ్య సంధానంగా... ఇలా అనేక విధాలుగా వివిధ సంస్కృతులు దీన్ని వర్ణించాయి. భారతీయ యోగ పరిభాషలో కనుబొమల మధ్య ఉండే ప్రదేశాన్ని 'ఆజ్ఞాచక్రం' అంటారు. ఇది పీనియల్ గ్రంథి ఉండే స్థానాన్ని సూచిస్తుంది.



ఇంద్రియాలను, మనస్సును అదుపులో పెట్టుకోవడానికి శ్రీకృష్ణుడు సూచించిన విధానాన్ని అర్థం చేసుకోవడానికి పై వివరణ మనకు ఉపకరిస్తుంది. "బాహ్య విషయ భోగాల గురించిన ఆలోచనలను పారద్రోలాలి. దృష్టిని భ్రూమధ్యమునందు (కనుబొమల మధ్యభాగంలో) స్థిరంగా ఉంచాలి. మనలో ప్రసరిస్తున్న ప్రాణాపాన వాయువులను సమస్థితిలో నడిపించాలి. ఈ ప్రక్రియల ప్రభావం వల్ల మనసు, బుద్ధి, ఇంద్రియాలు సాధకుడి వశంలోకి వస్తాయి. మోక్షపరాయణుడైన ముని ఇటువంటి సాధన ద్వారా ఇచ్ఛా భయ క్రోధరహితుడై సదా ముక్తుడవుతాడు" అని శ్రీకృష్ణుడు ఒక ధ్యాన మార్గాన్ని సూచించాడు. తద్వారా అర్జునుడు తన ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని నియంత్రించుకోవడానికి సాయపడే ఒక పద్ధతిని శ్రీకృష్ణ భగవానుడు అందించాడు.

'విజ్ఞాన భైరవ తంత్రం'లో పరమశివుడు చెప్పిన 112 ధ్యాన సూత్రాలు ఉన్నాయి. "ఎటువంటి ఆలోచనలు లేకుండా మీ కనుబొమల మధ్య ఉన్న బిందువుపై దృష్టి కేంద్రీకరించండి. దివ్యమైన శక్తి ప్రజ్వలితమై... మీ తలలోని అగ్రభాగం వరకూ వ్యాపిస్తుంది. అది తక్షణమే మిమ్మల్ని పరమానందంలో ముంచెత్తుతుంది" అని వాటిలోని ఒక సూత్రం చెబుతుంది. దీని ప్రకారం... ఏకాగ్రమైన దృష్టిని కనుబొమల మధ్య ప్రాంతానికి తీసుకువచ్చి... పీనియల్ గ్రంథిని సక్రియం చేయడం సాధన చేయాలి. అప్పుడు క్రియాశీలమైన ఆ గ్రంథి ఎటువంటి ఇంద్రియాల సహాయం లేకుండానే మనలో అంతర్గత పారవశ్యాన్ని నింపుతుంది.



కె.శివప్రసాద్


శ్రీచరణి (2/30)

‘బాగుంది రా మామా..’

లార్డ్స్‌లో నితీశ్ ప్రతిభకు గిల్ ఫిదా

తెలుగులో అభినందన

లార్డ్స్ టెస్టులో తెలుగు పదాలు వీనులవిందు చేశాయి. ‘బాగుంది రా మామా..’అన్న మాటలు ఇప్పుడు సోషల్ మీడియాను ‘షేక్ చేస్తున్నాయి. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి అద్భుత బౌలింగ్‌కు ఫిదా అయిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అతడిని తెలుగులో ప్రశంసించడం అందరినీ ఆకట్టుకుంది. తొలి సెషన్‌లోనే ప్రధాన పేసర్లను సమర్థంగా ఎదుర్కొంటూ క్రీజులో పాతుకుపోయిన ఓపెనర్లు బెన్ డకెట్, జాక్ క్రాలేలను నితీశ్ ఒకే ఓవర్‌లో అవుట్ చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చాడు. దీంతో నితీశ్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఇంగ్లండ్ బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. ఈ క్రమంలో నితీశ్ వేసిన బంతి అద్భుతంగా స్వింగ్ అయినప్పుడు స్లిప్స్‌లో ఉన్న సారథి గిల్.. ‘వాట్ రా రెడ్డి.. బాగుంది రా మామా’ అని తెలుగులో పొగడడం స్టంప్ మైక్‌లో రికార్డయింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అయితే అది గిల్ గొంతు కాదని, బహుశా కరుణ్ నాయర్‌ది అయివుండవచ్చునని అంటున్నారు. నాయర్ తెలుగు బాగా మాట్లాడుతాడని కొందరు చెబుతున్నారు.


నితీశ్ (2/46)

1 భారత్‌పై టెస్టుల్లో 3 వేల పరుగులు సాధించిన ఏకైక బ్యాటర్‌గా జో రూట్.

బజ్‌బాల్‌ను పక్కనబెట్టి..

ఆచితూచి ఆడిన ఇంగ్లండ్

తొలి ఇన్నింగ్స్ 251/4

- రాణించిన పోప్, స్టోక్స్
- నితీశ్‌కు రెండు వికెట్లు
- భారత్‌తో మూడో టెస్టు


99 రన్స్‌తో నిలిచిన జో రూట్

లండన్: బజ్‌బాల్ గేమ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే ఇంగ్లండ్ లార్డ్స్ టెస్టులో మాత్రం నెమ్మదించింది. అటు భారత బౌలర్లు విశేషంగా రాణించినప్పటికీ.. నాలుగు వికెట్లతోనే సరిపెట్టుకున్నారు. ఫలితంగా మూడో టెస్టు తొలి రోజు ఆటలో ఇంగ్లండ్‌దే ఒకింత పైచేయి అయింది. బ్యాటింగ్‌కు కష్టంగా మారిన పిచ్‌పై జో రూట్ (99 బ్యాటింగ్) పట్టుదలగా ఆడాడు. అతడి సెంచరీకి ఒక్క పరుగు దూరంలో ఆట ముగియగా, పోప్ (44), కెప్టెన్ స్టోక్స్ (39 బ్యాటింగ్) సహకరించారు. దీంతో గురువారం ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 251/4 స్కోరుతో నిలిచింది. నితీశ్‌కు రెండు.. బుమ్రా, జడేజాలకు ఒక్కో వికెట్ దక్కింది.

నితీశ్ ‘డబుల్’: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను నిలడగా ఆరంభించింది. కొత్త బంతితో భారత పేసర్లు స్వింగ్‌తో పాటు ఎక్స్‌ట్రా బౌన్స్‌తో ఇబ్బందిపెట్టినప్పటికీ ఓపెనర్లు డకెట్ (23), క్రాలే (18) ఓపిగ్గా ఆడారు. దీంతో తొలి గంటలో వీరు 13 ఓవర్లలో 39 పరుగులు జత చేశారు. అయితే డ్రింక్స్ విరామం తర్వాత కెప్టెన్ గిల్ బంతిని నితీశ్‌కు ఇవ్వడం ఫలితాన్నిచ్చింది. తన తొలి ఓవర్‌లోనే డకెట్‌ను అవుట్ చేశాడు. పుల్ షాట్ ఆడే ప్రయత్నంలో కీపర్ పంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో తొలి వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత బంతికే పోప్ కూడా డకౌట్ అయ్యేవాడే కానీ.. గల్లీలో క్లిష్టమైన క్యాచ్‌ను గిల్ వదిలేశాడు. అయితే అదే ఓవర్ ఆఖరి బంతికి క్రాలే సైతం పంత్‌కు క్యాచ్ ఇవ్వడంతో నాలుగు బంతుల వ్యవధిలోనే రెండు వికెట్లు తీసిన నితీశ్ భారత్‌కు ఊరటనిచ్చాడు. కానీ 44/2 స్కోరుతో ఇబ్బందిపడిన జట్టును రూట్-పోప్ జోడీ ఆదుకుంది. బౌలర్లకు ఎలాంటి చాన్స్ ఇవ్వకుండా వీరు లంచ్ బ్రేక్‌కు వెళ్లారు. ఈ సెషన్‌లో ఇంగ్లండ్ 83 పరుగులు సాధించింది.

శతక భాగస్వామ్యం: రెండో సెషన్‌లో భారత బౌలర్లు ఎంతగా ప్రయత్నించినా వికెట్ సాధించలేకపోయారు. బజ్‌బాల్ గేమ్‌ను పక్కనబెట్టి రూట్-పోప్ జోడీ అసలు సిసలు టెస్టు ఆటను ప్రదర్శించింది. చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేసిన పేసర్ల ధాటికి ఓ దశలో 28 బంతులపాటు ఇంగ్లండ్ ఒక్క పరుగు కూడా సాధించలేదు. అవుట్‌సైడ్‌కు ఆవల వేసే బంతులను తెలివిగా వదిలేస్తూ ఆడారు. అటు నితీశ్ ఓవర్‌లో ఫోర్‌తో రూట్ అర్ధసెంచరీని సైతం పూర్తి చేశాడు. ఓవరాల్‌గా ఈ సెషన్‌లో ఇంగ్లండ్ 24 ఓవర్లలో 70 పరుగులు రాబట్టింది. అయితే భారత బౌలర్లను విసిగిస్తున్న ఇంగ్లండ్ జోడీకి స్పిన్నర్ జడేజా చెక్ పెట్టాడు. ఆఖరి సెషన్ ఆరంభమైన తొలి బంతికే సబ్‌స్టిట్యూట్ కీపర్ జురెల్‌కు పోప్ క్యాచ్ ఇచ్చాడు. దీంతో మూడో వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత బ్రూక్ (11)ను బుమ్రా బౌల్డ్ చేసినా.. స్టోక్స్‌తో కలిసి రూట్ జట్టును ఆదుకున్నాడు. ఐదో వికెట్‌కు అజేయంగా 79 పరుగులు జోడించాక ఈ జోడీ తొలి రోజును ముగించింది.

ఎంసీసీ మ్యూజియంలో సచిన్ చిత్రపటం



సచిన్ టెండూల్కర్‌కు అరుదైన గౌరవం దక్కింది. లార్డ్స్ మైదానంలోని మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) మ్యూజియంలో గురువారం అతడి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. సచిన్ 18 ఏళ్ల క్రితం నాటి ఫొటోగ్రాఫ్‌ను స్టువర్ట్ పియర్సన్ అనే చిత్రకారుడు చిత్రించాడు. ఈ చిత్రాన్ని ఏడాది చివరి వరకు ఎంసీసీ మ్యూజియంలోనే ఉంచి, ఆ తర్వాత లార్డ్స్ పెవిలియన్‌కు మార్చనున్నారు. భారత్ నుంచి మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, కపిల్ దేవ్, బిషన్ సింగ్, వెంగ్‌సర్కార్ చిత్రాలు కూడా ఎంసీసీ మ్యూజియంలో ఉన్నాయి. మరోవైపు లార్డ్స్‌లో జరుగుతున్న తాజా టెస్టును సచిన్ గంట మోగించి ఆరంభించాడు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) పంత్ (బి) నితీశ్ 18; డకెట్ (సి) పంత్ (బి) నితీశ్ 23; పోప్ (సి సబ్) జురెల్ (బి) జడేజా 44; రూట్ (బ్యాటింగ్) 99; బ్రూక్ (బి) బుమ్రా 11; స్టోక్స్ (బ్యాటింగ్) 39; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 83 ఓవర్లలో 251/4. వికెట్ల పతనం:** 1-43, 2-44, 3-153, 4-172. **బౌలింగ్:** బుమ్రా 18-3-35-1; ఆకాశ్ 17-2-75-0; సిరాజ్ 14-5-33-0; నితీశ్ 14-0-46-2; జడేజా 10-1-26-1; సుందర్ 10-1-21-0.

పంత్‌కు గాయం



రెండో సెషన్‌లో వికెట్ కీపర్ రిషభ్ పంత్ చేతి వేలికి గాయమైంది. 34వ ఓవర్‌లో బుమ్రా వేసిన బంతిని అతడు ఎడమ వైపునకు డైవ్ చేస్తూ ఆపేందుకు ప్రయత్నించాడు. అయితే ఈ క్రమంలో పంత్ ఎడమ చేతి చూపుడు వేలికి బంతి బలంగా తాకింది. నొప్పితో విలవిల్లాడిన అతనికి ఫిజియో వచ్చి చికిత్స చేశాడు. అయినా పంత్‌కు నొప్పి తగ్గకపోవడంతో ఆ ఓవర్ ముగిశాక మైదానం వీడగా.. జురెల్ కీపింగ్ చేశాడు. ప్రస్తుతం పంత్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్టు బీసీసీఐ తెలిపింది.

చరిత్ర సృష్టించిన భారత్

- నాలుగో టీ20లో హర్మన్ సేన గెలుపు
- ఇంగ్లండ్‌పై తొలి టీ20 సిరీస్ విజయం

మాంచెస్టర్: భారత మహిళల జట్టు చరిత్ర సృష్టించింది. తొలిసారి ఇంగ్లండ్‌పై టీ20 సిరీస్ విజయాన్ని నమోదు చేసింది. బుధవారం రాత్రి జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఐదు టీ20ల సిరీస్‌ను 3-1తో మరో మ్యాచ్ మిగిలుండగానే సొంతం చేసుకొంది. స్పిన్నర్లు రాధా యాదవ్ (2/15), తెలుగమ్మాయి శ్రీచరణి (2/30), దీప్తి శర్మ (1/29) తిప్పేయడంతో.. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 126/7 స్కోరుకే పరిమితమైంది. భారత ఫీల్డింగ్ కూడా మెరుగ్గా ఉండడంతో ఇంగ్లండ్ పరుగుల కోసం తీవ్రంగా శ్రమించింది. డంక్లే (22), బ్యూమాంట్ (20) టాప్ స్కోరర్లు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని భారత్ 17 ఓవర్లలో 4 వికెట్లకు 127 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (32), స్మృతి మంధాన (31) తొలి వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. ఆ తర్వాత జెమీమా (24 నాటౌట్), హర్మన్‌ప్రీత్ (26) ఆచితూచి ఆడుతూ జట్టును గెలుపు తీరాలకు చేర్చారు.

భారత్ ‘ఎ’ జట్టులో తెలుగమ్మాయి షబ్నం షకీల్



ఆసీస్ ‘ఎ’తో పరిమిత ఓవర్ల సిరీస్

న్యూఢిల్లీ: ఆంధ్ర యువ క్రికెటర్ షబ్నం షకీల్ భారత్ ‘ఎ’ జట్టుకు ఎంపికైంది. వచ్చే నెల 7 నుంచి 24 వరకు ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టుతో మూడు టీ20, మూడు వన్డేల సిరీస్‌లతో పాటు భారత్ నాలుగు రోజుల మ్యాచ్ ఆడనుంది. దీని కోసం సెలెక్టర్లు రెండు జట్లను ప్రకటించారు. ఇందులో 18 ఏళ్ల వైజాగ్ పేసర్ షబ్నంకు టీ20, వన్డే జట్లలో చోటు దక్కడం విశేషం. రెండేళ్ల క్రితం అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో షబ్నం సభ్యురాలు. ఇక భారత్ ‘ఎ’ జట్లకు స్పిన్నర్ రాధా యాదవ్ నేతృత్వం వహిస్తుండగా, స్పిన్నర్లు శ్రేయాంక, ప్రియా మిశ్రా, షఫాలీ, టిటాస్ సాధు తదితరులు చోటు దక్కించుకున్నారు.

తొమ్మిదేళ్లలో తొలిసారి అత్యల్పంగా..

ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ @ 133

న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ పురుషుల జట్టు తాజా ఫిఫా ర్యాంకింగ్స్‌లో ఆరు స్థానాలు కోల్పోయి 133వ ర్యాంక్‌లో నిలిచింది. భారత్ ఇంత అత్యల్ప ర్యాంక్‌కు చేరడం గత తొమ్మిదేళ్లలో ఇదే మొదటిసారి. భారత జట్టు కెరీర్‌లో అత్యుత్తమంగా 1996 ఫిబ్రవరిలో 94వ ర్యాంక్‌ను అందుకుంది. ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా నెంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. స్పెయిన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్, బ్రెజిల్ వరుసగా 2, 3, 4, 5 ర్యాంక్‌ల్లో ఉన్నాయి.

అబ్బురపర్చిన నిర్వి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎనిమిదేళ్ల నిర్వి ప్రద్యుమ్న అత్యంత పిన్న వయసులో రెండు ప్రపంచ రికార్డులు నెలకొల్పింది. గురువారం కూకట్‌పల్లిలో నిర్వి ఈ రెండు ప్రపంచ రికార్డులకు యత్నించింది. 50కి పైగా చెస్ ఓపెనింగ్ ట్రాప్స్‌ను 50కి పైగా బోర్డులపై కేవలం 30 నిమిషాల్లోనే పూర్తి చేసి అతి తక్కువ సమయంలో పిన్న వయస్సులో ఈ ఘనత సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది. తదనంతరం 195 దేశాల అధికారిక కరెన్సీను కేవలం 4 నిమిషాల 26 సెకన్లలో గుర్తించి, పేర్లు చెప్పింది. ఈ రెండు రికార్డులను లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సుకు పోటీల నిర్వాహకులు పంపించారు. మూడ్రోజుల్లో ఈ రికార్డులను అధికారికంగా వెల్లడించనున్నారు.

అమందా సంచలనం

- తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ బెర్త్
- సెమీస్‌లో టాప్ సీడ్ సబలెంకకు షాక్
- తుదిపోరులో స్వియటెక్‌తో ఢీ


వింబుల్డన్
స్వియటెక్
అమండా
సబలెంక

లండన్: వింబుల్డన్‌లో అమెరికా భామ అమందా అనిసిమోవా పెను సంచలనం సృష్టించింది. ఏకంగా టాప్ సీడ్ అర్యానా సబలెంకను ఓడించి.. కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మరోవైపు 8వ సీడ్ ఇగా స్వియటెక్ మొదటిసారి వింబుల్డన్ తుది పోరుకు చేరుకొంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో 13వ సీడ్ అమందా 6-4, 4-6, 6-4తో సబలెంకకు షాకిచ్చింది. 2 గంటల 36 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో సబలెంక 6 ఏస్‌లు కొడితే.. అనిసిమోవా 2 మాత్రమే సంధించింది. అమందా 13 విన్నర్లతో సబలెంకపై ఆధిపత్యం ప్రదర్శించింది. గ్రాస్ కోర్ట్ సెమీస్‌లో ఓడడం సబలెంకకు ఇది మూడోసారి.

స్వియటెక్ జోరు: ఏకపక్షంగా సాగిన మరో సెమీస్ మ్యాచ్‌లో పోలెండ్ స్టార్ స్వియటెక్ సునాయాసంగా నెగ్గింది. స్వియటెక్ 6-2, 6-0తో బెలిండా బెన్సిక్ (స్విట్జర్లాండ్)ను వరుస సెట్లలో ఓడించింది. శనివారం జరిగే టైటిల్ ఫైట్‌లో అమందాతో అమీతుమీ తేల్చుకోనుంది. వీరిద్దరూ తొలిసారి ఫైనల్ చేరడంతో.. ఈసారి వింబుల్డన్‌కు కొత్త చాంపియన్ రావడం ఖాయమైంది.

హద్దుమీరిన ఆటగాళ్లకు ఫైన్: క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా రాకెట్లను విసిరికొట్టడం, సిబ్బందిని దూషించడం, క్రీడా పరికరాలపై అసహనాన్ని ప్రదర్శిస్తూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్న ఆటగాళ్లపై వింబుల్డన్ నిర్వాహకులు భారీగా జరిమానాలు విధిస్తున్నారు. మొత్తంగా ఏడుగురు పురుషులు, ఎనిమిది మంది మహిళలకు కలిపి సుమారు రూ. 60 లక్షల జరిమానా విధించారు.

బిజినెస్

టీసీఎస్ లాభం రూ.12,760 కోట్లు

జూన్ త్రైమాసిక లాభంలో 6% వృద్ధి.. ఒక్కో షేరుకు రూ.11 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ/ముంబై: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) గురువారం ప్రకటించిన తొలి త్రైమాసిక (ఏప్రిల్-జూన్) ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేక పోయింది. ప్రధాన మార్కెట్లలో ఎదురీతతో పాటు గత కొన్ని త్రైమాసికాలుగా అండగా ఉన్న బీఎస్ఎన్ఎల్ డీల్‌ను రద్దు చేసుకున్న ప్రభావం ఫలితాలపై స్పష్టంగా కనిపించింది. నాన్ కోర్ ఆదాయాల వృద్ధి కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి కంపెనీ రూ.12,760 కోట్ల లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 6% వృద్ధి చెందింది. మరోవైపు ఈ కాలంలో కంపెనీ ఆదాయం రూపాయి మారకంలో 1.3% వృద్ధి చెంది రూ.63,437 కోట్లుగా నమోదైనప్పటికీ స్థిర కరెన్సీ ఆదాయం మాత్రం 3% క్షీణించింది.

ఇతరత్రా ఆదాయం గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే రూ.962 కోట్ల నుంచి రూ.1,660 కోట్లకు పెరిగింది. గతంలో చెల్లించిన ఆదాయపు పన్ను ఏకమొత్తంలో వాపసు రావడం కంపెనీ లాభాలకు దోహదపడింది. నిర్వహణాపరమైన లాభాల మార్జిన్ సైతం వార్షిక ప్రాతిపదికన 24.7% నుంచి 24.5 శాతానికి తగ్గింది. అమెరికాలో ఆదాయం 2.7% తగ్గడమే ఇందుకు కారణం. రూ.15,000 కోట్ల విలువ గల బీఎస్ఎన్ఎల్ రద్దు ప్రభావం వల్ల భారత్ నుంచి సమకూరే ఆదాయాలు కూడా 21.7% తగ్గినట్టు ప్రకటించింది. అయితే బీఎస్ఎన్ఎల్ నుంచి రూ.2,900 కోట్ల యాడ్ ఆన్ వర్క్ వచ్చిందని, ఆ పని ఇంకా ప్రారంభించాల్సి ఉందని పేర్కొంది.

ఈ ఏడాది రెండంకెల ఆదాయ వృద్ధి అసాధ్యం

ప్రపంచవ్యాప్తంగా స్థూల ఆర్థిక, భౌగోళిక, రాజకీయ విభాగాల్లో కొనసాగుతున్న అస్థిరతల కారణంగా ఐటీ సర్వీసులకు డిమాండ్ క్షీణించిందని, ఈ కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయాల్లో రెండంకెల వృద్ధి ఉంటుందని తాను భావించడంలేదని టీసీఎస్ ఎండీ, సీఈఓ కే కృతివాసన్ అన్నారు. ముందు త్రైమాసికంలో విధాన నిర్ణయాల్లో చోటు చేసుకున్న జాప్యం సైతం ఇప్పుడు మరింత తీవ్రమైందని ఆయన చెప్పారు. అయితే గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్ల ఆదాయాలు కొంత మెరుగ్గా ఉండవచ్చని తెలిపారు.

ఒకసారి అస్థిరతలన్నీ తొలగిపోతే ఐటీ కంపెనీల ఆదాయాల వృద్ధికి ప్రధాన చోదకమైన విచక్షణాత్మక వ్యయాలు సాధారణ స్థాయికి వస్తాయన్నారు. ఆగస్టు చివరి నాటికి తమకు ప్రధాన మార్కెట్ అయిన అమెరికాతో వాణిజ్య ఒప్పందం తుదిరూపు దిద్దుకోవడం, క్లయింట్లు వ్యయ నియంత్రణ పాటిస్తున్న కొన్ని అంశాలపై స్పష్టత రావడం వంటి పరిణామాలు చోటు చేసుకోవచ్చని కృతివాసన్ తెలిపారు. కాగా ఏఐ సేవలపై క్లయింట్లకు మరింత ఆసక్తి కనిపిస్తోందన్నారు. ఈ త్రైమాసికంలో కంపెనీ 940 కోట్ల డాలర్ల విలువ గల కొత్త డీల్స్ కుదుర్చుకుంది.

డివిడెండ్ రికార్డు తేదీ ఈ నెల 16

వాటాదారులకు రూపాయి ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.11 మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు నిర్ణయించింది. డివిడెండ్‌కు అర్హత పొందేందుకు రికార్డు తేదీని జూలై 16గా నిర్ణయించారు. అంటే ఆ రోజుకి నమోదైన వాటాదారులందరికీ ఈ డివిడెండ్ లభిస్తుంది. డివిడెండ్‌ను ఆగస్టు 4వ తేదీ వాటాదారులకు చెల్లిస్తారు.

వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకోలేదు

ఈ ఏడాది వేతనాల పెంపుపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ప్రధాన మానవ వనరుల అధికారి మిలింద్ లక్కడ్ తెలిపారు. స్థూల ఆర్థిక వాతావరణం మెరుగుపడి వ్యాపారం సైతం వృద్ధి చెందితే తాము తప్పనిసరిగా వేతనాల్లో మంచి వృద్ధినే ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

6,000 నియామకాలు

ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6,000 మంది ఉద్యోగులను నియమించినట్టు టీసీఎస్ వెల్లడించింది. జూన్ ముగిసే నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,13,069గా ఉంది. కాగా జూన్ త్రైమాసికంలో ఉద్యోగుల వలసల రేటు 13.8 శాతంగా ఉంది.

అమెరికాలో భారతీయుల సత్తా

- వలస బిలియనీర్ల జాబితాలో 12 మంది
- అగ్రస్థానంలో జై చౌదురి
- సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్‌కు చోటు
- ఫోర్బ్స్ పత్రిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశం కాని దేశం. అయినా సరే ‘ఆస్తుల సంపాదనలో తగ్గేదేలే’ అంటున్నారు అమెరికాలోని భారతీయులు. విద్య లేదా ఉపాధి కోసం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడిన భారతీయుల్లో కొందరు రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఈ సంపాదనలో వీరు స్థానిక అమెరికన్లనూ మించిపోతున్నారు. అమెరికాలో 100 కోట్ల డాలర్ల కంటే ఎక్కువ సంపద ఉన్న వలసదారుల జాబితాలో ఈ సంవత్సరం అత్యధికంగా భారత్‌కు చెందిన 12 మందికి చోటు దక్కింది. గతంలో ఎన్నడూ ఇంతమంది భారత వలసదారులు బిలియనీర్ల జాబితాలో చేరలేదని ‘2025 అమెరికా రిచెస్ట్ ఇమ్మిగ్రెంట్స్ లిస్ట్’ పేరుతో ఫోర్బ్స్ మ్యాగజైన్ రూపొందించిన నివేదిక వెల్లడించింది. భారత్ తర్వాత ఇజ్రాయెల్, తైవాన్ దేశాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. కాగా ఈ సంవత్సరం ఫోర్బ్స్ మ్యాగజైన్ ప్రకటించిన వలస బిలియనీర్ల జాబితాలో గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్, తెలుగువాడైన మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల కూడా ఉన్నారు. ప్రస్తుతం వీరిద్దరి ఆస్తుల విలువ చెరో 110 కోట్ల డాలర్ల (సుమారు రూ.9,427 కోట్లు) వరకు ఉంటుందని ఫోర్బ్స్ పత్రిక అంచనా. సైబర్ సెక్యూరిటీ సంస్థ జెడ్‌స్కేలర్ వ్యవస్థాపకుడు, సీఈఓ జై చౌదురి ఈ విషయంలో 1,790 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.53 లక్షల కోట్లు) సంపదతో మిగతా భారత బిలియనీర్లు అందరి కంటే ముందున్నారు.

అమెరికాలో టాప్-12 భారత వలస బిలియనీర్లు

పేరు	ఆస్తుల విలువ (కోట్ల డాలర్లలో)
జై చౌదురి	1,790
వినోద్ ఖోస్లా	920
రాకేశ్ గంగ్వాల్	660
రొమేష్ టీ వాద్వానీ	500
రాజీవ్ జైన్	480
కవితార్క్ రామ్ శ్రీరామ్	300
రాజ్ సర్దానా	200
డేవిడ్ పాల్	150
నిఖేష్ అరోరా	140
సుందర్ పిచాయ్	110
సత్య నాదెళ్ల	110
నీరజా సేథి	100

ఎలాన్ మస్క్‌దే అగ్రస్థానం

అమెరికాకు వలస వచ్చి పెద్ద మొత్తంలో ఆస్తులు కూడబెట్టిన వలసదారుల్లో టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌దే అగ్రస్థానం. ప్రస్తుతం ఆయన ఆస్తుల విలువ 39,300 కోట్ల డాలర్లని (సుమారు రూ.33.68 లక్షల కోట్లు) ఫోర్బ్స్ తెలిపింది. గూగుల్ సహ వ్యవస్థాకుడు సెర్జీ బ్రెన్ (13,970 కోట్ల డాలర్లు), ఎన్‌విడియా సహ వ్యవస్థాపకుడు, సీఈఓ జెన్‌సెన్ హువాంగ్ (13,790 కోట్ల డాలర్లు) డాలర్ల సంపదతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు

ఎల్ఐసీలో 1% వాటా విక్రయం!

- ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్
- మార్కెట్ పరిస్థితుల ఆధారంగా అమ్మకం
- రూ.5,850 కోట్ల వరకు సమీకరణ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బీమా దిగ్గజం భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) మరోసారి వాటాల విక్రయానికి సిద్ధమవుతోంది. కంపెనీ ఈక్విటీలో 1 శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ ఓఎఫ్ఎస్ ద్వారా రూ.5,850 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉందని భావిస్తున్నారు. మార్కెట్ పరిస్థితుల ఆధారంగా ఈ వాటా విక్రయంపై పెట్టుబడుల ఉపసంహరణ మంత్రిత్వ శాఖ దీనిపై నిర్ణయం తీసుకుంటుంది.

ఎందుకంటే ?

ఎల్ఐసీ 2022 మే నెలలో తన ఈక్విటీలో 3.5 శాతం వాటాను ఐపీఓ ద్వారా విక్రయించి రూ.21,000 కోట్లు సమీకరించింది. సెబీ నిబంధనల ప్రకారం కంపెనీ 2027 మే నాటికి తన ఈక్విటీలో కనీసం 10 శాతం అంటే మరో 6.5 శాతం వాటాను ప్రజలకు విక్రయించాలి. అయితే ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా.. మార్కెట్ పరిస్థితులను బట్టి దశల వారీగా విక్రయించాలని ఎల్ఐసీ యోచిస్తోంది. ఆ వ్యూహంలో భాగంగానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1 శాతం ఈక్విటీ వాటాను త్వరలో ఓఎఫ్ఎస్ ద్వారా విక్రయించాలని భావిస్తున్నట్టు సమాచారం.

ఇన్వెస్టర్లకు నిరాశే

2022 మే నెలలో రూ.21,000 కోట్ల సమీకరణకు ఎల్ఐసీ రూ.902-949 ధరల శ్రేణితో ఐపీఓకు వచ్చింది. ఇన్వెస్టర్లు ఆసక్తి చూపించడంతో ఇష్యూ దాదాపు మూడు రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. అయితే షేర్ల లిస్టింగ్ తొలి రోజే 8 శాతం నష్టంతో మదుపరులను తీవ్రంగా నిరాశ పరిచింది. ఒక్కో షేరును రూ.949 చొప్పున జారీ చేయగా 2023 మే నెలలో ఒకదశలో ఎల్ఐసీ షేరు రూ.567కు పడిపోయింది. గత 52 వారాల్లో ఒక దశలో రూ.1,221.5కి చేరినా మళ్లీ వెంటనే నష్టాల బాట పట్టింది. గురువారం కూడా బీఎస్ఈలో ఎల్ఐసీ షేరు 2.01 శాతం నష్టంతో రూ.926.85 వద్ద ముగిసింది. ఇది ఐపీఓ ధరతో పోల్చితే రూ.22.15 తక్కువ. ఈ నేపథ్యంలో కంపెనీ జారీ చేసే ఓఎఫ్ఎస్‌కు మదుపరులు నుంచి ఎలాంటి ఆదరణ లభిస్తుందన్నది పెద్ద ప్రశ్న.

- భారతీయ సినిమా రంగంలో కొత్త వారికి అవకాశం కల్పించే ఉద్దేశంతో స్క్రీన్ గ్రూప్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ స్క్రీన్ అకాడమీని ప్రారంభించాయి. ఈ అకాడమీకి లోధా ఫౌండేషన్ ప్యాట్రన్ అభిషేక్ లోధా తోడ్పాటునందించారు. ఎఫ్‌టీఐఐ (పుణె), ఎస్ఆర్ఎఫ్‌టీఐ (కోల్‌కతా), విజ్లింగ్ ఉడ్స్ వంటి సంస్థలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ అకాడమీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫెలోషిప్స్‌ను అందిస్తుంది.
- ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్ ఇండియా).. తెలంగాణ మార్కెట్లోకి ప్రీమియం కలర్ కోటెడ్ స్టీల్ ఉత్పత్తులపై ఆప్టిగల్, ప్రైమ్, ఆప్టిగల్ పినాకిల్‌ను తీసుకువచ్చింది. రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనా రంగంలోని అవసరాలను తమ ఉత్పత్తులు తీర్చగలవని తెలిపింది.
- హిందవేర్ తన స్మార్ట్ అప్లయెన్సెస్.. తన కిచెన్ పోర్టుఫోలియోను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా మోటార్ ఎక్విప్డ్, బీఎల్‌డీసీ చిమ్నీలు, ఓవెన్స్ కిచెన్ సింక్స్ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చింది.
- ఆంధ్రప్రదేశ్‌లోని రెండు సున్నపు రాయి గనులకు ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ నుంచి 5 స్టార్ రేటింగ్ లభించిందని అల్ట్రాటెక్ సిమెంట్ వెల్లడించింది. ఎన్‌టీఆర్ జిల్లాలోని బుదవాడ లైమ్‌స్టోన్ మైన్ సహా అనంతపురం జిల్లాలోని తుమ్మలపెంట గనులకు ఈ రేటింగ్ లభించిందని తెలిపింది.

హెచ్‌యూఎల్ ఎండీ, సీఈఓగా ప్రియా నాయర్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్)లో అధికార మార్పిడి జరగనుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కంపెనీ ఎండీ, సీఈఓగా ప్రియా నాయర్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు కంపెనీ ఎండీ, సీఈఓగా ఉన్న రోహిత్ జావ ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో ప్రియా నాయర్ బాధ్యతలు చేపడతారని హెచ్‌యూఎల్ ప్రకటించింది. ఒక మహిళను ఎండీ, సీఈఓ పదవిలో నియమించడం హెచ్‌యూఎల్ చరిత్రలో ఇదే మొదటిసారి. ఆమె ఈ పదవిలో ఐదేళ్ల పాటు కొనసాగుతారు.

సెన్సెక్స్ 345 పాయింట్లు డౌన్

ముంబై: కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తమై అమ్మకాలకు పాల్పడడం గురువారం మార్కెట్‌ను కుంగదీసింది. ఐటీ, టెలికాం షేర్లలో తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి ప్రభావంతో ఈక్విటీ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 385.40 పాయింట్లు నష్టపోయి 83,190.28 వద్ద ముగియగా నిఫ్టీ 120.85 పాయింట్ల నష్టంతో 25,355.25 వద్ద క్లోజైంది. మార్కెట్ నష్టాల్లో ముగియడం వరుసగా ఇది రెండో రోజు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	540
వరంగల్	512	గోదావరి	515
చిత్తూరు	603	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	102
వరంగల్	100	గుంటూరు	107
కరీంనగర్	100	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	98
కర్నూలు	100	నెల్లూరు	103
విశాఖపట్నం	86	అనంతపురం	103
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,400 ▲	90,200 ▲	1,20,100 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▼	1,11,000 ▲
విశాఖపట్నం	99,920 ▲	90,200 ▲	1,20,000 ▼
రాజమండ్రి	98,400 ▲	90,200 ▲	1,19,200 ▲
ప్రొద్దుటూరు	97,200 ▲	89,420 ▲	1,08,200 ▼
ముంబై	97,046	88,894	1,07,934

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బాహుబలి మళ్లీ వస్తున్నాడు



భారతీయ సినీ చరిత్రలో 'బాహుబలి'కి ఎంతటి ప్రత్యేక స్థానం ఉందో చెప్పక్కర్లేదు. టాలీవుడ్ స్థాయిని ప్రపంచానికి చాటి చెప్పిన ఈ సినిమా మొదటి భాగం విడుదలై 10 ఏళ్లు అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అభిమానులకు తీపికబురందించారు. 'బాహుబలి: ద బిగినింగ్', 'బాహుబలి: ద కన్‌క్లూజన్'.. రెండు భాగాలను కలిపి 'బాహుబలి: ద ఎపిక్'గా అక్టోబర్ 31న రీ రిలీజ్ చేయనున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు. "బాహుబలి.. ఎన్నో అద్భుతమైన ప్రయాణాలకు ఆరంభం. లెక్కలేనన్ని జ్ఞాపకాలను ఇచ్చింది. ఎంతోమందికి స్ఫూర్తిని పంచింది. ఈ సినిమా రెండు భాగాలను కలిపి 'బాహుబలి ద ఎపిక్' పేరిట మరోసారి మీ ముందుకు తీసుకువస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రియుల ఆనందం రెట్టింపైంది. చిత్రం విడుదలై పదేళ్లు అయిన సందర్భంగా బుధవారం రాత్రి 'బాహుబలి' టీమ్ రీ యూనియన్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఇందులో రాజమౌళి, ప్రభాస్, రానా, రమ్యకృష్ణతో సహా టోటల్ టీమ్ పాల్గొన్నారు. రమ్యకృష్ణ సినిమాలోని తన డైలాగు 'ఇది నా మాట. నా మాటే శాసనం' అనే ప్లకార్డు పట్టుకుని ఫోజివ్వడం ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, 2015లో ఈ సినిమా ప్రచారంలో భాగంగా రాజమౌళి వాడిన 'బాహుబలి వస్తున్నాడు' అనే హ్యాష్ ట్యాగ్ ఇప్పుడు వైరల్ అవుతోంది.

మరో విలక్షణమైన కథాంశంతో..



'కుబేర' విజయాన్ని ఆస్వాదిస్తున్న ధనుష్.. అదే జోష్‌లో తన తదుపరి చిత్రాన్ని అనౌన్స్ చేశారు. ఇది ధనుష్‌కు 54వ చిత్రం. విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, థింక్ స్టూడియోస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. గురువారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్రబృందం అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని విడుదల చేసింది. విలక్షణమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ చిత్రంలో ధనుష్ సరసన కథానాయికగా మమిత బైజు నటిస్తున్నారు. జి.వి.ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

కార్తీ 'మార్షల్'



తమిళ హీరో కార్తీ, కల్యాణి ప్రియదర్శన్ జంటగా కొత్త చిత్రం ప్రారంభమైంది. ఈ చిత్రానికి తమిళ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. 'మార్షల్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గురువారం పూజా కార్యక్రమాలతో పాటు రెగ్యులర్ షూటింగ్‌ని చిత్రబృందం ప్రారంభించింది. సత్యన్ సూర్యన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. సత్యరాజ్, ప్రభు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రూమర్స్‌కు ఫొటోతో సమాధానం



హీరోయిన్ నయనతార, దర్శకుడు విఘ్నేష్ శివన్ దంపతులు విడిపోతున్నారంటూ వస్తున్న వదంతులను ఆ జంట కొట్టిపారేసింది. దీనిపై నయనతార గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. భర్తతో కలసి ఉన్న ఫొటోను షేర్ చేసిన నయనతార.. 'మాపై వచ్చే సిల్లీ న్యూస్‌కు మా రియాక్షన్ ఇదే' అంటూ సోషల్ మీడియాలో సాగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. కాగా, కొన్ని రోజుల క్రితం నయనతార పెట్టిన పోస్టే వారి విడాకులపై ప్రచారం సాగడానికి ప్రధాన కారణంగా నిలిచింది. 'తెలివి తక్కువ వ్యక్తిని పెళ్లి చేసుకోవడం పొరపాటు. నీ భర్త తప్పులకు నువ్వు బాధ్యత వహించాల్సిన అవసరం లేదు' అంటూ నయనతార పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. దీంతో ఆమె కొన్ని గంటల్లోనే డిలీట్ చేసింది. అయితే, ఆ పోస్ట్ స్ర్కీన్‌షాట్లు మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఆమె స్పందించారు.

-చెన్నై(ఆంధ్రజ్యోతి)

భక్తిభావన ఉప్పొంగేలా



పురాణాల్లోని దశావతారాల స్ఫూర్తితో హోంబలే ఫిల్మ్స్ సంస్థ పది త్రీడీ యానిమేషన్ చిత్రాలను నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. ఈ వరుసలో వస్తున్న తొలి చిత్రం 'మహావతార్ నరసింహ'. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో శిల్పా ధావన్ నిర్మిస్తున్నారు. ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. హిరణ్యకశిప, ప్రహ్లాద, నరసింహ స్వామి పాత్రలను పరిచయం చేస్తూ ట్రైలర్ సాగింది. ఈ సందర్భంగా శిల్పా ధావన్ మాట్లాడుతూ 'నరసింహ స్వామి గర్జన ప్రతి హృదయంలో భక్తి భావన ఉప్పొంగేలా చేస్తుంది' అని అన్నారు. అశ్విన్ కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం దృశ్యకావ్యంలా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని చెప్పారు.

కొత్తపల్లిలో వినోదం

గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న హాస్య చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహిస్తూ, గోపాలకృష్ణ పరుచూరితో కలసి నిర్మిస్తున్నారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. మనోజ్ చంద్ర, మౌనిక టి, బెనర్జీ ప్రధాన తారాగణం. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. స్నేహం, వినోదం ప్రధానాంశాలుగా కుటుంబ నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రమిదని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిదని మేకర్స్ తెలిపారు.



ఈ చదువులకేమైంది?

-ఆర్. నారాయణమూర్తి



సమకాలీన సామాజిక సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకుని ఆలోచింపజేసే చిత్రాలను తీసే నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి. ఆయన తాజా చిత్రం 'యూనివర్సిటీ'. 'పేపర్ లీక్' అనేది ట్యాగ్‌లైన్. స్నేహచిత్ర పతాకంపై స్వీయ దర్శకత్వంలో నారాయణమూర్తి నటించి, నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ 'కొన్నాళ్లుగా మన విద్యారంగంలో జరుగుతున్న పేపర్ లీకులు, గ్రూప్ - 1, 2 పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులు చూస్తుంటే ఈ చదువులకేమైంది అనిపిస్తోంది. ఇలా జరుగుతుంటే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి? లంబకోణాలు నేర్పిన వాళ్లే ఇలా కుంభకోణాలు చేస్తూ ఉంటే రెక్కలు తెగిన జ్ఞాన పావురాలు విలవిలా కొట్టుకుని నేలకు రాలుతున్నాయి. అందుకే విద్యను ప్రైవేట్ మాఫియా కబంధ హస్తాల నుంచి విముక్తి చేయాలి. విద్యను జాతీయం చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి.. ఈ అంశాలనే మా సినిమాలో బలంగా చెప్పాం' అన్నారు. 'యూనివర్సిటీ' చిత్రంలో వై.ఎస్. కృష్ణేశ్వర రావు, తిరుపతి నాయుడు, విజయకుమార్ సహా నూతన తారాగణం నటించారు.

నిర్మాతగా కిరణ్ అబ్బవరం



సుష్మిరా స్టూడియోస్‌తో కలసి హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్‌పై నిర్మిస్తున్న చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. తేజేశ్వర్‌రెడ్డి వేల్పుచర్ల సహనిర్మాత. సాయితేజ్, వేదశ్రీ జంటగా నటిస్తున్నారు. వి. మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. చిత్రబృందం గురువారం టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని యూనిట్ తెలిపింది.

నాని సినిమాలో 'కిల్' విలన్



నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'ది ప్యారడైజ్' చిత్రంలో రాఘవ్ జుయల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'కిల్', 'గ్యారా గ్యారా' చిత్రాల్లో అద్భుతమైన నటనను ప్రదర్శించిన రాఘవ తెలుగులో నానితో కలసి స్ర్కీన్‌ను షేర్ చేసుకుంటున్నారు. గురువారం రాఘవ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఓ క్రేజీ వీడియోతో ఈ విషయాన్ని అనౌన్స్ చేసింది. రాఘవను ఓ కొత్త లుక్‌లో, కొత్త పాత్రలో పరిచయం చేస్తూ ప్యారడైజ్ ప్రపంచంలోకి ఆహ్వానించింది. ఈ సినిమాను ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల కానుంది.


గ్రామీణ ప్రేమకథ



యదార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న వైవిధ్య గ్రామీణ ప్రేమకథా చిత్రం 'ఉసురే'. నవీన్ డి. గోపాల్ దర్శకత్వంలో మౌళి ఎం. రాధాకృష్ణ నిర్మించారు. టీజయ్ అరుణాచలం, జననీ కునశీలన్ జంటగా నటించారు. నటి రాశీ కీలకపాత్ర పోషించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 1న 'ఉసురే' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఇదొక వైవిధ్యమైన ప్రేమకథ' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'నిజ జీవిత సంఘటనల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అని చెప్పారు.

పగలు డైట్ ఫుడ్.. రాత్రిళ్లు డ్రగ్స్

● యాక్టర్ల తీరును తప్పుబట్టిన పహ్లాజ్ నిహలానీ



బాలీవుడ్ నిర్మాత, సెన్సార్ బోర్డ్ మాజీ ఛైర్మన్ పహ్లాజ్ నిహలానీ ఇండస్ట్రీలోని పరిస్థితులపై, యాక్టర్ల జీవనశైలిపై సంచలన కామెంట్స్ చేశారు. ఇటీవలె ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. "ఒకప్పుడు యాక్టర్లు కాస్టింగ్ విషయంలో తలదూర్చేవారు కారు. అది దర్శక నిర్మాతల చేతుల్లోనే ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. నటులే డైరెక్టర్లను ఎంపిక చేసుకోవడంతో పాటు కాస్టింగ్‌ను నిర్ణయిస్తున్నారు. దీంతో నిర్మాతల పరిస్థితి కొరియర్ సర్వీస్‌లా మారింది. నేను 2003లో 'తలాష్: ద హంట్ బిగిన్స్' సినిమా నిర్మించేటప్పుడు అక్షయ్‌కుమార్ 'సినిమాను రేపే ప్రారంభించొచ్చు. నాకు పారితోషికంగా మీకు నచ్చినంత ఇవ్వండి. కానీ నాదొక్కటే షరతు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కరీనా కపూర్ ఉండాలి' అని చెప్పారు. నా కెరీర్‌లో ఒక నటుడు నాతో అలా ప్రవర్తించడం అదే తొలిసారి. వయసు పెరిగిన స్టార్ హీరోలు కొత్త హీరోయిన్లతో నటించాలనే ఆసక్తి చూపించడానికి కారణం. వారి వయస్సు తక్కువగా కనిపించాలనే. సినిమా నిర్మాణంలో కూడా ఇప్పుడు అనవసర ఖర్చులు ఎక్కువయ్యాయి. ఒకప్పుడు హీరో, హీరోయిన్లలతో పాటు పర్సనల్ మేకప్ మ్యాన్ మాత్రమే ఉండేవాడు. ఇప్పుడేమో అదనంగా హెయిర్ డ్రెస్సర్, అద్దం పట్టుకోవడానికి వ్యక్తులు ఉంటున్నారు. అప్పట్లో తారలు ఇంటినుంచి ఆహారం తెచ్చుకునేవారు. ఇప్పటి వారికి పగలేమో ప్రత్యేక డైట్ ఫుడ్ కావాలి. రాత్రయితే డ్రగ్స్ కావాలి" అని అన్నారు.

రైతులకు నువ్వేం చేశావ్?

» నువ్వు పెట్టిన బకాయిలూ మేమే చెల్లించాం

» మనుషుల్నే తొక్కించినోడికి రైతు కష్టం ఏం తెలుస్తుంది?

» జగన్‌ను ఉద్దేశించి మంత్రి మనోహర్ వ్యాఖ్యలు



తెనాలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'మనుషులనే కారుతో తొక్కించినోడికి రైతు కష్టం ఏం తెలుస్తుంది? తోతాపురి మామిడి రైతుల కష్టాన్ని రోడ్డు పైవేసి తొక్కిస్తావా? నీకు నువ్వే సమస్యలు సృష్టించి, అలజడులు రేపి, దాడులకు పాల్పడతానంటే ఈ ప్రభుత్వంలో కుదరదు. చర్యలు కఠినంగా ఉంటాయి' అని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. ఒక ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టే దమ్ము, ధైర్యం లేక రోడ్డున పడుతున్నారని విమర్శించారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. 'నీకు నిజంగా రైతులపై ప్రేమ ఉంటే, నీ ప్రభుత్వంలో చేసిందేమిటో.. మేము వచ్చిన ఏడాదిలో చేసిందేమిటో చెప్పడానికి బహిరంగ వేదిక పైకి రావాల'ని సవాల్ విసిరారు. 'వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు 12.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటే, మేము ఖరీఫ్, రబీ కలిపి 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాం. రూ.12,857 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. మీరు రైతులను మోసం చెల్లించకుండా వదిలేసిన ధాన్యం డబ్బు రూ.1674 కోట్లతో కలిసి మొత్తం రూ.14,531 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. మీరు అప్పట్లో చేసి వెళ్లిన పాపం కారణంగా 30 వేల మంది రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాకుండా ఆగింది. వాటిని కూడా సరిచేసి రూ.659.39 కోట్లు కూడా వారి ఖాతాలో వేసేందుకు గురువారం విడుదల చేశాం' అని మనోహర్ స్పష్టం చేశారు. తోతాపురి మామిడి రైతులకు కష్టం వచ్చిందంటూ చిత్తూరు జిల్లా వెళ్లి ఆయన అరాచకం సృష్టిస్తే మేము మాత్రం వారి ఖాతాల్లో రూ.260 కోట్లు వేస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పరామర్శ పేరుతో అలజడులు: పయ్యావుల

ఉరవకొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌కు రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరిగే అవకాశాన్ని కల్పిస్తున్నామని, కానీ ఆయన పరామర్శల పేరుతో అశాంతి, అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో గురువారం మెగా పీటీఎంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజల కోసం పనిచేసే పోలీసు వ్యవస్థను కించపరిచి మాట్లాడడం సరికాదని అన్నారు. బంగారుపాళెంలో జగన్ రావడానికి ముందు ట్రాక్టర్లను బయటకు తీసుకువచ్చి, రోడ్డు మీద మామిడికాయలు పడేసి ఫొటో షూట్‌తో డ్రామా నడిపించారని ఎద్దేవా చేశారు.

రైతు ద్రోహి జగన్: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో రైతులను గాలికి వదిలేసిన జగన్ రైతు ద్రోహి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు, భూ చట్టం, నాసిరకం విత్తనాల పంపిణీ, నాసిరకం ఎరువులతో రైతులను జగన్ మోసగించారని అన్నారు. సీఎం చంద్రబాబు తోతాపురి మామిడికి కిలో రూ.4 చొప్పున మద్దతు ధర ప్రకటించి, రూ.260 కోట్లు విడుదల చేశారని, త్వరలో వారి ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.

వికాసం వైపు ఏపీ అడుగులు: సత్యకుమార్

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) నివేదిక పరిశీలిస్తే ఏపీ వికాసం వైపు ఉరకలేస్తోందన్న విషయం స్పష్టమవుతోందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్రలతో పోటీ పడుతూ అత్యంత ఆకర్షణీయ రాష్ట్రంగా ఉందని ఈఐయూ నివేదిక విడుదల చేసినట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గణనీయ మార్పు సీఎం చంద్రబాబు బ్రాండ్ విలువను తెలియజేస్తోందని పేర్కొన్నారు.

జగన్ మీడియాను బహిష్కరించాలి: టీజీ భరత్

కర్నూలు అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మహిళలపై వైసీపీ నాయకులు కించపరిచేలా మాట్లాడుతున్నా.. వారి మాటలను సమర్థించేలా జగన్ పత్రిక, టీవీ చానెల్‌లో కథనాలు రావడం బాధాకరమని, ఆ మీడియాను ప్రజలు బహిష్కరించాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు నగరంలోని 13 డివిజన్‌లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిపై వైసీపీ నాయకుడు ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలు వైసీపీ నీచ సంస్కృతికి అద్దం పడుతున్నాయన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు: సీఎస్

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే అంటువ్యాధుల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్, సీజనల్ వ్యాధుల నియంత్రణ, వివిధ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తదితర అంశాలపై గురువారం అమరావతి సచివాలయం నుంచి కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

రాజధాని కాంట్రాక్టు సంస్థలకు అడ్వాన్సులు

విజయవాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థలకు సీఆర్‌డీఏ మొబిలైజేషన్ అడ్వాన్సులు అందించింది. ఇప్పటి వరకు రూ.337.46 కోట్లు చెల్లించింది. దీంతో పనులు మరింతగా పరుగులు పెట్టనున్నాయి. రాజధాని పరిధిలో రూ.45వేల కోట్ల విలువైన పనులు దశల వారీగా ప్రారంభమవుతున్నాయి. ఎన్‌సీసీ లిమిటెడ్‌కు రూ.125.64 కోట్లు, బీఎస్ఆర్ ఇండియా లిమిటెడ్ (బీఎస్ఆర్ఐఎల్)కు రూ.71.42 కోట్లు, ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఆర్‌వీఆర్)కు రూ.49.80 కోట్లు, మేఘా ఇంజనీరింగ్ సంస్థకు రూ.90.60 కోట్లు చొప్పున మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించారు.

పోలీసు పరీక్షా ఫలితాలు విడుదల

» త్వరలో 6100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఏపీలో కానిస్టేబుల్ పోస్టుల తుది ఫలితాలు గురువారం రాత్రి విడుదలయ్యాయి. ఫైనల్ పరీక్షను 37,600మంది రాయగా 33,921 మంది అర్హత సాధించారని ఎస్ఎల్ పీఆర్‌బీ ఛైర్మన్ ఆర్కే మీనా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరిలో 4,710 మంది మహిళా అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్లు ఈ నెల 12 సాయంత్రం ఐదింటి వరకూ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సందేహాలుంటే రూ.వెయ్యి చెల్లించి రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 9441450639, 9100203323 నంబర్లను సంప్రదించవచ్చు. మొత్తం 6100 పోస్టుల భర్తీకి పోలీసు శాఖ 2022 నవంబరు చివరి వారంలో నోటిఫికేషన్ విడుదల చేయగా, ఎట్టకేలకు భర్తీ ప్రకియ కొలిక్కి వచ్చింది. తుది ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులకు త్వరలోనే పోస్టింగ్‌లు ఇచ్చి, శిక్షణకు పంపనున్నారు.

పీ-4 అమలుకు కీలక ప్రణాళికలు

» టాప్-200 మార్గదర్శకులతో త్వరలో సీఎం భేటీ

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పేదరికం నిర్మూలనకు ప్రతిపాదించిన పీ-4 కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కీలక ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనిపై సీఎం చంద్రబాబు గురువారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమంలో మార్గదర్శకులుగా ఉండేందుకు 18,332 మంది ముందుకొచ్చారు. వీరిద్వారా 1,84,134 బంగారు కుటుంబాలకు చేయూత లభిస్తోంది. ఈమేరకు మార్గదర్శకులుగా ఉండేవారిని ప్రోత్సహించడానికి గాను వారితో చంద్రబాబు స్వయంగా సమావేశం కానున్నారు.

ఈఆర్‌సీ సభ్యుడి ఎంపిక దరఖాస్తు గడువు పెంపు

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సభ్యుడి ఎంపిక కోసం గత నెల 18న చేసిన ప్రకటన గడువును ప్రభుత్వం ఈనెల 16వ తేదీ వరకు పొడిగించింది. వాస్తవానికి ఈ గడువు బుధవారంతో ముగిసింది. ఈఆర్‌సీ సభ్యుడిగా సమర్థులైన వారిని ఎంపిక చేయాలన్న ఉద్దేశంతో దరఖాస్తుల స్వీకరణ గడువును వారం రోజులు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

విశాఖలో స్లీపింగ్ పాడ్స్

» విశాఖ రైల్వే స్టేషన్‌లో తక్కువ ఖర్చుతో విశ్రాంతి

» 3గంటలకు రూ.200.. దాటితే రూ.400..రోజంతా ఉండొచ్చు

» ఎవరైనా ఉండొచ్చు.. మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు

» ట్రాన్సిట్ ప్రయాణాలు చేసేవారికి వెసులుబాటు



స్లీపింగ్ పాడ్‌లో ఏర్పాటు చేసిన పడకలు

విశాఖపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే అధికారులు ప్రయాణికుల కోసం కొత్తగా 'స్లీపింగ్ పాడ్స్'ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిని 'క్యాప్సూల్ హోటల్'గాను వ్యవహరిస్తున్నారు. ఇది రైల్వే స్టేషన్‌లో ఒకటో నంబరు ప్లాట్ ఫారంపై మూడో నంబరు గేటును ఆనుకొని మొదటి అంతస్థులో ఉంది. ప్రైవేటు డార్మిటరీ తరహాలో ఉంటుంది.

ఇవీ ప్రత్యేకతలు..

ప్రయాణికులు ఏదైనా రైలు కోసం రెండు, మూడు గంటలు వేచి ఉండాల్సి వస్తే స్టేషన్‌లో అందరికీ వసతి లభించడం లేదు. రిటైరింగ్ రూమ్స్ నిండిపోతున్నాయి. లాంజ్‌లు ఫుల్ అయిపోతున్నాయి. చాలామంది ప్లాట్‌ఫారంపై కూర్చోవడానికి సీట్లు లేక అటూఇటూ తిరగాల్సి వస్తోంది. ఇటువంటి వారిని దృష్టిలో ఉంచుకొని ఈ 'స్లీపింగ్ పాడ్స్' ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రయాణికులు పడుకోవడానికి ఏసీ సదుపాయంతో బెడ్ ఉంటుంది. వాష్‌రూమ్, స్నాక్ బార్ (టీ, కాఫీ, బిస్కెట్లు) టీవీ చూడడానికి లాంజ్, 24/7 వేడినీరు, వై-ఫై, ట్రావెల్ డెస్క్ వంటి సదుపాయాలు ఉంటాయి. రూ.200 చెల్లిస్తే మూడు గంటలు హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు. లగేజీకి లాకర్ కూడా ఇస్తారు. మూడు గంటలకు మించి ఉంటే రూ.400 తీసుకుంటారు. ఈ మొత్తంతో 24 గంటల వరకూ ఉండొచ్చు. భార్యాభర్తలు వస్తే వారికి డబుల్ బెడ్ సదుపాయం ఉంది. వీటికైతే మూడు గంటలకు రూ.300, అంతకు మించి ఉంటే రూ.600 వసూలు చేస్తారు. కేవలం మహిళలు మాత్రమే వస్తే వారికి ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉన్నాయి. ఈ బెడ్లను తీసుకోవడానికి ఎటువంటి రైలు టికెట్ గానీ, ప్లాట్‌ఫారం టికెట్ గానీ తీసుకోవలసిన అవసరం లేదు. పర్యాటకులు, వైద్య అవసరాల కోసం వచ్చినవారు, ఆఫీసు సమావేశాల కోసం వచ్చిన వారు కూడా తీసుకోవచ్చు. సింగిల్ బెడ్లు73, డబుల్ బెడ్లు 15 ఉన్నాయి. వీటిలో 18 బెడ్లు పూర్తిగా మహిళల కోసం కేటాయించారు. వారికి ప్రత్యేకంగా డ్రెస్సింగ్ రూమ్ కూడా ఉంది.

జోన్‌లో ఇదే మొదటిది..



ఈ తరహా క్యాప్సూల్ ముంబై, హైదరాబాద్ వంటి నగరాల్లోనే ఉన్నాయి. ఇప్పుడు దక్షిణ కోస్తా జోన్‌లో విశాఖలోనే మొదటిగా ప్రారంభించాం. పైలట్ ప్రాజెక్టుగా ఓ సంస్థకు ఐదేళ్లకు స్థలం కాంట్రాక్ట్ ఇచ్చాం. ఆదరణ బాగుంటే అదనంగా మరిన్ని ఏర్పాటు చేస్తాం. ఇతర నగరాల్లోనూ పెట్టడానికి ప్రయత్నిస్తాం. తక్కువ ఖర్చుతో ప్రయాణికులకు విశ్రాంతి సదుపాయం కల్పిస్తున్నాం. భద్రత ఉంటుంది. ఆధార్ కార్డు చూపించి బెడ్లు తీసుకోవచ్చు.

-లలిత్ బొహ్రా, డీఆర్ఎం, విశాఖ డివిజన్

మంచి ఆలోచన.. చాలా బాగుంది

అమ్మతో కలిసి తిరుపతి నుంచి సింహగిరి ప్రదక్షిణ కోసం విశాఖపట్నం వచ్చాను. ఉదయం ప్రదక్షిణ పూర్తి చేసుకొని తిరిగి రైలు ఎక్కడానికి స్టేషన్‌కు వచ్చాం. కాళ్లు లాగుతున్నాయని, ఏదైనా హోటల్ ఉంటే కాసేపు విశ్రాంతి తీసుకుందామని అమ్మ అడిగింది. స్టేషన్‌లో దిగిన వెంటనే 'క్యాప్సూల్ బెడ్స్' బోర్డు కనిపించింది. వెంటనే డబుల్ రూమ్ తీసుకొన్నాం. ఇక్కడ సదుపాయాలన్నీ చాలా బాగున్నాయి.

-పృథ్వీ, తిరుపతి

దుబాయిలో స్థిరాస్తులు కొన్న

నేతలకు ఈడీ శ్రీముఖాలు!

» అవినీతి సొమ్ముతో ఎమిరేట్లలో స్థిరాస్తులు కొనుగోలు చేస్తున్న రాజకీయ నాయకులు

» క్రిప్టో కరెన్సీ, హవాలా మార్గాల్లో చెల్లింపులు

('ఆంధ్రజ్యోతి' గల్ఫ్ ప్రతినిధి)

ఆదాయ పన్ను ఎగవేతలను పకడ్బందీగా అడ్డుకునే క్రమంలో భాగంగా పటిష్ఠ నిబంధనలతో పట్టు బిగిస్తున్న సర్కారు.. చట్టాల్లో లొసుగులను వాడుకుని, అడ్డదారి మార్గాల్లో అడ్డగోలుగా సంపాదించిన నల్ల సొమ్ముతో విదేశాల్లో స్థిరాస్తులను కొనుగోలు చేస్తున్న అక్రమార్కులపై దృష్టి సారించింది! అందులో భాగంగానే.. దుబాయిలో ఇళ్లు కొంటున్నవారి వివరాలు సేకరిస్తోంది. అలా ఇప్పటికే గుర్తించినవారికి ఏడాది క్రితమే ఐటీ శాఖ నోటీసులు పంపగా.. ఇప్పుడు ఈడీ నుంచి కూడా వారికి శ్రీముఖాలు అందుతున్నాయి. వారిలో పలువురు తెలుగు రాజకీయ ప్రముఖులు ఉన్నట్టు తెలుస్తోంది! దుబాయి అంటే సగటు తెలుగువాడి దృష్టిలో.. రెక్కల కష్టం చేసుకుంటే నాలుగు రాళ్లు సంపాదించిపెట్టే నగరం! కానీ కొందరు రాజకీయ నాయకులకు అదొక భూతల స్వర్గం. రాజకీయాల్లో సంపాదించిన అవినీతి సొమ్ముతో స్థిరాస్తులు కొనుగోలు చేస్తూ సాఫీగా అద్దె ఆదాయాన్ని సృష్టించుకొనే సులువైన మార్గం. ఏ హైదరాబాద్‌లోనో.. విజయవాడలోనో.. కూర్చుని ఒప్పందం కుదుర్చుకుని దుబాయిలో స్థిరాస్తి కొనుగోలు చేస్తే చాలు! పెట్టిన పెట్టుబడిపై సంవత్సరానికి 10-15 శాతం అద్దె రూపంలో వస్తుంటుంది. అసలు ఆ సంపాదన ఆదాయపన్ను శాఖ దృష్టిలోకే రాదు కాబట్టి.. దాన్ని రిటర్నుల్లో చూపించనక్కర్లేదు! అలా చూపించరు కాబట్టి దానిపై పన్ను కట్టాల్సిన పనీ ఉండదు!! పైగా దుబాయి, ఇతర అరబ్ ఎమిరేట్లు.. అన్నీ మనదేశానికి కేవలం 3-4 గంటల విమాన ప్రయాణ దూరంలోనే ఉంటాయి కాబట్టి ఎప్పుడు కావాలంటే అప్పుడు రాకపోకలు సాగించవచ్చు!! అన్ని వ్యవహారాలూ చక్కబెట్టుకురావొచ్చు. ఇన్ని వెసులుబాట్లు ఉన్నాయి కాబట్టే.. అవినీతిపరులైన కొందరు భారతీయ రాజకీయ నాయకులు, అత్యంత సంపన్నులు ఇటీవలికాలంలో దుబాయి, ఇతర ఎమిరేట్లలో స్థిరాస్తులు కొనుగోలు చేస్తున్నారు. పుట్టినరోజు వేడుకలు, ఇతర శుభకార్యాలు జరుపుకోవడానికి ఆయా నగరాలకు క్యూ కడుతున్నారు. దుబాయిలో కొత్తగా కడుతున్న ఏ అపార్ట్‌మెంటులోనైనా ఫ్లాట్లు కొంటున్నవారిలో సగానికి పైగా భారతీయులే ఉండడం ఇందుకు నిదర్శనం. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. కొనుగోలుదారులలో ఎక్కువ మంది రాజకీయ నాయకులు ఉండడం గమనార్హం.

చట్టం ఏం చెప్తోంది?

మన చట్టాల ప్రకారం.. భారతీయులు ప్రపంచంలో ఎక్కడయినా స్థిరాస్తులు కొనుగోలు చేయవచ్చు. పెట్టుబడులు పెట్టవచ్చు. అయితే ఆయా లావాదేవీలను విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం 2022కు (ఫెమా-విదేశీ పెట్టుబడులు) అనుగుణంగా మాత్రమే నిర్వహించాలి. ఆ చట్టం ప్రకారం.. విదేశాలలో పెట్టుబడులు పెట్టడానికి, స్థిరాస్తులు కొనుగోలు చేయడానికి రిజర్వు బ్యాంకు అనుమతి అవసరం. వార్షిక ఆదాయపు పన్ను నివేదికలో (ఐ.టి.ఆర్)లో విదేశీ ఆస్తులు, ఆదాయం గురించి వెల్లడించడం తప్పనిసరి. లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద.. భారతదేశం నుండి గరిష్ఠంగా ఒక వ్యక్తి సంవత్సరానికి రెండున్నర లక్షల డాలర్లు అంటే.. దాదాపుగా రూ.2.1 కోట్లు మాత్రమే విదేశాలకు బదిలీ చేయడానికి అనుమతి ఉంటుంది. అది కూడా.. అధీకృత బ్యాంకుల ద్వారా, అన్ని పత్రాలూ సమర్పించి మాత్రమే ఆ లావాదేవీలను నిర్వహించాల్సి ఉంటుంది. దీన్ని ఉల్లంఘించి ఎవరైనా విదేశాలలో ఆస్తి కొనుగోలు చేస్తే.. మొత్తం ఆస్తి విలువకు మూడు రెట్ల దాకా జరిమానా విధిస్తారు. కానీ, చాలా మంది ఆ నిబంధనలను తెలివిగా ఉల్లంఘించి క్రిప్టో నగదుతో రూ.కోట్ల విలువైన ఆస్తులను దుబాయిలో కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు మొత్తం డబ్బును హైదరాబాద్‌లో నగదు రూపంలో చెల్లించేసి.. ఏలాంటి అధికారిక చెల్లింపులూ చేయకుండా దుబాయిలో ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు. తద్వారా.. బ్యాంకింగ్, నగదుమార్పిడి చార్జీల నుంచి, భారత ప్రభుత్వం విధిస్తున్న క్రిప్టో లావాదేవీల పన్ను నుంచి తప్పించుకుంటున్నారు.

ఒప్పందాల్లో లేకున్నా..

యూఏఈ-భారత ద్వైపాక్షిక ఒప్పందాల ప్రకారం.. ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడుల వివరాలు మాత్రమే ఇరు దేశాలూ ఇచ్చిపుచ్చుకొంటాయి. స్థిరాస్తుల కొనుగోళ్ల వివరాలు ఇవ్వాలన్న నిబంధన అందులో లేదు. అంటే.. ఒక భారతీయుడు దుబాయిలో ఏదైనా బ్యాంక్ ఖాతా తెరిచినా, లేక స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టినా ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం యూఏఈ ఆ వివరాలను మాత్రమే భారత అధికారులకు అందజేస్తుంది. మనవాళ్లు అక్కడ కొనుగోలు చేసే ఆస్తుల వివరాలు ఇవ్వదు. ఈ క్రమంలోనే.. చాలామంది భారతీయులు దుబాయి, ఇతర ఎమిరేట్లలో స్థిరాస్తులు కొంటూ స్వదేశంలో ఆదాయపు పన్ను అధికారుల కళ్లు కప్పుతున్నారని గుర్తించిన ఆదాయపన్ను శాఖ రహస్యంగా వారి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. వారిలో రాజకీయ నాయకులు.. అందునా తెలుగువారు కూడా ఉన్నట్టు తేలడంతో ఏం జరుగుతుందోనన్న ఆసక్తి నెలకొంది.

కేంద్రం కోర్టులో బనకచర్ల!

» తెలంగాణ అభ్యంతరంతో పీటముడి

» కేంద్రంతో చర్చలకు 14న ఢిల్లీకి సీఎం

» బనకచర్ల ఆవశ్యకతపై ఢిల్లీ పెద్దలకు నివేదిక

» 18న పోలవరంపై జలశక్తి సంఘం సమీక్ష

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలవరం- బనకచర్ల అనుసంధాన పథకంపై పడిన పీటముడిని విడదీయడానికి ఈ నెల 14న సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళుతున్నారు. ఈ పర్యటనలో ఆయన బనకచర్లపై కేంద్రానికి నివేదిక అందిస్తారు. కేంద్ర పెద్దలను కలసి ఈ అంశంపై చర్చించనున్నారు. సముద్రంలోకి వెళ్లే గోదావరి వరద జలాల్లో 200 టీఎంసీలను మాత్రమే బనకచర్ల పథకానికి వినియోగిస్తామని స్పష్టంచేయనున్నారు. సీఎం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ పథకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. నదీ జలాల పంపకాల విషయాన్ని సామరస్యంగా పరిష్కరించుకుందామంటూ రాష్ట్ర విభజన జరిగిన నాటినుంచీ చంద్రబాబు సూచిస్తూనే ఉన్నారు. 2016 సెప్టెంబరు 5న అప్పటి జలశక్తి మంత్రి ఉమాభారతి నేతృత్వంలో, నాటి తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం చంద్రబాబు మధ్య తొలి అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కృష్ణా- గోదావరి నదీ జలాల పంపకాలపై అవగాహన కుదిరింది. అయినా... బనకచర్లపై వివాదాలు తప్పలేదు.

పోలవరంపై 18న కేంద్రం సమీక్ష

పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌నాటికి పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించిన జల శక్తి సంఘం, ఈ ప్రాజెక్టు ప్రగతిపై 18న సమీక్షించనున్నది. పోలవరం ప్రధాన డ్యామ్ పనులు ఎంతవరకూ జరిగాయనేది జలశక్తి కార్యదర్శి దేబర్షి ముఖర్జీ నాయకత్వంలో పరిశీలించనున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పోలవరం ప్రాజెక్టు ఇంజనీర్ ఇన్ చీఫ్ తదితరులు హాజరుకానున్నారు.

'బనకచర్ల'కు వినియోగించేది

వరద జలాలే

» రాష్ట్ర జల వనరుల శాఖకు వాప్కోస్ నివేదిక

పోలవరం- బనకచర్ల రెగ్యులేటర్ అనుసంధన పథకానికి వినియోగించే 200 టీఎంసీలు గోదావరి వరద జలాలేనని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ వాప్కోస్ గణాంకాలతో సహా తేల్చి చెప్పింది. నదీ జలాల కేటాయింపులు, ట్రిబ్యునల్ ఆదేశాలు తదితర అంశాలు పరిశీలించిన తర్వాత రూపొందించిన సమగ్ర నివేదికను గురువారం రాత్రి రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావుకు అందజేసింది. ఈ నివేదికను క్షుణ్ణంగా అధ్యయనం చేసే బాధ్యతలను ఆయన ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించారు. వాప్కోస్ నివేదికపై జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్‌తో చర్చించాలని భావించారు. అయితే సీఎం చంద్రబాబుతో ఆయన సమావేశమైన నేపథ్యంలో అది సాధ్యపడలేదు. ఇంజనీరింగ్ అధికారుల అధ్యయనం పూర్తయిన తర్వాత శుక్రవారం సాయిప్రసాద్ ఈ నివేదికపై తన అభిప్రాయాన్ని చెప్పనున్నారు. తర్వాత దీనిని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు, కేంద్ర జల సంఘానికి పంపుతారు.

బెట్టింగ్ యాప్‌లకు వివాహిత బలి

» ఉరి వేసుకొని బలవన్మరణం.. ఆమె స్వస్థలం పాలకొల్లు



అనూష(ఫైల్)

హైదర్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెట్టి మోసపోయి మనస్తాపానికి గురైన వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాలకొల్లుకు చెందిన బోడపాటి జోగయ్య కుమార్తె గంగ అనూష(27)కు ఐదేళ్ల క్రితం ఆమె బావ కోయే వెంకన్న బాబుతో వివాహం జరిగింది. ఉద్యోగ రీత్యా దపంతులు కొంతకాలంగా కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తులసీనగర్‌లో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి 10.30గంటల సమయంలో అనూష ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అనూష బెట్టింగ్‌యాప్‌లో మొదట రూ.100 పెట్టుబడి పెట్టి లాభం రావడంతో లక్షల పెట్టుబడి పెట్టింది. తర్వాత వాటిని రాబట్టుకునేందుకు భర్తకు తెలియకుండా బంగారం తాకట్టుపెట్టింది. ఆ డబ్బులు కూడా నష్టపోవడంతో ఇంట్లో తెలిస్తే ఏమైనా అంటారనే భయంతో ఆత్మహత్య చేసుకుంది.

బెట్టింగ్ యాప్స్ సెలబ్రిటీలపై రంగంలోకి ఈడీ!

» 29 మంది సినీ, సోషల్ మీడియా ప్రముఖులపై కేసు

హైదరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌ల కేసులో ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. 29 మంది సినీ, సోషల్ మీడియా సెలబ్రిటీల మీద, నాలుగు కంపెనీల మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు(ఈసీఐఆర్) నమోదు చేశారు. దర్యాప్తు ప్రారంభించారు. ఈడీ జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్ నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌లోని పంజాగుట్ట, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మియాపూర్, సూర్యాపేట, విశాఖపట్నం తదితర పోలీసు స్టేషన్లలో నమోదైన ఐదు కేసుల ఆధారంగా 29 మందిపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది. సినీ రంగానికి చెందిన విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, మంచులక్ష్మి, ప్రణీత, నిధిఅగర్వాల్, అనన్య నాగళ్ల, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సిరి హన్మంతు, శ్రీముఖి, వర్షిణి సౌందర్‌రాజన్, వాసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృతా చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పాండు, పద్మావతి, ఇమ్రాన్ ఖాన్, విష్ణు ప్రియ, హర్షసాయి, భయ్యా సన్నీ యాదవ్, శ్యామల, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బడారు సుప్రీత, కిరణ్‌గౌడ్, అజయ్, సన్నీ, సుధీర్ లోకల్ బాయ్ నానీతో పాటు బెట్టింగ్ యాప్ ఆపరేటర్ల పేర్లను ఈసీఐఆర్‌లో ఈడీ పేర్కొంది. కాగా, ఈడీ కేసుపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ స్పందించారు. "2017లో నేను, రానా రమ్మీ గేమ్ యాప్‌నకు ప్రచారం చేశాం. అప్పుడు అది బెట్టింగ్ యాప్ కాదు. రెన్యువల్ సమయంలో నేను ప్రచారం చేయనని చెప్పాను. తర్వాత దాన్ని కొనసాగించలేదు. మేం ప్రచారం చేసిన కంపెనీ ఆ యాప్‌ను మరో కంపెనీకి విక్రయించింది. ప్రస్తుతం నాకు ఎలాంటి నోటీసులు రాలేదు" అన్నారు.

రెవెన్యూ మాన్యువల్స్ సిద్ధం

» అధికారులు, ప్రజలకు అందుబాటులోకి

» సుదీర్ఘ ప్రయత్నం ఫలించింది: రెవెన్యూశాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

భూముల చట్టాలు, వాటికి సంబంధించిన నియమ నిబంధనలను క్రోడీకరించి ఒకే వేదికపైకి తీసుకురావాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించాయి. సుదీర్ఘ కసరత్తు తర్వాత రెవెన్యూ మాన్యువల్స్ సిద్ధమయ్యాయి. వీటిని అంశాల వారీగా క్రోడీకరించి.. ప్రభుత్వానికి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది రెవెన్యూశాఖ. సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో వీటిని అప్‌లోడ్ చేసింది. ప్రజలు ఎప్పుడంటే అప్పుడు ఆన్‌లైన్‌లో వీటిని పరిశీలించేలా ఏర్పాట్లు చేసింది. భూ పరిపాలనా ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) జి.జయలక్ష్మి, అదనపు కమిషనర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి వీటిని రూపొందించారు. ఈ పరిణామం రెవెన్యూ చరిత్రలో తొలి కీలకఘట్టమని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.

150 ఏళ్ల చరిత్ర ఉన్న వ్యవస్థ..

150 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన రెవెన్యూ వ్యవస్థ ఇప్పటికీ ఓ పట్టాన ప్రజలకు అర్థం కాదు. బ్రిటీషుకాలం నాటి రెవెన్యూ చట్టాలు ఇంకా అమల్లో ఉన్నాయి. భూమి చట్టాలు, వాటి అమలును నిర్దేశించే నియమ నిబంధనలు, జీవోలు, మెమోలు, పలు భూ వివాదాలపై న్యాయస్థానాల తీర్పులు.. తదితర సమాచారం ఏదీ ప్రజలకు అందుబాటులో లేదు. ఇతర ప్రభుత్వ శాఖలకు ఈ సమాచారం కావాలంటే రెవెన్యూపైనే ఆధారపడాలి. ఏ చట్టంతో ఏం ఉపయోగం? రూల్స్ ఏం చెబుతున్నాయి? దరఖాస్తు చేసుకున్న ఎన్ని రోజుల్లో రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి? రెవెన్యూ సేవలను పారదర్శకంగా ఎలా చేపట్టాలో తదితర అనేక రూల్స్ ఉన్నాయి. అవి అమలవుతున్నాయా? లేదా అన్న పరిశీలన కూడా పెద్దగా జరగట్లేదు. ప్రభుత్వ, ఇనాం, ఎస్టేట్, అసైన్‌మెంట్, చుక్కల, పోరంబోకు, షరతుగల భూములు, ఇంకా గ్రామకంఠాలపై ఉన్న చట్టాలు, నిబంధనలు రెవెన్యూశాఖ దగ్గర ప్రజలకు అందుబాటులో లేవు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చి, రెవెన్యూ చట్టాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీఎం చంద్రబాబు గతేడాది ఆగస్టులో రెవెన్యూశాఖకు దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం అదనపు సీసీఎల్ఏ ఎన్. ప్రభాకర్‌రెడ్డి ఛైర్మన్‌గా రెవెన్యూ మాన్యువల్ తయారీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అధ్యయనం చేసి, అన్నింటినీ క్రోడీకరించి రెవెన్యూ మాన్యువల్స్‌ను తయారు చేసింది. వాటిని సీసీఎల్ఏ వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఏమేమి ఉంటాయంటే..?


కీలకమైన రెవెన్యూ చట్టాలు, వాటి రూల్స్, అమలుకు సంబంధించి ప్రభుత్వం వివిధ సందర్భాల్లో జారీ చేసిన ఉత్తర్వులు, ఇంకా ఆయా చట్టాల అమలుపై కలెక్టర్లు, ఇతరులు లేవనెత్తిన అభ్యంతరాలు, సందేహాలపై వివరణలు ఇస్తూ సీసీఎల్ఏ ఇచ్చిన సర్క్యులర్లను కూడా రెవెన్యూ మాన్యువల్స్‌లో పొందుపరిచారు. ఏపీ భూ కేటాయింపుల విధానం, ఇనాం, ఎస్టేట్ భూముల చట్టాల రద్దు, ఆ తర్వాత వాటి సెటిల్‌మెంట్ కోసం ఇచ్చిన రూల్స్‌ను తెలియజేసే అంశాలు, ఏపీ అసైన్‌మెంట్ చట్టం-1977(పీఓటీ), రెవెన్యూ విజిలెన్స్, బడ్జెట్, రెవెన్యూ పరిపాలన, ఉద్యోగుల సర్వీసు అంశాలు, పెన్షన్‌లు, జిల్లాల పునర్విభజన, రెవెన్యూ డివిజన్‌లు, మండలాల పునర్వ్యవస్థీకరణ, చుక్కల భూముల చట్టం, రూల్స్ తదితరాలనూ మాన్యువల్స్‌లో పొందుపరిచారు.

ఎలా పొందాలంటే..?

సీసీఎల్ఏ. ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌ను ఓపెన్‌చేసి జీఓస్, సర్క్యులర్, మెమోస్, యాక్ట్స్, రూల్స్, బుక్స్ అనే అంశాల కింద కావాల్సిన సమాచారాన్ని ఒక్క క్లిక్ ద్వారా పొందవచ్చు. భూ వివాదాలు, సమస్యలకు పరిష్కారం చూపే చట్టాలతోపాటు ప్రభుత్వం ఆయా సందర్భాల్లో జారీ చేసిన కీలకమైన జీవోలను కూడా ఈ మాన్యువల్స్ ద్వారా వీక్షించే అవకాశం ఉంది. దీనికి ఆధునిక సాంకేతికతనూ జోడించాలని కూడా రెవెన్యూశాఖ ప్రయత్నాలు చేస్తోంది. ఛాట్‌బోట్ విధానం తీసుకురాబోతోంది. ఇది అమల్లోకి వస్తే గూగుల్ జెమినీ, లేదా చాట్‌జీపీటీలో ఎలాగైతే డేటా సెర్చ్‌చేస్తే ఫీడ్‌బ్యాక్ వస్తుందో, రెవెన్యూ చాట్‌బోట్‌లోనూ అదే స్థాయిలో ఫీడ్‌బ్యాక్ వచ్చేలా ఏర్పాట్లుచేస్తున్నట్టు అదనపు సీసీఎల్ఏ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ప్రజలకు రెవెన్యూడేటాను ఒకే వేదికగా అందించాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు సుదీర్ఘ కసరత్తు ద్వారా ఫలించాయన్నారు.

ఎన్‌డీఏ అజెండా అమలుకు కృషి

» క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం: బీజేపీ చీఫ్ మాధవ్



కాకినాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్‌డీఏ అజెండా పటిష్ఠ అమలుకు తన వంతు కృషి చేస్తానని బీజేపీ అధ్యక్షుడు మాధవ్ అన్నారు. గురువారం ఆయన కాకినాడ, పిఠాపురంలలో పర్యటించారు. పిఠాపురంలో దత్తాత్రేయస్వామి, పురూహూతికా అమ్మవారు, రాజరాజేశ్వరిదేవి, కుక్కుటేశ్వరస్వామిలను దర్శించుకున్నామన్నారు. కాకినాడకు చెందిన ప్రవచన చక్రవర్తి, రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కాకినాడలోని పలువురు సీనియర్ నేతలను కలిశారు. బీజేపీ సీనియర్ నేత పైడా భావన ప్రసాద్ ఇంట మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా సనాతన ధర్మంపై స్పష్టంగా గట్టిగా మాట్లాడుతున్న నాయకుడు పవన్‌కల్యాణేనని ఆయన కొనియాడారు. దేశంలోనే ఏపీని నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. 'రాష్ట్రంలో పోలవరానికి సంబంధించి రూ.13వేల కోట్లు, అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు ప్యాకేజీ.. ఇలా అనేక ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా నిధులు ఇస్తూ కేంద్రప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోంది. దేశంలో అత్యధిక రోడ్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. అనేక కొత్త విమానాశ్రయాలు, పోర్టులు, పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి. 11 ఏళ్ల మోదీ పాలనలో చేసిన అనేక అద్భుత విజయాలను ప్రజల్లోకి తీసుకువెళతాం. చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్ కూటమి స్ఫూర్తితో ముందుకు వెళతాం' అని మాధవ్ తెలిపారు. క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని బీజేపీ చీఫ్ అన్నారు.

బీఐఎస్ గుర్తింపున్న ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు

» ఇండస్ట్రీస్ మీట్‌లో పరిశ్రమలశాఖ ఏడీ

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) నుంచి క్వాలిటీ సర్టిఫికెట్స్ తీసుకునే ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని పరిశ్రమలశాఖ అడిషనల్ డైరెక్టర్ ఎ.రామలింగేశ్వరరాజు తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు సంబంధించిన ప్రతి సర్టిఫికెట్‌కూ సబ్సిడీలు ఉన్నాయని వివరించారు. ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో బీఐఎస్ విజయవాడ శాఖ గురువారం విజయవాడలో 'ఇండస్ట్రీస్ మీట్' నిర్వహించింది. ఎంఎస్ఎంఈల ఉత్పత్తులలో నాణ్యత ప్రమాణాలపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు.



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు



పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్. భోజనం చేసిన తర్వాత తనది, తన తండ్రి తిన్న ప్లేట్లను తీస్తున్న మంత్రి లోకేశ్


నలుగురు పిల్లలకు తల్లికి వందనం అందుకున్న మాధవి, ఆమె పిల్లలతో చంద్రబాబు, లోకేశ్

గురువుల గౌరవం పెంచుతాం

(మొదటి పేజీ తరువాయి)

మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఇక్కడ ఉందన్నారు. "ఆర్థిక ఇబ్బందులతోపాటు అనేక సవాళ్లు ఉన్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.10లక్షల కోట్లు అప్పులు చేశారు. ఆ అప్పులకు వడ్డీలు కూడా కట్టాలి. అయినా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా. ఎన్ని కష్టాలు ఎదురైనా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసితీరుతాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి రాత్రింబవళ్లు పనిచేస్తున్నామని తెలిపారు. విద్యాశాఖను లోకేశ్ అద్భుతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన మెగా పీటీఎం గిన్నిస్ రికార్డు సృష్టిస్తోందన్నారు. 2.28 కోట్ల మంది మెగా పీటీఎంలో భాగస్వాములయ్యారని తెలిపారు. "పీటీఎం కమిటీ నా కల. ఉమ్మడి ఏపీలో 1998లో పేరెంట్ కమిటీలు ఏర్పాటు చేశాను. లోకేశ్ ఈ కమిటీలను మరో ఎత్తుకు తీసుకువెళ్లారు. పాఠశాల పవిత్ర దేవాలయం మాత్రమే కాదు.. అవి ఆధునిక దేవాలయాలు కూడా. ఏ విద్యార్థీ తనకు చదువు చెప్పిన టీచర్‌ను మరిచిపోడు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎకరా భూమి కొనిద్దామని కష్టపడుతూ, పిల్లల పర్యవేక్షణను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ విధానం మంచిది కాదు" అని హితవు పలికారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

తల్లి పర్యవేక్షణలోనే లోకేశ్ చదువు..

"నేను 1978లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యాను. ఆ తర్వాత మంత్రి, ముఖ్యమంత్రిని కూడా అయ్యాను. ఆనాడు నా కుమారుడు లోకేశ్ చదువుతున్న స్కూల్, కాలేజీ పేరెంట్ మీట్‌లకు వెళ్లలేకపోయాను. నా భార్య భువనేశ్వరి అన్ని మీట్‌లకు వెళ్లేవారు. లోకేశ్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదివేవరకూ ఆయన విషయాలు ఆమె ఒక్కరే పట్టించుకునేవారు. నా చిన్నప్పుడు మా అమ్మ కూడా ఇలాగే ఉండేవారు. చిన్నప్పుడు ఆరు కిలోమీటర్లు నడిచి బడికి వెళ్లాను. మా అమ్మ కట్టించిన క్యారియర్ తీసుకొని వాగులు, వంకలు దాటుకొని వెళ్లి క్లాసులకు హాజరయ్యేవాడిని."

ప్రభుత్వ బడిలో నో వేకెన్సీ బోర్డు.. గర్వకారణం

"నేను మహిళా పక్షపాతిని. అన్ని కార్యక్రమాలు ఆడ బిడ్డలకే చేశాను. డ్వాక్రా సంఘాలు పెట్టి వారికి పొదుపు ఉద్యమం నేర్పించాను. నేను ఉమ్మడి ఏపీలో సీఎంగా ఉన్నప్పుడు ఆడ బిడ్డల పట్ల కుటుంబాల్లో వివక్ష ఉండేది. మగ పిల్లవాణ్ణి చదివిస్తే, వాడే కుటుంబాన్ని చూసుకుంటాడని భావించేవారు. ఆడపిల్లకు వీలైనంత త్వరగా పెళ్లి చేసి పంపే పరిస్థితి ఉండేది. అందుకే ఆడబిడ్డల సంరక్షణ పథకం తీసుకువచ్చి, రూ.5వేలు జమ చేసి, ఆ డబ్బులను ఆడబిడ్డలు పెద్ద అయిన తర్వాత ఉపయోగించుకునేలా నేను అప్పట్లో ఏర్పాటుచేశాను. ఇప్పుడు మా ప్రభుత్వం తల్లికి వందనం పథకంతోపాటు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత తీసుకుంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. నెల్లూరులోని ఒక ప్రభుత్వ స్కూల్‌లో నో వెకెన్సీ బోర్డు పెట్టడాన్ని చూసి గర్వపడ్డా.. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలతో పోలిస్తే... ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థవంతమైన టీచర్లు ఉన్నారు. గత ప్రభుత్వంలో పుస్తకాలు, బ్యాగ్‌లపై తమ బొమ్మలు వైసీపీ నేతలు వేసుకున్నారు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. గంజాయికి విద్యార్థులు దూరంగా ఉండాలి. ఈ విషయాన్ని ఆషామాషీగా తీసుకోవద్దు."

> "గ్రామంలోని చిన్న ఆలయాన్ని ఊరంతా కలిసి కాపాడుకుంటుంది. పూజలు చేసి, భక్తి భావంతో గ్రామాన్ని కాపాడాలని గ్రామ దేవతను ప్రార్థిస్తుంది. అలాగే, ప్రభుత్వ పాఠశాలలను కూడా కాపాడుకోవాలి. మన పిల్లలను తీర్చిదిద్ది, జ్ఞానాన్ని ప్రసాదించే పుణ్యక్షేత్రాలు అవి. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఒకనాడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, ఉన్నత స్థితికి చేరిన వారంతా, తాము చదువుకున్న పాఠశాలలకు చేయూతను ఇవ్వాలి. ఈ స్ఫూర్తిని తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల్లో నింపడమే పీటీఎం 2.0 లక్ష్యం."
>
> - సీఎం చంద్రబాబు

12 సార్లు డీఎస్సీ నిర్వహించాం..

'వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్‌ను కూడా నియమించకుండా, విద్యా సంస్కరణలు చేశామని ప్రచారం చేసుకున్నారు. టీచర్లు లేకుండా సంస్కరణలు ఎలావస్తాయి? తామే ఇంగ్లిష్ మీడియం పెట్టామని గొప్పలు చెప్పుకున్నారు. మరుగుదొడ్ల ఫొటోలు తీసి పంపించాలని టీచర్లపై ఒత్తిడి పెంచారు. కానీ మా ప్రభుత్వం గురువులకు గౌరవం పెంచుతుంది. సీఎం హోదాలో ఇప్పటివరకు 12 డీఎస్సీల ద్వారా 1.66 లక్షల మంది టీచర్లను నియమించాను. గతంలో విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ఇచ్చేవాళ్లం. రాబోవు రోజుల్లో ప్రతిభా అవార్డుల పథకాన్ని షైనింగ్ స్టార్స్‌కు వర్తింపజేసేలా విద్యాశాఖ యంత్రాంగం ప్రణాళికలు రూపొందించాలి" అని చంద్రబాబు ఆదేశించారు.

పాఠం చెప్పిన సీఎం చంద్రబాబు

- విద్యార్థిగా మారిన విద్యా మంత్రి
- విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం...
- తండ్రి కంచం తీసిన లోకేశ్
- విద్యార్థులు, తల్లులతో ముఖాముఖి

పుట్టపర్తి/ కొత్తచెరువు, జూలై10(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా గడిపే ముఖ్యమంత్రి చంద్రబాబు టీచరు అవతారం ఎత్తారు. కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. అదే తరగతి గదిలో విద్యార్థులతో కలిసి విద్యాశాఖ మంత్రి లోకేశ్ కూర్చుని ఆ పాఠాలు ఆలకించారు. 'వనరులు' అనే పాఠ్యాంశాన్ని సీఎం బోధిస్తుంటే, విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. అనంతరం వారికి ఏమాత్రం పాఠం అర్థమయిందో తెలుసుకునేందుకు ప్రశ్నలు వేసి ఆయన సమాధానాలు రాబట్టారు. అనంతరం పలువురు విద్యార్థుల ప్రోగ్రెస్ రికార్డులను సీఎం, మంత్రి పరిశీలించారు. మెగా పీటీఎం ముగిసిన అనంతరం చంద్రబాబు, లోకేశ్ పాఠశాల ఆవరణలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. అనంతరం తన తండ్రి ప్లేటు, తన ప్లేటు లోకేశ్ స్వయంగా తీశారు. అంతకుముందు.. పుట్టపర్తి విమానాశ్రయం నుంచి కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలకు చంద్రబాబు బస్సులో చేరుకున్నారు. ఆయన బస్సు దిగగానే లోకేశ్ వెళ్లి పాదాభివందనం చేశారు. కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులతో చంద్రబాబు, లోకేశ్ ఇష్టాగోష్ఠి నిర్వహించారు. విద్యార్థి మణికొండ సూర్యతేజ తాను చంద్రబాబుపై రాసిన కవితను చదివి వినిపించారు. విద్యార్థులతో ముఖాముఖీ సాగిందిలా..

సీఎం: ఎలా చదువుతున్నారు..? ఉపాధ్యాయులు పాఠాలు చక్కగా బోధిస్తున్నారా..?

విద్యార్థులు: బాగా చెబుతున్నారు. మంచి మార్కులు తెచ్చుకుంటున్నాం.

సీఎం: భవిష్యత్తులో మీరు ఏమవుతారు?

విద్యార్థులు: బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులం కావాలనుకుంటున్నాం సర్.

లోకేశ్ గురించి తండ్రి మాట..

'పిల్లలూ మీరు స్కూల్‌కు డుమ్మా కొడితే.. తల్లిదండ్రులకు తెలిసిపోతుంది. పిల్లలను చదివించడంలో లోకేశ్ కఠినంగా ఉంటారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలనే ఆయన విద్యాశాఖ తీసుకున్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి.. ఆగస్టులోపు కొత్త టీచర్లను స్కూల్స్‌కు పంపే బాధ్యత తీసుకున్నారు. నేను ఉమ్మడి ఏపీలో తీసుకొచ్చిన పేరెంట్ కమిటీలను లోకేశ్ మరో ఎత్తుకు తీసుకెళ్లారు' అని సీఎం అన్నారు.

నా పేరెంట్ మీట్‌కు నాన్న వచ్చేవారు కాదు..

- సీఎంగా మీ పిల్లల కోసం వచ్చారు: లోకేశ్

తాను చదువుకునే రోజుల్లో పేరెంట్ మీట్‌కు తన తండ్రి చంద్రబాబు వచ్చేవారు కాదని, తన తల్లే అన్నీ చూసుకునేవారని మంత్రి లోకేశ్ గుర్తు చేసుకున్నారు. "ఇప్పుడు నా కుమారుడు దేవాన్ష్ పేరెంట్ మీట్‌కు నేను వెళ్లలేని పరిస్థితి. నా భార్య బ్రాహ్మణి అన్నింటికీ వెళుతున్నారు. కానీ మీ పిల్లల పేరెంట్ మీట్‌కు సాక్షాత్తు ముఖ్యమంత్రి హాజరయ్యారు. పిల్లల భవిష్యత్తుకు ఆయన ఇచ్చే ప్రాధాన్యతకు ఇదే నిదర్శనం" అని లోకేశ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు పండుగ వాతావరణంలో పేరెంట్ మీట్ జరుగుతోందని సంతోషం వ్యక్తంచేశారు.

పవన్ అన్న సవాల్ స్వీకరిస్తున్నా..

తనకు సోదర సమానులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోటి మొక్కలు నాటాలంటూ ఇచ్చిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని లోకేశ్ వ్యాఖ్యానించారు. విద్యాశాఖ ద్వారా కోటి మొక్కలు నాటించి, మూడేళ్ల వాటిని పెంచే బాధ్యత విద్యార్థులు తీసుకుంటారన్నారు. మొక్కలు పెంచడమనేది పవిత్రమైన బాధ్యత అని, అందువల్లే పిల్లలకు గ్రీన్‌పాస్‌పోర్టు ఇస్తున్నామని లోకేశ్ వివరించారు. 'మంగళగిరిలో ఓటమితో తొలుత బాధ, ఆవేదన కలిగినా.. చివరకు ఆ ఘటన నాలో కసి పెంచింది. ప్రతిపక్షంలో ఉంటూ, ఐదేళ్ల పాటు మంగళగిరిలోనే పనిచేసి... గతఎన్నికల్లో అఖండ మెజార్టీతో ఆ స్థానం గెలుచుకున్నాను' అని విద్యార్థులకు లోకేశ్ వివరించారు. ఒక సబ్జెక్టులో మార్కులు తక్కువ వచ్చాయని, ఒక సబ్జెక్టు ఫెయిల్ అయినందుకు కొందరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. అలా కాకుండా ఉండాలనే తన ఫెయిల్యూర్ స్టోరీ వివరించానని చెప్పారు.

వేడుకగా బడి పండుగ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్) కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్- టీచర్స్ సమావేశాలు(పీటీఎం 2.0) విజయవంతమయ్యాయి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 60 వేల పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో పండుగ వాతావరణంలో పీటీఎంలు జరిగాయి. ఈసారి ప్రైవేటు విద్యా సంస్థలు కూడా మెగా పీటీఎంకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చాయి. ఈ కార్యక్రమాల్లో తల్లిదండ్రులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలు, దాతలు, పూర్వవిద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దాదాపు 2.28 కోట్ల మంది మెగా పీటీఎంలో పాల్గొంటారని అంచనా వేయగా భారీగా హాజరు నమోదైందని అధికార వర్గాలు తెలిపాయి. లీప్ యాప్ సర్వర్ డౌన్ కావడంతో పాల్గొన్నవారి పేర్ల నమోదులో జాప్యం ఏర్పడింది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, మిగిలిన జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పీటీఎంలలో పాల్గొన్నారు. పలుచోట్ల పెండింగ్‌లో ఉన్న పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈసారి పీటీఎంలో అకడమిక్ అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థి పురోగతిపై తల్లిదండ్రులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. తరగతి టీచర్‌తో తల్లిదండ్రులు వ్యక్తిగతంగా మాట్లాడే అవకాశం కల్పించారు. ఫ్యామిలీ ఫొటో బూత్‌లు ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో మొక్కలు నాటించి వాటిని సంరక్షించే బాధ్యతను అప్పగిస్తూ వారికి గ్రీన్ పాస్‌పోర్టులు జారీ చేశారు. మెగా పీటీఎంల నిర్వహణపై పాఠశాలలకు సంబంధించిన వారితో కాకుండా ఇతరులతో సాక్షి సంతకాలు చేయించడంద్వారా గిన్నిస్ రికార్డు నమోదుకు చర్యలు తీసుకున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల మెగా పీటీఎంలో కేంద్ర మంత్రి రామ్మోహన్, విశాఖపట్నంలోని కేవీఎన్ఎం ఉన్నత పాఠశాలలో ఎంపీ ఎం.శ్రీభరత్, సాలూరు జూనియర్ కళాశాల, మక్కువ ఉన్నత పాఠశాల మెగా పీటీఎంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, బాపట్ల జిల్లా రేపల్లె పాఠశాలలో మంత్రి అనగాని సత్యప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు జూనియర్ కళాశాల, పాఠశాల పీటీఎంలో మంత్రి కందుల దుర్గేశ్ పాల్గొన్నారు.



శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్



రేపల్లెలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్

మీడియాపై దాడి చేస్తే
కఠిన చర్యలు

- న్యూస్ కవరేజ్‌కు వెళ్లినవారిని కొట్టడం హేయం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బంగారుపాళ్యం పర్యటనను కవర్ చేస్తూ, వైసీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన చిత్తూరు జిల్లా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్‌ను అడిగి ఆయన ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన వైద్య పరీక్షలు, అందుతున్న చికిత్స గురించి ఆరా తీశారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. శివకుమార్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు సీఎం ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం శివకుమార్‌పై దాడి ఘటనను ఖండిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చంద్రబాబు పోస్టు చేశారు. 'చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ రౌడీ మూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. విధి నిర్వహణలో భాగంగా న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై తీవ్రస్థాయిలో దాడి చేసి గాయపర్చడం అమానుషం. వైసీపీ నాయకుల ప్రోద్బలంతో దాడి జరిగిన విధానం గురించి శివకుమార్ చెబుతుంటే, చాలా బాధ అనిపించింది. నిజాన్ని నిర్భయంగా రాసే పత్రికలపై, మీడియా ప్రతినిధులపై ఈ తరహా దాడులను క్షమించేది లేదు. బాధిత కుటుంబానికి అండగా ఉంటాం. శివకుమార్‌పై దాడిచేసినవారిపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాను. మీడియా హక్కులను కాపాడే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది." అని చంద్రబాబు స్పష్టం చేశారు. కాగా, శివకుమార్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఫోను చేసి పరామర్శించారు. శివకుమార్ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి, జీడీనెల్లూరు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, టీడీపీ నాయకులు, సీపీఐ నేతలు ఆస్పత్రిలో శివకుమార్‌ను పరామర్శించి.. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



వైసీపీ మూకల చేతిలో గాయపడిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్ సీఎం చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడుతున్న దృశ్యం

పోలీసుల అదుపులో నిందితులు

- నారాయణస్వామి అనుచరుడు సహా ఇద్దరిపై కేసు
- పరారీలో ప్రధాన నిందితుడు ప్రకాశ్ ఆచారి
- తిరుపతి, నెల్లూరుల్లో నిరసన ప్రదర్శనలు

చిత్తూరు, నెల్లూరు వైద్యం, జూలై 10(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో జగన్ పర్యటన సందర్భంగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ను కొట్టిన వైసీపీ కార్యకర్తలను పోలీసులు గుర్తించారు. చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి అనుచరుడు చక్రి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనుచరుడు వినోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై 118(1),115/2,324/4 సెక్షన్ల కింద కేసు పెట్టారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్‌గౌడ అనుచరుడు ప్రకాశ్ ఆచారి దాడికి నాయకత్వం వహించినట్టు గుర్తించారు. అతడు పరారీలో ఉన్నాడు. చంద్ర (పలమనేరు), మోహన్ (జీడీ నెల్లూరు) పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, శివకుమార్‌పై దాడిని నిరసిస్తూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జర్నలిస్టులు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. నెల్లూరులో నిరసన ప్రదర్శన చేశారు.

త్వరలో ఎన్టీఆర్ విదేశీ విద్య!

- హామీ అమలుకు ప్రభుత్వం కసరత్తు

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన 'ఎన్టీఆర్ విదేశీ విద్య' పథకాన్ని తిరిగి అమల్లోకి తెచ్చేందుకు కూటమి సర్కార్ కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల హామీ ప్రకారం దీనికి సంబంధించి త్వరలో విధివిధానాల రూపకల్పన చేయాలని యోచిస్తోంది. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఇప్పటికే విదేశీ విద్యకు సంబంధించి సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వం 2016 నుంచి ఈ పథకాన్ని ప్రారంభించి 4,923 మంది విద్యార్థులకు రూ.364 కోట్లు ఖర్చు చేసింది. విదేశాల్లో ఏ యూనివర్సిటీలో సీట్లు తెచ్చుకున్నా ఈ పథకాన్ని అమలు చేశారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. జగన్ తెచ్చిన కొత్త మార్గదర్శకాల ప్రకారం 200 క్యూఎస్ ర్యాంకింగ్స్ యూనివర్సిటీల్లో సీట్లు పొందిన వారికే ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించిన పర్యావసానంగా.. 10 శాతం మందికే లబ్ధి కలిగింది. చంద్రబాబు హయాంలో 4,923 మందికి విదేశీ విద్య అందిస్తే, జగన్ మూడేళ్ల పాటు ఈ పథకాన్ని నిలిపేసి ఆతర్వాత తాపీగా 213 మందికి మాత్రమే మంజూరు చేశారు.

ఏడాదిలో రెండుసార్లు దరఖాస్తుల ఆహ్వానం!

విదేశీ విద్య పథకాన్ని అమలు చేస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. దీంతో దీని అమలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన రీతిన ఎక్కువ దేశాల్లో చదువుకునేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించాలని, వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన కఠిన నిబంధనలు కాకుండా ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు అర్హత దక్కేలా విధివిధానాలను రూపొందించనున్నారు. ప్రతి ఏటా రెండుసార్లు జూలై, నవంబర్ నెలల్లో దరఖాస్తులు స్వీకరించి.. విదేశాల్లో కొత్త కోర్సులు చదువుకునేందుకు వెళ్లే పేద విద్యార్థులకు ఆర్థిక అండ అందించాలని యోచిస్తున్నారు.

కొత్తచెరువు స్టేడియానికి 2కోట్లు

- మెగా పీటీఎంలో కేటాయించిన సీఎం చంద్రబాబు
- 'అక్షరం అండగా...'తో సమస్యకు పరిష్కారం

కొత్తచెరువు, జూలై 10(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా..' కార్యక్రమం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి దారిచూపింది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రంలోని సత్యసాయి జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 2014లో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి నాటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అప్పట్లో పనులు కూడా ప్రారంభమయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు అటకెక్కాయి. ఈ ఏడాది జనవరి 27న 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమాన్ని కొత్తచెరువులో నిర్వహించింది. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి నిధులు కేటాయించి, పనులు పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డిని స్థానికులు కోరారు. ఈ విషయాన్ని మెగా పీటీఎం 2.0లో పాల్గొనడానికి కొత్తచెరువుకు వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి ఆమె తీసుకెళ్లారు. దీంతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సీఎం తక్షణం రూ.2 కోట్లు మంజూరు చేశారు.




కొత్తచెరువులో అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియం పనులు

కడపలో స్మార్ట్ సెంట్రల్ కిచెన్ రెడీ

- పవన్ సొంత నిధులతో నిర్మాణం
- లోకేశ్ సంస్కరణలకు కచ్చితమైన ఫలితాలంటూ ట్వీట్

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): బడి పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శుభ్రమైన, ఆరోగ్యకర వాతావరణంలో వండించాలనే ఉద్దేశంతో కడపలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో స్మార్ట్ సెంట్రల్ కిచెన్ నిర్మించినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. గత ఏడాది ఆ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి వెళ్లినప్పుడు జిల్లా కలెక్టర్ స్మార్ట్ కిచెన్ ఆలోచన చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ ఆయన ఎక్స్ వేదికగా వీడియో పోస్టు చేశారు. స్మార్ట్ కిచెన్ నిర్మాణానికి తన వ్యక్తిగత నిధులను అందించినట్లు తెలిపారు. ఇప్పుడు అక్కడి నుంచే 12 పాఠశాలలకు ఆహారం సిద్ధమవుతోందని, పోషక విలువలతో, రుచికరమైన ఆహారాన్ని వండివార్చే కుక్స్, సహాయకులను నియమించారని చెప్పారు. ఈ కిచెన్ కచ్చితంగా అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని ఆకాంక్షించారు. కడపలో స్మార్ట్ సెంట్రల్ కిచెన్ నిర్మాణాన్ని పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను ఆయన ఎక్స్ వేదికగా పవన్ అభినందించారు. అలాగే, సీఎం చంద్రబాబు మార్గదర్శకంలో విద్యాశాఖ మంత్రి లోకేశ్ తీసుకొస్తున్న సంస్కరణలు చక్కటి ఫలితాలిస్తాయని కొనియాడారు.


కడప మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లోని స్మార్ట్ సెంట్రల్ కిచెన్

లిక్కర్ స్కామ్‌లో సాయిరెడ్డికి మళ్లీ పిలుపు

» రేపు విచారణకు రావాలని సిట్ నోటీసు

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో విచారణకు రావాలంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 12న విజయవాడలోని పోలీస్ కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సిట్ ఆఫీసుకు ఉదయం 10గంటలకు హాజరుకావాలంటూ బీఎన్ఎస్ఎస్ 179(సాక్షిగా) కింద ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే ఓసారి విజయసాయిరెడ్డిని సిట్ ప్రశ్నించింది.

ఆరోగ్యం బాగాలేదు..తర్వాత వస్తా

» 'సిట్' నోటీసులకు రజత్ భార్గవ స్పందన

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో విచారణకు తర్వాత వస్తానంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ సిట్ అధికారుల నోటీసుకు బదులిచ్చారు. రూ.మూడున్నర వేల కోట్ల కుంభకోణాన్ని వెలికి తీస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్), గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో పనిచేసిన రజత్ భార్గవ పలు ఉల్లంఘనలను అడ్డుకోలేదని గుర్తించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు రావాల్సిందిగా రజత్ భార్గవకు సిట్ అధికారులు నోటీసు ఇచ్చారు. అయితే అనారోగ్యంతో బాధపడుతున్నందున ఇప్పుడు రాలేనని, ఆరోగ్యం మెరుగు పడ్డాక వస్తానంటూ దర్యాప్తు అధికారికి ఆయన ఎస్ఎంఎస్ ద్వారా బదులిచ్చారు.

సొమ్ము మళ్లింపులో మిథున్‌రెడ్డిది కీలకపాత్ర

» హైకోర్టుకు తెలిపిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంతో ప్రభుత్వ ఖజానాకు రూ. 3,500 కోట్ల నష్టం జరిగిందని, ఈ సొమ్మును మళ్లించడంలో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా గురువారం హైకోర్టులో వాదనలు వినిపించారు. ఇలాంటి తీవ్రమైన ఆర్థిక నేరాల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి వీల్లేదన్నారు. ముడుపుల సొమ్ము ఎక్కడికి చేరిందనే విషయాన్ని తేల్చేందుకు పిటిషనర్‌ను కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఉందన్నారు. ముడుపుల ఇచ్చిన కంపెనీలకు మాత్రమే మద్యం సరఫరా ఆర్డర్లు ఇచ్చారన్నారు. యజమానులను బెదిరించి మద్యం ఉత్పత్తి కంపెనీలను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఎంపీ పదవిని దుర్వినియోగం చేశారన్నారు. ఈ అంశాలు పరిగణనలోకి తీసుకొని ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4గంటలులోపు అందజేయాలని ఆదేశించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

విజయవాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అతని స్నేహితుడు చెరుకూరి వెంకటేష్ నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణను ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు వచ్చే వారానికి వాయిదా వేశారు.

జైల్లో వంట చేసుకుంటా.. అనుమతి ఇవ్వండి

» ఏసీబీ కోర్టులో రాజ్ కసిరెడ్డి పిటిషన్

మద్యం కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి భోజన సదుపాయానికి సంబంధించి మరోసారి కోర్టును ఆశ్రయించారు. తనకు జైల్లో వంట చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇంటి నుంచి భోజనం అనుమతించాలని గతంలో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసిన విషయం తెలిసిందే. ఆయన మరోసారి పిటిషన్ దాఖలు చేశారు.

లిక్కర్ డాన్‌లు..



సిరిమల్లెనగర్‌లోని ఇల్లు, అత్తాపూర్, హైదరాబాద్

హైదరాబాద్‌లో ఉమా హిల్ క్రెస్ట్, నిర్మితీస్ అపార్ట్‌మెంట్లు ఖాళీ చేశాక ఓ 2 స్క్వేర్‌కు సమాంతరంగా అత్తాపూర్ ప్రాంతంలో హైదర్‌గూడలోని సిరిమల్లెనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కొత్త డెన్ తెరిచారు. కసిరెడ్డి అనుచరుడు కిరణ్ బంధువు ప్రకాశ్ రెడ్డిని తీసుకొచ్చి అక్కడ పెట్టారు. ఎవరికీ అనుమానం రాకుండా కొన్ని నెలల పాటు అక్కడికి డబ్బులు తీసుకురావడం, తీసుకెళ్లడం చేశారు. బాక్సుల్లో డబ్బులు తీసుకొచ్చినప్పుడు పొరుగువారు ఎవరైనా అడిగితే మార్కెటింగ్ ఏజెన్సీ అని చెప్పేవారు. అక్కడి నుంచి జగన్ సిద్ధం సభల ఖర్చులకు తరలించినట్లు సిట్ గుర్తించింది.

ముడుపుల డెన్‌లు!

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడికి చేరిందో తేల్చారు. వైసీపీ సర్కారులో పెద్దలకు చేరిన వాటాల నుంచి సిద్ధం సభలకు చేసిన ఖర్చు రూ.వందల కోట్ల గుట్టు కనుక్కొన్నారు. మరి కొంత మొత్తం హవాలా మార్గంలో విదేశాలకు చేరినట్టు గుర్తించారు. ఈ స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి డైరెక్షన్‌లో ఆయన అనుచరులు చాణక్య, సైమన్, కిరణ్, సైఫ్, వసంత్ తదితరులు నడిపిన డెన్ల కథా కమామిషు వివరాలు పరిశీలిస్తే..

ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్, తాడేపల్లి, గుంటూరు జిల్లా

తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌కు 150 మీటర్ల దూరంలో ఉండే ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్లో ఒక ఫ్లాట్‌ను 2023 నవంబరులో అద్దెకు తీసుకున్నారు. రాజ్ కసిరెడ్డి అనుచరుడు కిరణ్ స్నేహితుడు ప్రణయ్ ప్రకాశ్‌ను తీసుకొచ్చి అక్కడ పెట్టారు. తిరుపతి నుంచి 'తుడా' వాహనాలు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చెందిన ప్రైవేటు కార్లు, నంబర్ ప్లేట్ లేని ఖరీదైన కార్లు హైదరాబాద్‌కు వెళ్లి డబ్బుల బాక్సులు తీసుకుని తాడేపల్లికి వచ్చేవి. హైదరాబాద్‌లో డెన్ ఉన్న ఓ 2 స్క్వేర్ పక్కనే ఉన్న లాన్సమ్ ఎటానియా సెక్యూరిటీ సిబ్బందితో ఒక ఒప్పందం చేసుకున్నారు. 'ఓ 2 స్క్వేర్‌లోకి కార్లు రావడం, వెళ్లడం రికార్డు అవుతుంది. కాబట్టి మీ బేస్‌మెంట్లోకి మా కారు వచ్చి ఆగుతుంది. ఆ తర్వాత మరో కారు కూడా వస్తుంది. బాక్సులను కారులోకి మార్చేస్తాం. రెండింటి నంబర్లను మీ రిజిస్టర్‌లో నమోదు చేయవద్దు. అందుకు ప్రతిఫలంగా మీకు కొంత డబ్బులిస్తాం' అంటూ మాట్లాడుకున్నారు. ఇలా పొరుగు అపార్ట్‌మెంట్ బేస్‌మెంట్లో వ్యవహారం నడిపించేశారు. తాడేపల్లి డెన్ నుంచి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు వైసీపీ అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల కోసం 250 కోట్ల రూపాయల వరకూ డబ్బులు తరలించినట్లు సిట్ అధికారులు ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. గరికపాడు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భాగంగా చిల్లకల్లు పోలీసులకు పట్టుబడిన 8.37 కోట్ల రూపాయలు కూడా అక్కడి నుంచి వచ్చినవేనని టెక్నికల్‌గా రుజువైనట్లు తెలిసింది.

నిర్మితీస్ ల్యాండ్ మార్క్ ఎమ్మెల్యే కాలనీ, హైదరాబాద్




లిక్కర్ స్కామ్‌లో కర్త, కర్మ, క్రియగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డికి అప్పటికే హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌లో ఈడీ ఎంటర్‌టైన్మెంట్ పేరుతో సినీ ప్రొడక్షన్ ఆఫీసు ఉండేది. నిఖిల్ హీరోగా 'స్పై' అనే సినిమాను ఇదే బ్యానర్‌లో నిర్మించారు. ఉప కార్యాలయంగా బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ రోడ్ నంబర్ 12లో ఆంధ్రా బ్యాంకు పక్కన భవనాన్ని సైమన్ అద్దెకు తీసుకున్నాడు. అప్పటికే ఒక చిన్న సినిమా తీసిన యువ డైరెక్టర్‌కు ప్రతి నెలా కొంత మొత్తం చెల్లిస్తూ మొదటి అంతస్తును సినిమా కార్యాలయంగా తీర్చిదిద్దారు. రెండో అంతస్తులో కథలు రాసుకోవడం, సినిమా ప్రొడక్షన్‌కు సంబంధించిన వ్యవహారాలు నడిపించారు. మూడు, నాలుగు అంతస్తుల్లోకి మద్యం ముడుపులు తెప్పించుకుని ఒక దాంట్లో బాక్సులు భద్రపరిచి, మరో అంతస్తులో సైమన్ తన కుటుంబంతో నివాసం ఉండేవాడు. కొన్ని రోజులకు లిక్కర్ కిక్ బ్యాక్స్ అందుకునే డెన్‌గా డిస్టిలరీ వర్గాల్లో ప్రచారం జరిగింది. దీంతో ఇక్కడ ఎక్కువ కాలం ఉండటం మంచిది కాదని భావించి డెన్‌ను మార్చేశాడు. విశాఖపట్నంలో ఉన్న తన భార్య సోదరుడు మోహన్‌ను రప్పించి ఆ ఇంట్లో పెట్టాడు.

సాయి శ్రీనివాసమ్ అపార్ట్‌మెంట్, ఫిల్మ్‌నగర్, హైదరాబాద్



హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్‌నగర్ రోడ్ నంబర్ 9లో అపోలో ఆసుపత్రి వెనుక వైపు సాయి శ్రీనివాసమ్ అనే అపార్ట్‌మెంట్లోకి సైమన్ డెన్ మార్చేశాడు. ఎక్కువ కాలం అక్కడికే ముడుపులు తెప్పించుకున్నాడు. సైమన్‌కు ఎన్ని పనులున్నా ప్రతి రోజూ డబ్బుల కట్టలతో ఉన్న బాక్సులు తెచ్చి పెట్టడం, రాజ్ కసిరెడ్డికి లెక్క చెప్పడం చేసేవాడు. 2022 చివర్లో అపార్ట్‌మెంట్ వాసులు.. 'ఈ బాక్సులేంటి? మీరు ఎవరు? ఏ వ్యాపారం చేస్తున్నారు' అంటూ ప్రశ్నించారు. దీంతో హైదరాబాద్ శివారులో అర్బన్ గేటెడ్ కమ్యూనిటీలోకి మకాం మార్చేస్తాడు.



ఓ2 స్క్వేర్, నానక్‌రామ్ గూడ, హైదరాబాద్

హైదరాబాద్ శివారులో నానక్‌రామ్ గూడ ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ2 స్క్వేర్ అపార్ట్‌మెంట్‌లోకి సైమన్ మకాం మార్చేశాడు. ఆరో బ్లాక్‌లో సైమన్ కుటుంబం నివాసం ఉంటూ, మొదటి బ్లాక్‌లో డబ్బులు పెట్టేందుకు డెన్ ఏర్పాటు చేసుకున్నాడు. ఏపీ లిక్కర్ స్కామ్ ముడుపులు చేరిన డెన్‌లలో అన్నింటికన్నా ఇదే పెద్దది. విశాఖపట్నానికి చెందిన సైమన్ స్నేహితుడు దొడ్డి నరేంద్రను డెన్‌కు ఇన్‌చార్జిగా పెట్టి నోట్ల కట్టలతో ఉన్న బాక్సులను అపార్ట్‌మెంట్‌లో నింపేశారు. వంట గది, హాలు నరేంద్రకు ఇచ్చి, డబ్బుల బాక్సులు పెట్టిన బెడ్ రూముల తాళాలను సైమన్‌తో పాటు రాజ్ కసిరెడ్డి మరో అనుచరుడు సైఫ్ తమ వద్దే దాచుకునేవారు. తెలంగాణ ఎన్నికల నోటిఫికేషన్ (2023 అక్టోబరు) వెలువడే సమయానికి వందల కోట్ల రూపాయలు అక్కడ నిల్వ ఉంది. ఆ సమయంలో ఏదైనా రైడ్ జరిగితే ఇబ్బందిగా ఉంటుందని భావించి ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని నిర్ణయించారు.



ఉమా హిల్ క్రెస్ట్ అపార్ట్‌మెంట్, ఖాజాగూడ, హైదరాబాద్

వైసీపీ ప్రభుత్వంలో మద్యం ముడుపులు సేకరించేందుకు ఎప్పటికప్పుడు కొత్తగా యువకులను చేర్చుకున్నారు. ఎవరూ ఏ వివరాలూ అడగకుండా రావడం, పని చేయడం, వెళ్లిపోవడం వరకే ఉండాలనేది రాజ్ కసిరెడ్డి ఆలోచన. ఆ మేరకు తిరుపతికి చెందిన రాజ్ కసిరెడ్డి అనుచరుడు కిరణ్ కుమార్ రెడ్డి తన డికార్డ్ లాజిస్టిక్స్‌కు వచ్చే యువకులపై దృష్టి పెట్టాడు. నిరుద్యోగులైన ఉన్నత విద్యావంతుల్ని గుర్తించి సైమన్, వసంత్, అంజన్ తదితరులను హైదరాబాద్‌కు చేర్చాడు. అక్కడ వ్యవహారం నడిపించే క్రమంలో ఖాజాగూడ ప్రాంతంలో రోడ్ నంబర్ 63ఏలోని ఉమా హిల్ క్రెస్ట్ అపార్ట్‌మెంట్లో కిరణ్ మకాం వేశాడు. లిక్కర్ స్కామ్‌లో మరో నిందితుడైన బూనేటి చాణక్య తల్లి పేరుతో ఉన్న ఆ ఇంట్లో గంజాయి, హుక్కా, మద్యం వంటివి ఏర్పాటు చేసి చురుకైన యువకుల్ని తనవైపు తిప్పుకొన్నాడు. పెద్దమ్మ గుడి దగ్గర, జూబ్లీహిల్స్‌లో రోడ్డు పక్కన, వివిధ ప్రాంతాల్లో మద్యం ముడుపులు అందుకునేందుకు వారిని వాహనాల్లో పంపేవాడు. డబ్బుల బాక్సులు తెచ్చి జాగ్రత్తగా ఫ్లాట్‌లోని ఒక రూములో భద్రపరిచి తాళం వేసేవాడు. వారానికి ఒక రోజు రాజ్ కసిరెడ్డి సూచన మేరకు ఎక్కడికి చేర్చాలో అక్కడికి డబ్బు తరలించేవాడు. ముడుపులు తీసుకోవడం, అందజేయడంలో సైమన్‌తో సమన్వయం చేసుకొంటూ 2019 ద్వితీయార్థం నుంచి కొన్ని నెలల పాటు వ్యవహారం నడిపించాడు. కార్లలో అక్కడికి డబ్బుల బాక్సులు తీసుకురావడం, వాటిని లోపలికి తీసుకెళ్లి భద్రపరచడం, తర్వాత మరో కారులో తరలించడం వంటి వాటిపై స్థానికులు ఆరా తీశారు. ఇక్కడుంటే ప్రమాదమని గ్రహించి వెంటనే మరో చోటకు మకాం మార్చేశాడు.

అమ్మో.. సూపర్‌బగ్స్

(మొదటి పేజీ తరువాయి)

రాస్తే, 3-4 రోజులు వాడి, 'జ్వరం తగ్గింది కదా అనవసరంగా మందులు ఎందుకు వాడడం' అనే ఉద్దేశంతో ఆ బిళ్లలు వేసుకోవడం ఆపేస్తారు. అలా సగంలోనే ఆపేయడం వల్ల.. మన శరీరంలోని బ్యాక్టీరియా పూర్తిగా చావదు సరికదా.. మనం అరకొరగా వేసిన యాంటీబయాటిక్ ఔషధానికి నిరోధకత సంతరించుకుంటుంది. అలాగే కొంత మంది.. అయినదానికి కాని దానికీ.. చీటికీమాటికీ విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడేస్తుంటారు. అలాంటి సందర్భాల్లో కూడా సూక్ష్మజీవులు ఔషధ నిరోధకతను సంతరించుకుంటాయి. అలాంటివాటినే సూపర్ బగ్స్ అంటారు. సూపర్‌బగ్‌గా మారిన ఆ బ్యాక్టీరియా వేరేవారికి సోకితే.. వారికి ఆ 4-5 రకాల యాంటీబయాటిక్స్ ఔషధాలు ఇచ్చినా పని చేయవు. వేరే యాంటీబయాటిక్ ఔషధం ఏదైనా ఇవ్వాల్సి ఉంటుంది. యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ ఔషధాలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. మన నిర్లక్ష్యం కారణంగానే కాక.. వ్యవసాయంలో, పశుసంవర్థక రంగంలోనూ యాంటీబయాటిక్స్ వినియోగం అధికం కావడం కూడా సూపర్ బగ్స్ పెరుగుదలకు కారణమవుతోందని హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి కన్సల్టెంట్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ సంచితా మిత్రా వివరించారు.

చివరి దశ ఔషధం..

మానవాళికి అందుబాటులో ఉన్న పలు రకాల యాంటీబయాటిక్ ఔషధాలకు సైతం లొంగని ఈ-కొలి రకం గ్రామ్ నెగెటివ్ బ్యాక్టీరియాపై బ్రహ్మాస్త్రంగా, చివరి దశ ఔషధంగా కోలిస్టిన్‌ను వాడతారు. అత్యవసర సమయాల్లో రోగుల ప్రాణాలు కాపాడడానికి వాడాల్సిన ఇలాంటి ఔషధాలను కొన్ని ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా వాడేయడం వల్ల.. దానికి కూడా లొంగని సూపర్‌బగ్స్ తయారవుతాయనే ఆందోళన వైద్యనిపుణుల్లో వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే.. యాంటీబయాటిక్స్‌ను బాధ్యతతో, సమర్థంగా ఉపయోగించడానికి చాలా ఆస్పత్రులు స్టీవార్డ్‌షిప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని డాక్టర్ సంచిత తెలిపారు. అందులో భాగంగా.. ఔషధం ఎంపిక, మోతాదు (డోస్), ఉపయోగించే వ్యవధి, వాడే పద్ధతి వంటివాటిని వైద్యులు నిర్ణయిస్తారని.. తమ క్లినిక్‌లో ఏదైనా అంటువ్యాధిని గుర్తించినప్పుడు.. స్టీవార్డ్‌షిప్ విధానంలో సూచించిన తొలి దశ (ఫస్ట్ లైన్) యాంటీబయాటిక్ మందులు వాడతారని వివరించారు.దానికి రోగి స్పందించకపోయినా, అంటువ్యాధి తీవ్రమైనా రెండోదశ ఔషధానికి మారతారని చెప్పారు. ఇలా ఒక పద్ధతి ప్రకారం వాడటం వల్ల..మానవాళి ప్రాణాలను కాపాడుతున్న ముఖ్యమైన యాంటీబయాటిక్ ఔషధాల ప్రభావం పోకుండా కాపాడుకోగలుగుతామని,సూపర్‌బగ్స్ వ్యాప్తిని నియంత్రించగలుగుతామని అన్నారు.

శుభ్రత.. వ్యర్థాల నిర్వహణ కీలకం..

ఆస్పత్రిలో వ్యాధులు వ్యాపించకుండా ఉండటానికి కేవలం మందులు, శస్త్రచికిత్సలు మాత్రమే కాక.. చేతుల శుభ్రత కూడా కీలకమేనని డాక్టర్ సంచిత తెలిపారు. ఆస్పత్రులు తమ సిబ్బందికి సరైన రీతి లో టీకాలు వేయించాలని.. వారి దుస్తులు, రోగుల పడకలపై వేసే దుప్పట్లు వంటివి శుభ్రంగా ఉండాలని చెప్పారు. ఆస్పత్రి వ్యర్థాల్లో ఉండే యాంటీబయాటిక్, యాంటీ మైక్రోబియల్ ఔషధాల అవశేషాలు కూడా సూపర్‌బగ్స్‌కు కారణమవుతాయని.. కాబట్టి వినియోగించిన తర్వాత మిగిలిన యాంటీబయాటిక్ స్ట్రిప్స్, గడువు ముగిసిన, ముగియబోతున్న మందులను నేరుగా ఆస్పత్రి మురుగునీటి వ్యవస్థలో పారవేయవద్దని డాక్టర్ సంచిత సూచించారు. ఆ వ్యర్థాలను జీవ వైద్య వ్యర్థ నిర్వహణ కేంద్రాలకు పంపించాలన్నారు. అలాగే.. మెడికేటెడ్ సబ్బులు, ఫ్లోర్ క్లీనర్లు, కౌంటర్ వద్ద సులభంగా దొరికే మాత్రలు, సిరప్‌లు, ఇతర మందుల మిగులు భాగాలను మురుగు నీటిలో పారవేయడం ద్వారా మనకు తెలియకుండానే అనేక యాంటీమైక్రోబియల్ రసాయనాలు పర్యావరణంలో కలుస్తున్నాయని.. అలా చేయొద్దని ఆమె హెచ్చరించారు. వైద్య పరిజ్ఞానంతో పాటు వ్యర్థాల నిర్వహణ, శుభ్రత, స్టీవార్డ్‌షిప్ ప్రోగ్రాములను పాటించడం వల్లనే సూపర్‌బగ్స్ నుంచి కాపాడుకోగలమని స్పష్టం చేశారు.



పల్నాడు జిల్లా దుర్గి మండలం నిదానంపాడు సమీపంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అక్రమంగా తవ్వి తీసిన గ్రావెల్ క్వారీలు

మాచర్లలో మైనింగ్ దందా

(మొదటి పేజీ తరువాయి)

అక్రమ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పిన్నెల్లి సోదరులు దుర్గి మండలంలోని ఆత్మకూరు, నిదానంపాడు, మాచర్ల మండలంలోని రాయవరం, అలుగురాజుపల్లి, తాళ్లపల్లి, వెల్దుర్తి మండలంలోని గుడిపాడు చెరువులో గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. దుర్గి మండలంలోని నిదానంపాడు, మాచర్ల మండలంలోని తాళ్లపల్లిలో అటవీ శాఖకు చెందిన భూములను ఆక్రమించి మరీ గ్రావెల్ క్వారీలు నిర్వహించారు. అక్కడ తీసిన గ్రావెల్‌ను కొత్తగా నిర్మించే సిమెంట్ ఫ్యాక్టరీలు, ప్రభుత్వ రోడ్లకు సరఫరా చేసి సొమ్ము చేసుకున్నారు. నియోజకవర్గంలో మరికొన్ని చోట్ల గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. అవి కూడా పిన్నెల్లి కనుసన్నల్లోనే జరిగినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

ఇవీ అక్రమాలు...

- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పిన్నెల్లి సోదరుల అక్రమ మైనింగ్ దందాపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. భారీగా అక్రమాలకు పాల్పడినట్టు అధికారులు నిగ్గు తేల్చారు. అధికారుల అంచనా ప్రకారం..
- మాచర్ల మండలంలోని రాయవరం, అలుగురాజుపల్లి, తాళ్లపల్లిలో 5 లక్షలా 17 వేల క్యూబిక్ మీటర్లలో గ్రావెల్ తవ్వకాలు జరిపారు. మొత్తం రూ.35 కోట్ల విలువ చేసే గ్రావెల్ తరలించారు.
- దుర్గి మండంలోని నిదానంపాడు, ఆత్మకూరులో 2 లక్షలా 55 వేల క్యూబిక్ మీటర్లలో గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. మొత్తం రూ.20 కోట్ల విలువ చేసే గ్రావెల్ తవ్వారు.
- వెల్దుర్తి మండలంలోని గుడిపాడు చెరువులో 1 లక్ష 33 వేల క్యూబిక్ మీటర్లలో గ్రావెల్ తవ్వకాలు జరిపారు. ఈ ప్రాంతంలో రూ.45 కోట్ల విలువ చేసే గ్రావెల్ తరలించారు.
- ఈ మొత్తం సొమ్ము పిన్నెల్లి సోదరుల జేబుల్లోకి వెళ్లినట్లు అధికారులు నిర్ధారించినట్లు సమాచారం. విచారణ వివరాలను రేపో, మాపో ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలుస్తోంది.

క్వార్ట్జ్, నాపరాయి...

కేవలం గ్రావెల్ తవ్వకాల్లోనే రూ.100 కోట్ల వరకు దోచుకున్న పిన్నెల్లి సోదరుల మరో మైనింగ్ దందాపై కూడా విచారణ కొనసాగుతోంది. మాచర్ల నియోజకవర్గంలో కారంపూడి మండలం సన్నెగండ్ల సమీపంలో సింగరుట్ల దేవస్థానం భూముల్లో క్వార్ట్జ్ తవ్వకాలపై విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అత్యంత విలువైన క్వార్ట్జ్‌ను ఎలాంటి అనుమతి లేకుండానే తవ్వి తీసి, తరలించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. అప్పట్లోనే ఈ వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు వచ్చినా పట్టించుకున్నవారే లేరు. ప్రభుత్వం మారిన తరవాత క్వార్ట్జ్ తవ్వకాలపై విచారణ చేపట్టారు. ఇక మాచర్ల నియోజకవర్గంలో రూ.కోట్ల విలువైన నాపరాయి తవ్వి తీసి స్టోన్ క్రషర్లకు సరఫరా చేశారని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. వాటికి సుమారు రూ.70 కోట్ల వరకు రాయల్టీ రూపేణా చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.